www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తొలిదశ పోలింగ్ 62.37 శాతం

త్రిపురలో అత్యధికంగా 80.1%.. బిహార్‌లో కేవలం 48.5%

21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 చోట్ల ఎన్నికలు

ఓటు హక్కు వినియోగించుకున్న 16.63 కోట్ల మంది ఓటర్లు

అండమాన్‌లో తొలిసారి ఓటు వేసిన షోంపెన్ ఆదివాసులు

తమిళనాడు పోలింగ్ కేంద్రాల్లో ముగ్గురు వృద్ధుల మృతి

ఈవీఎంపీవో బంద్.. నాగాలాండ్‌లోని 6 జిల్లాల్లో ఓటింగ్ జీరో

ఆ పరిధిలోని 20 మంది ఎమ్మెల్యేలూ ఓటుహక్కుకు దూరమే!

2



లక్షద్వీప్‌లోని కిల్తాన్ దీవికి పోలింగ్ సామగ్రితో పడవల్లో బయలుదేరిన సిబ్బంది

శనివారం | 20-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 4 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 10.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పుబ్బ మ 2.04 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.11-11.59; దుర్ముహూర్తం: ఉ. 5.59-7.39; అమృతఘడియలు: ఉ. 6.50-8.38; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మేం మాట్లాడుతుంటే వైసీపీకి

దడదడ

ఓటమి భయంతోనే కోర్టుకెళ్లారు

కడప కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకైనా వెళ్తాం

చార్జిషీటు అందరికీ అందుబాటులోనే

అవినాశ్ అఫిడవిట్‌లోనూ ఈ కేసు!

ఇవేమీ మాట్లాడొద్దంటే ఎలా?

వివేకా కుమార్తె సునీత ప్రశ్న



పులివెందుల, ఏప్రిల్ 19: 'హత్య విషయంపై మేం అక్కాచెల్లెళ్లం మాట్లాడుతుంటే వైసీపీ నేతలకు ఓడి పోతామనే భయం పట్టుకుంది. అందుకే కోర్టుకు వెళ్లారు. అయినా వీరు వేసిన పిటిషన్‌లో కోరింది ఒకటి.. కోర్టు ఇచ్చిన ఆర్డర్ మరొకటి. దీనిపై సుప్రీంకోర్టుకైనా వెళ్తాం' అని హత్యకు గురైన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత వెల్లడించారు. ఆమె శుక్రవారం

మిగతా 11వ పేజీలో...

అడిగింది వివేకా కేసులో..

ఉత్తర్వులిచ్చింది అన్ని కేసుల్లో!

కడప జిల్లా కోర్టు ఆదేశాలపై 11

విపక్షాలు, న్యాయవాద వర్గాల విస్మయం

ఇవి సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం

జిల్లా వైసీపీ అధ్యక్షుడు పిటిషన్ వేస్తే ఇంత విస్తృత ఆదేశాలా.. అప్పీల్ యోచనలో విపక్షాలు



ఆలూరులో ప్రజాగళం సభకు హాజరైన జనం

చివరి చాన్స్

ఆయన నైజం దోపిడీ, విధ్వంసమే: చంద్రబాబు

ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు దోచాడు

విదేశీ బ్యాంకుల్లో దాచుకున్నాడు

వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశాడు

నాడు కోడికత్తి.. నేడు గులకరాయి డ్రామా

ఆరోగ్యశ్రీ బిల్లులివ్వకుండా పేదలతో ఆటలు

రాయలసీమను విస్మరించిన ద్రోహి

ఇలాంటి విధ్వంసకారుడు అవసరమా?

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం

వలంటీర్లకు పది వేల వేతనం ఇస్తాం

ప్రజాగళంలో టీడీపీ అధినేత స్పష్టీకరణ

నిన్న మొన్నటి వరకు పరదాలు కట్టుకుని తిరిగిన జగన్.. నేడు ఓట్ల కోసం మళ్లీ మీ ముందుకొస్తున్నాడు.. నెత్తిన చేయి పెట్టబోతున్నాడు.. తస్మాత్ జాగ్రత్త! - చంద్రబాబు

కర్నూలు/అనంతపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జలగన్న జగన్‌కు ఇదివరకు ఇచ్చిన ఆ ఒక్క చాన్సే.. చివరి చాన్స్ కావాలని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. దోపిడీ, విధ్వంసమే సీఎం జగన్ నైజమని మండిపడ్డారు. అధికారం కట్టబెడితే వ్యవస్థలను నాశనం చేశాడన్నారు. గత ఐదేళ్లలో

మిగతా 14వ పేజీలో...

వైసీపీకి ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్టే

ప్రత్యేక హోదా తెచ్చావా... రాజధాని కట్టావా? 3

కడప స్టీల్‌కు పదేపదే శంకుస్థాపనలా?.. ఐదేళ్ల పాలనలో ప్రజల చేతికి చిప్పే మిగిలింది

జగన్ ప్రభుత్వంపై వైఎస్ షర్మిల మండిపాటు.. కర్నూలు జిల్లాలో 'ఏపీ న్యాయ్ యాత్ర'

ఆదోని సభలో వైసీపీ మూకల కవ్వింపులు.. 'మీ అన్న దేనికి సిద్ధం' అంటూ షర్మిల ఆగ్రహం



సీఎంవోలో సర్వాంతర్యామి

పేరుకే ముఖ్యమంత్రి జగన్

తతంగమంతా సీఎం కార్యదర్శిదే

చెబితే సీఎస్ అయినా వినాలి

సంబంధం లేని పనుల్లో పెత్తనం

ఇతర కార్యదర్శుల పనీ ఆయనే

అలాట్‌మెంట్ ఆర్డర్‌కు విరుద్ధంగా జగన్ 'ఆత్మ' పనులు

ఫైలు పంపాలని మొదట లేఖలు

ఆ తర్వాత ఆయన లాగిన్‌కే వచ్చేలా పేషీ నుంచి మంత్రాంగం

వ్యవహారమంతా ధనుంజయ్‌దే!



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్ తనకు రూల్స్ వర్తించవనుకుంటారు. ఎవరైనా గుర్తుచేస్తే.. 'అంతా నా ఇష్టం' అనుకుంటారు. ముఖ్యమంత్రిగా ఏం చేసినా చెల్లుబాటవుతుందనుకుంటారు. ఈసీ కూడా తనకెదురు రావొద్దనుకుంటారు. జగన్‌కు కార్యదర్శిగా పనిచేస్తున్న ధనుంజయ్‌రెడ్డి కూడా సేమ్ టు సేమ్ అలాగే వ్యవహరిస్తున్నారు. సీఎంవోలో సబ్జెక్టు అలాట్‌మెంట్ ఆర్డర్‌కు పూర్తి విరుద్ధంగా అన్నీ తానై చక్రం తిప్పుతున్నారు. ఇతరుల పనుల్లో తలదూరుస్తున్నారు. అంతేకాదు.. ఇతర కార్యదర్శులు చేయాల్సిన పని కూడా ఆయనే చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఆత్మ అంటే ఇలాగే ఉండాలన్నట్లుగా అన్నీ తానై సర్వాంతర్యామిగా వ్యవహరిస్తున్నారు. జగన్‌రెడ్డి పేరుకే సీఎం. మొత్తం తతంగమంతా ధనుంజయ్‌రెడ్డిదే. ఆయన

మిగతా 11వ పేజీలో...

రాజకీయ రంగమార్తాండ!

అబ్బ ఛా... అనిపించే స్థాయిలో జగన్నాటకం

ఇవేనా ఇళ్లు?

ఇళ్ల నిర్మాణంపై జగన్ కట్టుకథలు

110 దాటేస్తాం!

చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి ఠాకూర్

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..



12

13



మంత్రి సిబ్బంది బెదిరింపులకు

మహిళ బలి

హైదరాబాద్‌లో మంత్రి బీఎండబ్ల్యూ కారుకు ప్రమాదవశాత్తు స్కూటీని తగిలించిన బాలుడు

కారుకు చిన్న స్క్రాచ్.. ఆగ్రహోదగ్రులైన ఇద్దరు డ్రైవర్లు

రిపేరుకు రూ.20 వేలు ఇవ్వండి.. మా సారు సాయంత్రందాకా టైమిచ్చారు

లేదంటే కేసు పెడతాం.. మీ మైనర్ కొడుకు జైలుకు పోతే ఇక రాడు

బాలుడి తండ్రికి ఫోన్లో హెచ్చరిక.. వాయిదాల్లో కడతామని బతిమాలినా 'నో'

ఆందోళనకు గురైన బాలుడి తల్లి.. ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య 11

అదుపులో ఇద్దరు డ్రైవర్లు.. పోలీసుల గోప్యత

అది బుగ్గన కారే? ఎఫ్ఐఆర్‌లో స్కూటీ నంబరు

కారు నంబరు, యజమాని పేరు చేర్చని పోలీసులు

టార్గెట్ బొండా?

11

బెజవాడలో పోలీసుల హల్‌చల్.. హైడ్రామా

గులకరాయి ఘటనలో అరెస్ట్ చేస్తారని ప్రచారం



కాషాయ రంగులోకి దూరదర్శన్ లోగో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారత ప్రభుత్వ నిర్వహణలోని దూరదర్శన్ చానెల్ తన లోగోను మార్చుకుంది. సంస్థ ప్రారంభమైన నాటి నుంచి ఎరుపు రంగులో ఉన్న లోగో తాజాగా కాషాయంలోకి మారింది. ఏప్రిల్ 16 నుంచి ఇది అమల్లోకి వచ్చినట్లు సోషల్ మీడియా ద్వారా డీడీ న్యూస్ ప్రకటించింది. ఈ సందర్భంగా.. లోగో మారింది తప్ప చానెల్ విలువల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. "వేగం కంటే కచ్చితత్వాన్ని, అబద్ధాల కంటే నిజాన్ని, సంచలనాల కంటే సత్యాన్ని మాత్రమే ముందుంచే దూరదర్శన్.. తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది" అని పోస్ట్ చేసింది.

తొలి దశలో 62.37%

త్రిపురలో అత్యధికంగా 80.1%.. బిహార్‌లో కేవలం 48.5% పోలింగ్

» 21రాష్ట్రాల్లో 102 స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు నడినెత్తిన నిప్పులు చెరుగుతున్నా.. వడగాడ్పులు వీస్తున్నా.. శుక్రవారం దేశవ్యాప్తంగా 16.63 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల వర్షం కురుస్తున్నా కూడా.. ఓటర్లు ఓపిగ్గా లైన్‌లో నిలబడి ప్రజాస్వామ్యంలో తమ పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయం వరకూ అందిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల సమరం తొలి దశలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 62.37% ఓటింగ్ నమోదైంది. కొన్నిచోట్ల నుంచి ఇంకా పూర్తిగా వివరాలు అందనందున.. పోలింగ్ శాతాలు ఇంకా పెరిగే అవకాశం ఉందని ఈసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా.. ఎన్నికల తొలిదశలో భాగంగా ఏడు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం అన్ని స్థానాలకూ (తమిళనాడు-39, ఉత్తరాఖండ్-5, అరుణాచల్ ప్రదేశ్-2, మేఘాలయ-2, అండమాన్ నికోబార్ దీవులు-1, మిజోరాం-1, నాగాలాండ్-1, పుదుచ్చేరి-1, సిక్కిం-1, లక్షద్వీప్-1) పోలింగ్ ముగిసింది. అలాగే.. రాజస్థాన్ లో 12 స్థానాలు, ఉత్తర ప్రదేశ్‌లో 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లో 6 స్థానాలు, అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లో ఐదేసి స్థానాలు, బిహార్‌లో 4 స్థానాలు, పశ్చిమబెంగాల్‌లో 3 స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయలలో చెరి రెండు స్థానాలు, అండమాన్, ఛత్తీస్ గఢ్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, త్రిపురలో చెరి ఒక స్థానాలకు పోలింగ్ ముగిసింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో లోక్‌సభ స్థానాలతోపాటు అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు జరిగాయి. అక్కడక్కడా చెదురుమదురు హింసాత్మక ఘటనలు మినహా.. శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురలో అత్యధికంగా 80.17 శాతం ఓటింగ్ నమోదు కాగా.. 77.57% ఓటింగ్‌తో పశ్చిమబెంగాల్ రెండో స్థానంలో నిలిచింది.



అసోంలోని శివసాగర్‌లో మహిళా ఓటర్ల క్యూ

మణిపూర్‌లో 69.13% ఓటింగ్

ముహూర్తాల సీజన్ కావడంతో.. చాలా మంది నవ దంపతులు పెళ్లిదుస్తుల్లోనే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. చాలామంది దివ్యాంగులు, వృద్ధులు, వీల్‌చెయిర్లలో, స్ట్రెచర్లపై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, అండమాన్ నికోబార్, అసోంలో కొన్ని బూత్‌లలో ఈవీఎంలలో చిన్నపాటి సమస్యలు వచ్చాయి. పశ్చిమబెంగాల్‌లో 3 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం పోలింగ్ జరగ్గా.. వాటిలో కూచ్‌బేహార్ నియోజకవర్గంలో హింస చెలరేగింది. మణిపూర్‌లో 69.13% ఓటింగ్ నమోదైంది. నాగాలు, కుకీలు అత్యధిక సంఖ్యలో ఉండే చండేల్‌లో అత్యధికంగా 85.54శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 63.41 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమిళనాడులో 72.09 శాతం ఓటింగ్ నమోదైంది. సేలం, తిరువళ్లూరు జిల్లాల్లో ముగ్గురు వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి.. ఓటేయకుండానే తుదిశ్వాస విడిచారు. అండమాన్ దీవుల్లో 56.87% ఓటింగ్ నమోదైంది. అక్కడ.. షోంపెన్ తెగకు చెందిన ఏడుగురు ఆదివాసులు తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిహార్‌లో అత్యల్పంగా 48.5% ఓటింగ్ నమోదైంది.



శుక్రవారం ఓటు వేసిన తర్వాత షోంపెన్ ఆదివాసీ

నాగాలాండ్‌లో ఆరుజిల్లాల్లో సున్నా శాతం ఓటింగ్

'ఫ్రాంటియర్ నాగాలాండ్ టెరిటరీ' డిమాండ్‌తో.. ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీవో) ఇచ్చిన నిరవధిక బంద్ పిలుపు కారణంగా నాగాలాండ్‌లోని ఆరుజిల్లాల్లో సున్నా శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ సిబ్బంది దాదాపు 9 గంటలపాటు 738 బూత్‌ల్లో ఓపిగ్గా వేచి చూసినా.. 4 లక్షల మంది ఓటర్లలో ఒక్కరు కూడా వచ్చి ఓటేయలేదు. 20 శాసనసభ స్థానాల పరిధిలోని 20 మంది ఎమ్మెల్యేలు సైతం ఓటింగ్‌లో పాల్గొనలేదంటే అక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తమిళనాడులో బీజేపీ బోణీ?

తమిళనాడులో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనైనా బోణీ కొట్టాలనే లక్ష్యంతో విస్తృతంగా ప్రచారం చేసిన బీజేపీ.. తన ఓటుశాతాన్ని గణనీయంగా పెంచుకున్నట్టు తెలుస్తోంది. ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ అన్నామలై పోటీచేసిన కోయంబత్తూర్‌లో ఈసారి 71.17% పోలింగ్ నమోదైంది. ఇది 20 ఏళ్ల అత్యధికం. గత ఎన్నికల్లో 37 స్థానాలు గెలుచుకున్న డీఎంకే కూటమి ఈసారి 30 స్థానాలు దాటకపోవచ్చునని అంచనా. ఈసారి బీజేపీ ఓట్లు 15-20% పెరగవచ్చని ప్రముఖ తమిళ రచయిత మాలన్ అభిప్రాయపడ్డారు.

ఇద్దరు యువరాజుల సినిమాను జనం ఎప్పుడో తిరస్కరించారు

» రాహుల్ గాంధీ, అఖిలేశ్ పొత్తుపై మోదీ ఎద్దేవా

అమ్రోహా(యూపీ), ఏప్రిల్ 19: ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో చేతులు కలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌లపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఈ ఇద్దరు యువరాజులు కలిసి తీసిన సినిమాను ప్రజలు ఏనాడో (2017) తిరస్కరించారని గుర్తుచేశారు. అయినా 'దో షెహజాదీ కీ జోడీ(ఇద్దరు యువరాజుల జోడీ)' సినిమా షూటింగ్‌ను వారు కొనసాగిస్తున్నారని ఎద్దేవాచేశారు. శుక్రవారం ఆయన అమ్రోహాలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించారు. 'యూపీ ప్రజలను వీరు ఓట్లు అడిగేందుకు వచ్చినప్పుడల్లా.. కుటుంబం, అవినీతి, బుజ్జగింపు రాజకీయాల పెట్టెతో వస్తారు. మన మతవిశ్వాసాలపై దాడిచేయడానికి ఏ మాత్రం సంకోచించరు' అని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో పశ్చిమ యూపీని తగులబెట్టారని, మతకల్లోలాలు సృష్టించారని ఆరోపించారు. యోగి ప్రభుత్వం వచ్చాక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి ప్రజలకు భద్రత కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి శక్తులు మళ్లీ బలపడకుండా చూడాలని పిలుపిచ్చారు. ఇదిలా ఉండగా, ఎలక్టోరల్ బాండ్ల విధానం ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీ పథకమన్న రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. ప్రతిపక్ష పార్టీలు కూడా బాండ్ల ద్వారా విరాళాలు సేకరించాయని, అది కూడా దోపిడీయేనా అని ప్రశ్నించారు. ఆయన గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానానికి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

రేప్ చేసి.. బెల్టుతో కొట్టి.. గాయాలపై కారం

» ఎంపీలో నెల రోజులు యువతికి నరకం చూపిన ఉన్మాది

భోపాల్, ఏప్రిల్ 19: ఆ దుర్మార్గుడి చేతిలో ఆ యువతి చూసింది మాటల్లో చెప్పలేనంత నరకం!! ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడటమే కాదు.. బెల్టు, నీళ్ల పైపుతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆమె ఒళ్లంతా పచ్చి పుండులా తయారైతే.. ఆ గాయాల మీద కారం పొడి చల్లి పైశాచిక ఆనందం పొందాడు. ఆమె పట్ల ఈ దారుణ చేష్టలను ఒక ట్రెండురోజులు కాదు.. ఏకంగా నెలరోజులు సాగించాడు. మధ్యప్రదేశ్ గుణలోని శివపురిలో ఈ ఘోరం వెలుగుచూసింది. బాధిత యువతి వయసు 23 ఏళ్లు! నిందితుడు ఆమె ఇంటి పొరుగున ఉండే వ్యక్తే. ఒకానొక రోజు ఆమెను బలవంతంగా తన ఇంట్లోకి ఎత్తుకెళ్లి ఓ గదిలో నిర్బంధించాడు. తనను పెళ్లి చేసుకోవాలని, ఆమె కుటుంబానికి ఉన్న ఆస్తినంతా తన పేరిట రాయాలని ఒత్తిడి చేస్తూ ఆ ఉన్మాది ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే అతడి చెర నుంచి ఎలాగోలా తప్పించుకున్న బాధితురాలు.. రాత్రంతా ఐదు కిలోమీటర్లు నడిచి ఓ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

సివిల్స్ టాపర్ ఆదిత్యకు 1,099 మార్కులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు నిర్వహించిన సివిల్స్-2023లో ఎంపికైన అభ్యర్థులు సాధించిన మార్కులను యూపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. మొత్తం 2,025 మార్కులకుగాను టాపర్ ఆదిత్య శ్రీవాత్సవ 1099 మార్కులు సాధించారు. రెండో ర్యాంకర్ అనిమేశ్ ప్రధాన్‌కు 1,067 మార్కులు, మూడో ర్యాంకు సాధించిన తెలంగాణ యువతి దోనూరు అనన్య రెడ్డికి 1,065 మార్కులు వచ్చాయి.

సూపర్‌మార్కెట్‌లో చోరీకి యత్నం

» అమెరికాలో ఇద్దరు తెలుగు అమ్మాయిల అరెస్ట్!

హైదరాబాద్, ఏప్రిల్ 19: అమెరికాలోని ఓ సూపర్ మార్కెట్‌లో చోరీ యత్నం చేసిన ఇద్దరు తెలుగు అమ్మాయిలు పోలీసులకు దొరికిపోయారు. హైదరాబాద్, గుంటూరుకు చెందిన విద్యార్థినులు భవ్య, యామిని.. న్యూజెర్సీలోని స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వీరిద్దరూ మార్చి 19న ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లారు. రెండు వస్తువులకు మాత్రం బిల్లు చెల్లించి.. 27 వస్తువులను బ్యాగులో వేసేసుకొని వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు దుకాణానికి రావడంతో ఇద్దరు విద్యార్థినులు.. తాము రెట్టింపు చెల్లిస్తామని ప్రాధేయపడ్డారు. మరోసారి ఇలాంటి తప్పు చేయబోమని చెప్పారు. కానీ, పోలీసులు వారిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరవ్వాలంటూ సమన్లు ఇచ్చి విడుదల చేశారు.

స్కాట్లాండ్‌లో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

లండన్, ఏప్రిల్ 19: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన ఇద్దరు ఏపీ విద్యార్థులు.. ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందారు. ఈ దుర్ఘటన స్కాట్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. మృతిచెందిన వారిని జితేంద్రనాథ్ కరుటూరి (26), చాణక్య బొలిశెట్టి (22)గా గుర్తించారు. ఈ ఇద్దరూ స్కాట్లాండ్‌లోని డుండీ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నారు. బుధవారం సాయంత్రం ఈ ఇద్దరూ స్నేహితులతో కలిసి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పెర్త్‌షైర్‌లోని లిన్ ఆఫ్ టమ్మెల్‌కు వెళ్లారు. రెండు నదులు కలిసే ఈ ప్రాంతంలో వారు ట్రెక్కింగ్ చేస్తుండగా వారు జారి నీటిలో పడ్డారు.

సూర్యప్రతాపంతో ఉక్కిరిబిక్కిరి

» సీతంపేటలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. వడగాడ్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సెగ, వెచ్చని గాలి, ఉక్కపోతతో అసౌకర్యవంతమైన వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం 61 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. 117 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. మన్యం జిల్లా సీతంపేటలో అత్యధికంగా 46, సాలూరులో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా సింహాద్రిపురంలో 45.6, నంద్యాల జిల్లా బనగానపల్లె, ప్రకాశం జిల్లా మేకలవారిపాలెంలో 45.5, విజయనగరం జిల్లా రామభద్రాపురంలో 44.9, తిరుపతి జిల్లా మంగనెల్లూరు 44.5, చిత్తూరు జిల్లా పీపల్లిలో 44.4డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎన్ఎస్‌జీ చీఫ్‌గా నళిన్ ప్రభాత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దేశంలో ఉగ్రవాదాన్ని నిరోధించే ఎన్ఎస్‌జీ అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర సిబ్బంది, వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నళిన్ ప్రభాత్ ఏపీ క్యాడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి.. ఆయన ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఆయన కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లే ముందు ఉమ్మడి ఏపీలోనూ వివిధ హోదాల్లో పనిచేశారు.

భారత్‌కు ఐరన్ డోమ్?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారత్‌లో కూడా ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తరహాలో గగనతల రక్షణ వ్యవస్థ(ఎయిర్ డిఫెన్స్)ను ఏర్పాటు చేయనున్నారు. తక్కువ ఎత్తు నుంచి జరిగే గగనతల దాడులను ఈ వ్యవస్థ ఎదుర్కొంటుంది. భారత్-అమెరికా కలిసి ఈ వ్యవస్థను రూపొందించనున్నాయి. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో భాగంగా స్ట్రైకర్ ఏ1 వాహనాల ఛాసిస్‌లను భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడే రూపొందిస్తారు. వీటికి గగనతల దాడులను ఎదుర్కొనే లేజర్ ఆధారిత ఆయుధ వ్యవస్థ ఎం-షోరాడ్‌ను అమరుస్తారు. వీటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇందులో సంప్రదాయ క్షిపణులను ఎదుర్కొనే వ్యవస్థతో పాటు 50 కిలోవాట్ల శక్తి కలిగిన లేజర్ ఆయుధ వ్యవస్థ కూడా ఉంటుంది. సరిహద్దుల్లో తక్కువ ఎత్తు నుంచి వచ్చే డ్రోన్లు, హెలికాప్టర్లను, గ్లైడర్లను ఎదుర్కోవడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయి. సరిహద్దుల వెంట సంచరిస్తూ ఈ వాహనాలు పాకిస్థాన్, చైనాల నుంచి వచ్చే తక్కువ ఎత్తు గగనతల దాడులను ఎదుర్కొంటాయి. మొత్తం 300 వాహనాలను భారత్-అమెరికాలు నిర్మిస్తాయి. స్ట్రైకర్ ఏ1 వాహనాలను అమెరికా ఎప్పుడో అభివృద్ధి చేసి, వినియోగంలోకి తెచ్చింది. అందులోకి అవసరమైన ఎం-షోరాడ్‌ను అమెరికా సమకూరుస్తుంది.

ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించిన భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారత్, ఫిలిప్పీన్స్ దేశానికి బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను సరఫరా చేసింది. 2022లో ఇరుదేశాల మధ్య కుదిరిన 375 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.31 వేల కోట్లు) ఒప్పందం మేరకు భారత వాయుసేనకు చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో క్షిపణులు, లాంచర్లతో కూడిన ఆయుధ వ్యవస్థను ఫిలిప్పీన్స్‌కు శుక్రవారం పంపించింది. డీల్ కుదిరిన రెండు సంవత్సరాల తర్వాత మొదటి దశ క్షిపణులను భారత్ సరఫరా చేసింది. ఈ సందర్భంగా భారత వాయుసేన అధికారులు, ఫిలిప్పీన్స్ అధికారులకు స్వీట్లు పంచారు. భారత్ ఓ విదేశానికి బ్రహ్మోస్ క్షిపణిని సరఫరా చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. చైనాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఫిలిప్పీన్స్‌కు ఈ బ్రహ్మోస్ క్షిపణులు ఎంతో ముఖ్యమైన రక్షణ ఆయుధాలుగా మారనునాయి.. వీటి ద్వారా ఆ దేశ పశ్చిమ తీరంలో రక్షణ రంగ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. కాగా భారత్, రష్యాతో కలిసి అభివృద్ధి చేసిన ఈ బ్రహ్మోస్ క్షిపణి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన(2.8 మ్యాక్ లేదా ధ్వనివేగం కంటే మూడు రెట్ల వేగం) సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందింది. భూమి, వాయు, జలమార్గాల ద్వారా ఈ బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించవచ్చు.

ఎన్నికల్లో ఓటర్ల విజ్ఞతే భవితకు నాంది

» పార్టీల అధినేతల మధ్య కుస్తీ పోటీలుగా రాజకీయాలు: ఆచార్య కొండవీటి చిన్నయ సూరి

» 'ఏపీలో ఎన్నికల తీరుతెన్నులు'పై చర్చా గోష్ఠి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 19: 'రాష్ట్ర అభివృద్ధి, సమాజ సమష్ఠి ప్రయోజనాలను పెంపొందించేందుకు రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో ఓటర్లు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలి. అదే వారి భవితకు నాందిగా మారుతుంది' అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుల కొండవీటి చిన్నయ సూరి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల తీరుతెన్నులు అనే అంశంపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన ప్రసంగించారు. '1952లో ఓటింగ్ శాతం 43 ఉండగా 2019 నాటికి అది 80 శాతానికి పెరిగిందన్నారు. ఓటర్లలో రాజకీయ పరిజ్ఞానం, విద్యా ప్రమాణాల అభివృద్ధి చెంది ఓటింగ్ శాతం పెరుగుతుందని, అదే సందర్భంలో రాజకీయ అవినీతి, నిరంకుశ నాయకత్వం, సహజ వనరుల దోపిడీ కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. నేడు రాజకీయాల్లో ధనవంతులు, వ్యాపారవేత్తలు కీలక పాత్ర పోషిస్తూ ఓటర్లను కులం, మతం, ప్రాంతాల వారీగా విభజిస్తూ వారి ప్రయోజనాలను కాపాడుకుంటున్నారన్నారు. రాజకీయ పార్టీల మధ్య సైద్ధాంతికపరమైన భేదాలు క్షీణించి పార్టీల అధినేతల మధ్య కుస్తీ పోటీగా రాజకీయాలు మారుతుండటం సమాజ వికాసానికి మేలు జరగదన్నారు. ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రంగయ్య ప్రసంగిస్తూ అభ్యర్థుల ఎంపిక పార్టీ సభ్యుల ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయన్నారు. కార్పొరేట్ శక్తుల మధ్య పోటీగా రాజకీయాలు మారాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ... గతంలో అభ్యర్థుల ఎంపిక నైతిక విలువలు, త్యాగాల ప్రాతిపదికగా జరిగితే నేడు గెలుపు గుర్రాల పేరుతో ధన బలం, కుల బలం ఉన్నవారినే రాజకీయ పార్టీలు ఎంపిక చేస్తున్నాయన్నారు.

మైనారిటీ ఓట్లపై కమలం కన్ను

ముస్లిం, క్రిస్టియన్ల కొత్త ఓటు బ్యాంకుపై బీజేపీ నేతల దృష్టి

» మోదీ భాయిజాన్, స్నేహ యాత్ర వంటి ప్రత్యేక కార్యక్రమాలతో చేరువ



ఫైల్

సార్వత్రిక సమరంలో మూడోసారి విజయం దక్కించుకోవాలని లక్షించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మైనారిటీలను అక్కున చేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ అంటేనే హిందుత్వ అజెండా ఉన్నప్పటికీ ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లను కూడా ఈ ఎన్నికల్లో రాబట్టుకునేందుకు ప్రణాళికలు వేసి అమలు చేస్తోంది. మైనారిటీ వర్గాల్లో పెరుగుతున్న అభిప్రాయాల వైవిధ్యాన్ని ఉపయోగించుకోవాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో పాటు ఇతర పార్టీలు మైనారిటీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని, వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని కమలనాథులు ప్రచారం చేస్తున్నారు. మోదీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ముస్లింలు, క్రిస్టియన్లకు కూడా చేరుతున్నాయని వివరిస్తున్నారు. బీజేపీ హిందుత్వ అజెండాను అనుసరిస్తున్నా.. పార్టీలో ముస్లిం నాయకులకు ప్రాధాన్యం ఇస్తోంది. అదేవిధంగా బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆరెస్సెస్ లోనూ ముస్లిం విభాగం 'రాష్ట్రీయ ముస్లిం మంచ్' కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే, ముస్లింల ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకోవడం మాత్రం మోదీ ప్రధాని అయ్యాకే ప్రారంభంకావడం గమనార్హం. ముఖ్యంగా అరబ్ దేశాల ముఖ్య నేతలతో మోదీ స్నేహ సంబంధాలు పెంచుకోవడం దీనిలో ఒక భాగమని పరిశీలకులు పేర్కొంటున్నారు. మరోవైపు సాధారణ పరిస్థితులకు భిన్నంగా ముస్లింలు బీజేపీకి ఓట్లు వేస్తుండడం గమనార్హం. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ముస్లింల ఓట్లు గణనీయంగా పడ్డాయని లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే పేర్కొంది. 2009తో పోలిస్తే 2014లో బీజేపీకి ముస్లింల ఓట్లు రెట్టింపు అయినట్లు వివరించింది. 2021లో జరిగిన ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వేలో 19 శాతం మంది ముస్లిం ఓటర్లు 2019లో బీజేపీకి ఓటేసినట్టు చెప్పారు.

పస్మాందాలు కీలకం

ముస్లింలో ఓటుబ్యాంకును సొంతం చేసుకునే లక్ష్యంతో కదులుతున్న బీజేపీ.. వీరిలో పేదలుగా ఉన్న పస్మాందా వర్గాలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ వర్గానికి చెందిన ఎం. అబ్దుల్ సలామ్‌ను కేరళలోని మళప్పురం నియోజకవర్గంలో నిలబెట్టింది. అదేవిధంగా బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్న తారిక్ మన్సూర్‌ను ఎలక్షన్ మేనిఫెస్టో కమిటీలో నియమించింది. ఇక, దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలతో బీజేపీ నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 22 వేల సమావేశాలు నిర్వహించి.. వారిలో ఉన్న అసంతృప్తిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 20% మంది ముస్లింలు బీజేపీకి అనుకూలంగా మారడం ఖాయమని రాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ అన్నారు.

మోదీ భాయిజాన్

ముసింలను ఆకట్టుకునే క్రమంలో బీజేపీ గత ఏడాది 'మోదీ భాయిజాన్' ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అదేవిధంగా 23 లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్న 4,100 ముస్లిం ఆధిపత్య గ్రామాల్లో 'ఖామీ చౌపాల్' కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. అలాగే, గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని పస్మాందా ముస్లింలను ఆకట్టుకునేందుకు 27 జిల్లాల్లో 'స్నేహ యాత్ర'లను నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో ముస్లింల ఓటు బ్యాంకు 19 శాతానికి పైగా ఉంది. - సెంట్రల్ డెస్క్


క్రిస్టియన్ల కోసం

క్రిస్టియన్ ఓటు బ్యాంకు కోసం కూడా బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో క్రిస్టియన్లు ఎక్కువగా ఉన్న కేరళపై బాగానే ఆశలు పెట్టుకుంది. పాపులర్ ఫ్రెంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)ని నిషేధించడం ద్వారా క్రిస్టియన్లు ఉపశమనం పొందారని, వారంతా బీజేపీకి అనుకూలంగా ఓటేయడం ఖాయమని రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని.. స్నేహ యాత్రను ప్రారంభించి.. క్రిస్టియన్లను బీజేపీతో మమేకమయ్యేలా ప్రయత్నించారు. దీంతో పాటు, కేరళలోని క్రిస్టియన్లను ఆకర్షించడం ద్వారా వీరి ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లోనూ పుంజుకునేందుకు అవకాశం ఉంటుందని కమలనాథులు లెక్కలు వేసుకున్నారు.



ఫైల్

అవినాశ్‌రెడ్డిపై మూడు కేసులు



» వివేకా హత్య, నేరపూరిత కుట్ర, సాక్ష్యాధారాల ధ్వంసం కేసూ

» పోలీసు స్టేషన్‌లోనే అధికారులను బెదిరించిన కేసుల్లో దువ్వాడ శ్రీనివాస్

» బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌పై 2020లో హత్యాయత్నం కేసు

» అఫిడవిట్లలో వెల్లడించిన వైసీపీ అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లలో తమకు ఉన్న ఆస్తులు, అప్పులతోపాటు తమపై నమోదైన కేసుల వివరాలను కూడా వెల్లడించారు. వీటిలో సీఎం జగన్ సోదరుడు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల మేరకు ఆయనపై వివేకానందరెడ్డి దారుణ హత్య కేసు నమోదైంది. సీబీఐ ఈ కేసు నమోదు చేసింది. హత్యానేరం, నేరపూరిత కుట్ర, సాక్ష్యాధారాల ధ్వంసం వంటి ఆరోపణలతో ఈ కేసు నమోదు చేశారు. ఇది కాకుండా మరో రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇక, ఆస్తుల విషయానికి వస్తే అవినాశ్‌కు రూ.25.51 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అప్పులు రూ.9.11 కోట్లు ఉన్నాయి. ఆయన భార్య సమత పేరిట విశాఖపట్టణం, వల్లూరు, ఊటుకూరు, పొనకమిట్లలో 33.90 ఎకరాల భూమి ఉంది. అవినాశ్ రెడ్డి భార్య ఆస్తుల విలువ రూ.7.34 కోట్లుగా ఉంది.

పోలీసులపైనే దువ్వాడ దురుసు

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన దువ్వాడ శ్రీనివాస్‌పై రాష్ట్రంలో నాలుగు కేసులు, ఒడిశాలో రెండు కేసులు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌లో అధికారులపై దురుసుగా ప్రవర్తించినందుకు, ప్రభుత్వ ఉద్యోగులను అవమానించడం, బెదిరించడం వంటి సంఘటనలకు సంబంధించి ఈ కేసులు నమోదయ్యాయి. ఒడిశాలోని గజపతి జిల్లా పర్లాఖిమిడిలో 2010లో గనులు, భూగర్భశాఖకు సంబంధించి కట్టాల్సిన పన్నులు ఎగవేయడంతో ఓ కేసు పర్లాఖిమిడి కోర్టులో నడుస్తోంది. 2012లో ఆస్తుల మోసంపై మరోకేసు నమోదైంది. ఒడిశాలో ఐటీకి సంబంధించి(రూ.18 లక్షలు) ఓ కేసు ఉంది. అలాగే కమర్షియల్ ట్యాక్స్‌కు సంబంధించి(రూ.16.86 లక్షలు) మరో కేసు ఉంది.

నందిగంపై హత్యాయత్నం కేసు

బాపట్ల వైసీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్‌పై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో 2020లో హత్యాయత్నం కేసు నమోదయింది. ఇప్పటి వరకు చార్జిషీట్ ఫైల్ చేయలేదు. నందిగం సమర్పించిన అఫిడవిట్‌లో ఈ విషయం బహిర్గతమైంది.

చంద్రబాబుపై 24 కేసులు

» వాటిలో వైసీపీ పెట్టినవే 22

కుప్పం/చిత్తూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై 24 కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటిలో 22 కేసులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నమోదు చేసినవే. 2010లో ఆయన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించడానికి వెళితే అక్రమంగా ప్రవేశించారని ధర్మాబాద్ పోలీసులు కేసు పెట్టారు. 2012లో ఆళ్లగడ్డ ఉప ఎన్నిక సమయంలో కోడ్ ఉల్లంఘించారని కేసు నమోదైంది. ఇక మిగిలిన 22 కేసులూ వైసీపీ ఈ ఐదేళ్లలో పెట్టింది. 2020లో 5, 2021లో 9, 2022లో 2, 2023లో 6 కేసులు పెట్టారు. మంగళగిరిలో సీఐడీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 కేసులున్నాయి. 2023లో 2, 2022లో 1, 2021లో 3, 2020లో 2 కేసులను సీఐడీ పోలీసులు నమోదు చేశారు. కరోనా రెండో దశలో చంద్రబాబు 440కే వేరియెంట్ గురించి మాట్లాడి ప్రజల్లో భయాందోళన కలిగించారని గుంటూరు టౌన్ అరండల్‌పేట, పల్నాడు జిల్లా నరసరావుపేట టూ టౌన్, కర్నూలు వన్ టౌన్‌లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. వ్యాక్సిన్లు అందుబాటులో లేవని చెప్పినందుకు విజయవాడ నగరంలోని సూర్యాపేట స్టేషన్‌లో ఓ కేసు పెట్టారు. అన్నమయ్య జిల్లా ముదివేడు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల స్టేషన్లలో హత్యాయత్నం కేసులున్నాయి. ముదివేడు స్టేషన్ పరిధిలో టీడీపీ శ్రేణుల్ని వైసీపీ కార్యకర్తలపై చంద్రబాబు రెచ్చగొట్టి పంపించారని హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బంగారం లేదు!

చంద్రబాబు పేరుతో రూ.4.80 లక్షల చరాస్తులు, రూ.36.31 కోట్ల స్థిరాస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.2,22,500 విలువ చేసే ఓ అంబాసిడర్ కారు ఉంది. ఆయన పేరుతో బంగారం లేదు. బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి కుమారుడు నారా లోకేశ్‌తో కలిసి రూ.3.48 కోట్ల హౌసింగ్ లోన్ తీసుకున్నారు. అలాగే ఆయన భార్య భువనేశ్వరికి చరాస్తులు రూ.810.37 కోట్లు, స్థిరాస్తులు రూ.85.10 కోట్లు, అప్పులు రూ.6.83 కోట్లు ఉన్నాయి.

రికార్డుస్థాయిలో శ్రీవారి బంగారం!

- 1,031 కేజీల బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసిన టీటీడీ

తిరుమల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలతో కళకళలాడుతోంది. టీటీడీ గత ఏడాదిలో రికార్డుస్థాయిలో 1,031 కేజీల బంగారాన్ని (దాదాపు రూ.773 కోట్ల విలువ) వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. శ్రీవారిని దర్శించుకునే భక్తులు తమ స్థాయిని బట్టి హుండీలో కానుకలు సమర్పిస్తుంటారు. హుండీలో నగదుతో పాటు బంగారం, వెండి కూడా స్వామికి అందుతుంటుంది. పురాతన సంప్రదాయమైన నిలువుదోపిడి నేటికీ కొనసాగుతోంది. తాజా డిపాజిట్‌తో టీటీడీ బంగారం డిపాజిట్లు 11,329 కేజీలకు చేరుకున్నాయి. వీటి విలువ దాదాపు రూ.8,496 కోట్లు ఉండొచ్చని అంచనా. ఇక, నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయానికి వస్తే 2023-24 ఏడాదికి సంబంధించి రూ.1,161 కోట్లను టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. 2013 నుంచి పరిశీలిస్తే రూ.608 కోట్లు, 2014లో రూ.970 కోట్లు, 2015లో రూ.961 కోట్లు, 2016లో రూ.1,153 కోట్లు, 2017లో రూ.774 కోట్లు, 2018లో రూ.501 కోట్లు, 2019లో రూ.285 కోట్లు, 2020లో రూ.753 కోట్లు, 2021లో రూ.270 కోట్లు, 2022లో రూ.274 కోట్లు, 2023లో రూ.757 కోట్లు, 2024లో రూ.1,161 కోట్లు డిపాజిట్ చేసింది. కొవిడ్ అనంతరం గడచిన 25 నెలలుగా శ్రీవారి హుండీ ఆదాయం ప్రతినెలా రూ.వంద కోట్లకు తగ్గకుండా లభిస్తున్న విషయం తెలిసిందే. దీంతో టీటీడీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.18 వేల కోట్లకు చేరాయి. టీటీడీకి బంగారు, నగదు డిపాజిట్ల ద్వారా ఏడాదికి సుమారు రూ.1,200కోట్లు వడ్డీ రూపంలో అందుతున్నట్టు సమాచారం.

కొత్తగా రూ.47 వేల కోట్ల అప్పులకు అనుమతి

- ఇప్పటికే 4 వేల కోట్ల వాడకం
- వచ్చే మంగళవారం మరో 3 వేల కోట్ల అప్పు

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 6 నెలలకుగాను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. సాధారణంగా మొదటి 9 నెలలకు(ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు) అప్పులకు అనుమతిస్తారు. కానీ, ఈసారి సెప్టెంబరు వరకు మాత్రమే అనుమతిచ్చారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఈ రూ.47,000 కోట్ల అప్పులను మంగళవారం రిజర్వ్ బ్యాంకులో సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చుకోవచ్చు. ఇప్పటికే ఈనెల 2వ తేదీన రూ.4,000 కోట్ల అప్పులు తెచ్చారు. ఈనెల 23వ తేదీన ఇంకో రూ.3,000 కోట్ల అప్పులు తెస్తున్నారు. దీంతో ఒక్క ఏప్రిల్ లోనే రూ.7,000 కోట్ల అప్పులు అవుతున్నాయి. ఈనెల 30వ తేదీ కూడా మంగళవారమే. ఆ రోజు కూడా భారీగా అప్పులు తెచ్చే అవకాశాలున్నాయి. జగన్ సర్కారు దూకుడు చూస్తుంటే 6 నెలల పాటు వాడాల్సిన అప్పుల డబ్బును ఎన్నికలు ముగిసి కొత్త సర్కార్ కొలువుదీరేలోపే పూర్తిగా వాడేసేలా కనిపిస్తోంది.

22న డీసెట్ నోటిఫికేషన్

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యలో రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 22న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్, సమాచార బులెటిన్, పరీక్షా తేదీల వివరాలను 22 నుంచి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.



అచ్చంపేటలో సిద్ధం సభ జరుగుతుండగానే బయటకు వచ్చేస్తున్న జనం

మండుటెండలో నిలబెట్టేశారు

- 'తూర్పు'లో జగన్ యాత్రతో నరకం
- పెద్దాపురం ఏడీబీ రోడ్డులో బారికేడ్లు..
- అదే రోడ్డులో ఆస్పత్రి ఉండటంతో చికిత్స అవసరమైన రోగులకు అవస్థ
- పైగా ప్రశ్నించిన వ్యక్తిపై పోలీస్ దాడి
- పాలిటెక్నిక్ సెమిస్టర్ మిస్ అయిన విద్యార్థులు
- షాపులు బంద్, పోర్టుకు వెళ్లే లారీల ఆపివేత
- గండేపల్లిలో విద్యార్థుల ఝలక్
- జైపవన్ అంటూ నినాదాలు

కాకినాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ వచ్చారంటే చాలు, ప్రజలకు పోలీసులు ప్రత్యక్ష నరకం చూపించేస్తున్నారు. మండుటెండలో రహదారులను మూసేసి ప్రజలపై జులుం ప్రదర్శిస్తున్నారు. పసిపిల్లలు, గర్భిణులు ఉన్నారని చెప్పినా బారికేడ్ల అవతలే నిలబెట్టేస్తున్నారు. శుక్రవారం జగన్ పెద్దాపురం నియోజకవర్గం ఏడీబీ రహదారి మీదుగా సామర్లకోటకు చేరుకుని అక్కడినుంచి అచ్చంపేట సిద్ధం సభకు బయలుదేరతారనే అంచనాతో.. పోలీసులు ఉదయం ఏడుగంటల నుంచే రహదారులు మూసేశారు. పెద్దాపురం నుంచి ఏడీబీ రోడ్డుపైకి జనం రాకుండా బారికేడ్లు ఉంచారు. అదే రహదారిలో ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు, గర్భిణులు వెళ్లాల్సి ఉంది. వారంతా బతిమాలినా పోలీసులు పట్టించుకోలేదు సరికదా దురుసుగా ప్రవర్తించారు. ప్రశ్నించిన ఓ వ్యక్తిని కొట్టినంత పనిచేశారు. పోలీసుల తీరుతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్లే సామర్లకోట రోడ్డుపైనా గంటన్నర పాటు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. దీంతో జనం మండుటెండలో ఉండిపోయారు. పసిపిల్లలు ఎండకు ఏడుస్తున్నా పట్టించుకోలేదు. దీంతో జనం హారన్లు కొట్టి తిరగబడ్డారు. ఇదిలాఉంటే జగన్ సిద్ధం సభకు ఆరు జిల్లాల నుంచి 1400 బస్సులను కేటాయించారు. ఫలితంగా డిపోల్లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కళాశాలకు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నారు. ఈ సమయంలో బస్సును రాజానగరంవద్ద పోలీసులు నిలిపివేశారు. దీనివల్ల విద్యార్థులు సెమిస్టర్ పరీక్షకు హాజరు కాలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



రాజానగరం-కాకినాడ ఏడీబీ రోడ్డులోకి వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు పెట్టడంతో వాహనదారుల ఇక్కట్లు

జగన్ ఎదుట జై పవన్....

జగన్ బస్సు జగ్గంపేట నియోజకవర్గం ఆదిత్య కాలేజీ వద్దకు రాగానే ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్దఎత్తున గుమిగూడారు. జగన్‌కు అభివాదం చేసేందుకు కాలేజీ యాజమాన్యం వీరందరినీ రోడ్డుపై నిల్చోబెట్టింది. జగన్ బస్సు నుంచి కిందకు దిగుతుండగా, అక్కడున్న విద్యార్థులంతా 'జైపవన్..' అంటూ నినాదాలు చేశారు. మరికొందరు అయితే 'బాబులకే బాబు.. కళ్యాణ్‌బాబు' అంటూ నినదించారు. దీంతో జగన్ ముఖం మాడిపోయింది. అక్కడి నుంచి వెంటనే బస్సులోకి వెళ్లిపోయారు.

పోలీసులకు అనంతబాబు వార్నింగ్..

జగన్ సిద్ధం సభలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దర్జాగా ముందు వరుసలో కూర్చున్నారు. తనవద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసిన కేసులో జైలుకు వెళ్లిన అనంతబాబును వైసీపీ సస్పెండ్ చేసింది. ఆయన మాత్రం యధేచ్ఛగా సీఎం సభలకు హాజరవుతున్నారు. సభ అయిపోయిన వెంటనే సీఎం కారు వద్దకు వెళ్తున్న అనంతబాబును చూసుకోక ఓ పోలీసు వెనక్కు నెట్టారు. దీంతో అనంతబాబు రెచ్చిపోయాడు. పోలీసును ఉద్దేశించి చేతివేళ్లు ఎత్తి వార్నింగ్ ఇచ్చారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

నాపై వేయడానికి గులకరాళ్లే మిగిలాయి

- వైసీపీకి ఓటేస్తేనే పథకాలు కొనసాగుతాయి
- కాకినాడలో సిద్ధం సభలో జగన్ వ్యాఖ్యలు

కాకినాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తనపై వేయించడానికి ఇక గులకరాళ్లే మిగిలాయని సీఎం జగన్ అన్నారు. మరో పదేళ్లు తాను ముఖ్యమంత్రిగా ఉంటేనే పేద విద్యార్థులకు ఇంగ్లీషు చదువులు అందుతాయన్నారు. వచ్చే ఐదేళ్లలో సంక్షేమ పథకాలు కొనసాగాలా? వద్దా? అనేది ప్రజలు వేసే ఓట్లపైనే ఆధారపడి ఉందన్నారు. బస్సు యాత్రలో భాగంగా సీఎం జగన్ శుక్రవారం కాకినాడ అచ్చంపేటలో సిద్ధం సభలో ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 25 రోజులే ఉన్నాయని, సంక్షేమ పథకాలు అందిస్తున్న వైసీపీకి ప్రతి ఒక్కరూ ఓటువేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన ఎన్ని చెప్పినా వినొద్దని, వైసీపీకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

అందరూ మంచోళ్లే.. సౌమ్యులే..

సభలో ప్రసంగం అనంతరం జగన్...కాకినాడ జిల్లా పరిధిలోని వైసీపీ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు. మంచోళ్లు, సౌమ్యులు అంటూ వారందరికీ సర్టిఫికెట్ ఇచ్చారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బూతుల ఎమ్మెల్యేగా పేరొందారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను గతంలో మహిళా ప్రజాప్రతినిధుల సమక్షంలో పచ్చి బూతులు మాట్లాడారు. అలాంటి బూతుల ఎమ్మెల్యేను మంచోడు, సౌమ్యుడు అంటూ జగన్ పొగడటంతో జనం నవ్వుకున్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావును 'పొట్టివాడేగానీ, గట్టివాడు' అని పేర్కొన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను పరిచయం చేస్తూ ఆమెకే ఓటెయ్యాలని కోరుతూ, లోకల్ హీరో గీత కావాలా.. సినీ హీరో కావాలా అంటూ ప్రశ్నించారు.

ఇదేం కట్టు బాబోయ్...

సీఎం జగన్ బస్సు యాత్రలో భాగంగా నుదుటిపై ఇంకా కట్టుతోనే కనిపిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 13న విజయవాడ బస్సు యాత్రలో ఉండగా జగన్‌పై గులకరాయి దాడి తగిలింది. దీనికి కట్టుకట్టించుకుని జగన్ మళ్లీ యాత్ర కొనసాగిస్తున్నారు. ఆరు రోజులైనా ఇంకా జగన్ అదే కట్టుతో కనిపిస్తుండడంపై పార్టీలోనే చర్చ జరుగుతోంది. ఎన్నికల నేపథ్యంలో నుదుటిపై బ్యాండేజీతో జనంలోకి వెళ్లడం వల్ల సానుభూతి పెరుగుతుందనే ఉద్దేశంతోనే జగన్ బ్యాండేజీ తీయడం లేదనే చర్చ సాగుతోంది. మరోపక్క నుదుటిపై సీఎం ఉంచుకున్న బ్యాండేజీ తెల్లగా కనిపించడం కోసం దానిపై ఒక పారదర్శక ప్లాస్టిక్ కవర్ అతికించుకోవడం విశేషం. వాస్తవానికి బస్సు యాత్రలో భాగంగా బయటకు వస్తే చెమట, ధూళికి బ్యాండేజీ నల్లగా అయితే ప్రచారానికి, ఫొటోలకు ఇబ్బంది అనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు బ్యాండేజీ తెల్లగా ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నాలపైనా సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతకు ముందు.. ఉదయం 10.30గంటలకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం ఎస్టీ రాజాపురంనుంచి బస్సులో జగన్ బయలుదేరారు. రంగంపేట దాటి కాకినాడ జిల్లాలోకి ప్రవేశించారు. మార్గమధ్యలో ఏసీ బస్సులోనుంచే జనానికి అభివాదం, సైగలు మాత్రమే చేస్తూ ముందుకు సాగారు.



పెద్దాపురంలో ఆస్పత్రికి వెళ్లే రహదారిని బ్లాక్ చేయడంతో మండుటెండలో అవస్థ పడుతున్న దివ్యాంగురాలు

సింహ వాహనంపై సీతారామలక్ష్మణుల అభయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 19: ఒంటిమిట్ట కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి సీతారామలక్ష్మణులు సింహవాహనంపై భక్తులకు అభయమిచ్చారు. శ్రీవారి దశావతారాల్లో నరసింహావతారం నాల్గవది. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగి ఉంటే భగవంతుడు అనుగ్రహిస్తాడని ఈ వాహన సేవలో అంతరార్థం. కాగా.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



సింహ వాహనంపై సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు

ఒంటిమిట్టకు 1.20 లక్షల శ్రీవారి లడ్డూలు

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఒంటిమిట్ట ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లో శుక్రవారం శ్రీవారి సేవకుల సహకారంతో మినీ (25 గ్రాములు) లడ్డూలు ప్యాక్ చేశారు. డిప్యూటీ ఈవో శివప్రసాద్, పోటు ఏఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 250 మంది శ్రీవారి సేవకులు 1.20 లక్షల లడ్డూలను 60 వేల జిప్‌లాక్ ప్యాకెట్లలో ఉంచారు. ఒక్కో ప్యాకెట్‌లో రెండు లడ్డూల చొప్పున ప్యాక్ చేశారు. సీతారాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.

24 నుంచి ద్రాక్షారామ గర్భాలయాలు మూసివేత

ద్రాక్షారామ, ఏప్రిల్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి గర్భాలయాలను ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు ఈవో పీటీవీ సత్యనారాయణ తెలిపారు. స్వామివారి మూలవిరాట్ (శివలింగం)కు రసాయన రక్షణ చర్యలు, అమ్మవారి గర్భాలయంలో అభివృద్ధి పనులను కేంద్ర పురావస్తు శాఖ చేపట్టనుండటంతో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు గర్భాలయాలను మూసివేస్తామన్నారు. 24వ తేదీన ప్రాతఃకాలార్చన అనంతరం శృంగేరీ పీఠాధిపతులు అందజేసిన బాణలింగాన్ని ఉదయం 10.39 గంటలకు నంది మండపంలో ప్రతిష్ఠిస్తామన్నారు. నిత్యం జరిగే ప్రథమాభిషేకం, ఆర్జితసేవలతో పాటు ఉదయం 10 గంటలకు అభిషేకం నిర్వహిస్తామన్నారు.

వైసీపీకి ఓటేస్తే.. డ్రైనేజీలో వేసినట్టే

- ఐదేళ్ల పాలనలో ప్రజల చేతికి చిప్పే మిగిలింది
- జగన్ ప్రభుత్వంపై వైఎస్ షర్మిల మండిపాటు



కర్నూలు జిల్లా ఆలూరు రోడ్ షోలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

ఆలూరు/ఆదోని, ఏప్రిల్ 19: ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, వైసీపీకి ఓటు వేస్తే.. డ్రైనేజీలో వేసినట్టేనని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో 'ఏపీ న్యాయ్ యాత్ర' నిర్వహించారు. ఆలూరు అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన రోడ్ షోలో వైసీపీ ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. 'సీఎం జగన్ శిలఫలకాలను ఆవిష్కరిస్తూ ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని శంకుస్థాపనల ప్రభుత్వంగా మార్చేశాడు. ఆలూరు నియోజకవర్గంలో నగరడోన, వేదవతి ప్రాజెక్టులు నిర్మిస్తానని హామీ ఇచ్చి విస్మరించాడు. మనకు ప్రత్యేక హోదా పదేళ్ల క్రితం వచ్చి ఉండాలి. కానీ హోదా తీసుకురావడంలో జగన్ ఘోరంగా విఫలమై చేతులు ఎత్తేశాడు. ఆయనకు కనీసం రాజధాని కట్టడమైనా చేతనైందా? ప్రత్యేక హోదా వస్తే ఒక్కో నియోజకవర్గానికి 100 పరిశ్రమలు వచ్చేవి. దాంతో ఎంతో అభివృద్ధి జరిగి మన బిడ్డలకు ఎన్నో ఉద్యోగాలు వచ్చేవి. కడప స్టీల్ ఫ్యాక్టరీకి గతంలో వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. తిరిగి జగన్ మరోసారి శంకుస్థాపన చేశాడు. ఇంకా ఎన్నిసార్లు పదేపదే శంకుస్థాపనలు చేస్తావ్..?' అంటూ విరుచుకుపడ్డారు. ఇలాంటి పార్టీకి మళ్లీ ఓటు వేసేకన్నా... డ్రైనేజీలో వేయడం ఎంతో మేలని తెలిపారు. రైతుల సంక్షేమానికి రూ.300 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని జగన్ చెప్పలేదా అని ప్రశ్నించారు. మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అవేమీ కనపడటంలేదా అంటూ జగన్‌ను ప్రశ్నించారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజల చేతికి చిప్ప మాత్రమే మిగిలిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని చెప్పారు.

వైసీపీ శ్రేణుల అలజడి...మీ అన్న దేనికి సిద్ధం అని షర్మిల ఆగ్రహం

ఆదోని పట్టణంలో షర్మిల శుక్రవారం చేపట్టిన ప్రచార రోడ్ షోలో వైసీపీ అల్లరిమూకలు అలజడి సృష్టించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె మాట్లాడుతుండగా బిల్డింగ్ పైకెక్కి వైసీపీ సిద్ధం జెండాను ఊపుతూ జగన్ అనుకూల నినాదాలు చేశారు. సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో 'మీరు సిద్ధమైతే.. మేమూ సిద్ధం..' అంటూ షర్మిల వారికి సవాల్ విసిరారు. 'మిమ్మల్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి మేం సిద్ధం' అని గట్టిగా మాట్లాడారు. 'హామీలు ఇచ్చి మోసం చేయడానికి సిద్ధమా? హోదా ఇస్తామని చెప్పి మోసం చేయడానికి సిద్ధమా? ఉద్యోగాలు ఇస్తామని మోసం చేయడానికి సిద్ధమా? ఇంతకూ దేనికి మీ అన్న సిద్ధం' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. పోలీసులు జోక్యం చేసుకొని వైసీపీ అల్లరిమూకలను కిందకు దించి అక్కడినుంచి పంపేశారు.

వైసీపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చీరల బండిల్స్ పట్టివేత

పెందుర్తి (విశాఖపట్నం), ఏప్రిల్ 19: పెందుర్తి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ క్యాంపు/పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారులు భారీగా చీరలు, కీచైన్లు, టోపీలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన చీరల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. 'సీ' విజిల్‌లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనిఖీలు నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేయనున్నారు. కాగా, క్షేత్రస్థాయిలో వాతావరణం తమకు ఏమాత్రం అనుకూలంగా లేదని గుర్తించిన వైసీపీ నాయకులు ఎన్నికల్లో గట్టెక్కేందుకు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలో అధికార పార్టీకి చెందిన పలువురు అభ్యర్థులు ఇప్పటికే డబ్బులతో పాటు మహిళలకు చీరలు, కుంకుమ భరిణెలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పెందుర్తి అభ్యర్థి అదీప్‌రాజ్ కార్యాలయంలో చీరలు దొరికాయి.



పెందుర్తి వైసీపీ అభ్యర్థి అదీప్‌రాజ్ క్యాంపు కార్యాలయంలో పట్టుబడిన చీరలు

కాంగ్రెస్ ప్రచార వాహనంపై వైసీపీ శ్రేణుల దాడి

టెక్కలి, ఏప్రిల్ 19: శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా కార్యకర్తలు స్థానిక రవీంద్రభారతి పాఠశాల సమీపంలో అటుగా వస్తున్న కాంగ్రెస్ ప్రచార వాహనంపై దాడి చేశారు. ఆటోపై ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కిల్లి కృపారాణి ఫ్లెక్సీలను చించివేశారు. ఈ దాడి ఘటనతో డ్రైవర్ ఆటోను నిలిపి పరుగులు తీశారు. కిల్లి కృపారాణి వైసీపీని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరి టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేస్తుండడంతో వైసీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేక ఈ దాడికి పాల్పడ్డారు. ఘటనపై కృపారాణి అనుచరులు శుక్రవారం రాత్రి టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాలికపై లైంగికదాడి కేసులో వృద్ధుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19: ఆరేళ్ల బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడినట్టు నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ ఏలూరు జిల్లా ఏలూరులోని పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎస్.ఉమాసునంద శుక్రవారం తీర్పు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన ముప్పాడి సంపతరావు(81) 2017 డిసెంబరు 23న అదే మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలికకు తినుబండారాలు కొనిస్తానంటూ లైంగిక దాడి చేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి గోపాలపురం ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. సంపతరావుపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి ఉమాసునంద తీర్పునిచ్చారు. బాధితురాలికి రెండున్నర లక్షల రూపాయల నష్ట పరిహారం ప్రభుత్వం అందించాలని సిఫారసు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు గోపాలపురం ఎస్ఐ కె.సతీష్, కోర్టు కానిస్టేబుళ్ళు బుచ్చిరాజు సహకరించారు.

అతిసారంతో మంచం పట్టిన మంచాల

- కలుషిత నీటి వల్లేనని ప్రజల ఆగ్రహం

పొన్నూరుటౌన్ , ఏప్రిల్ 19: అతిసార వ్యాధి ప్రబలి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని మంచాల గ్రామం మంచం పట్టింది. గ్రామంలో గత రెండు రోజులుగా పదుల సంఖ్యలో ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో అత్యధికులు గుంటూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స కోసం తరలివెళ్లారు. శుక్రవారం వ్యాధి తీవ్రత పెరగటంతో గ్రామంలో కలకలం రేగింది. ప్రస్తుతం గ్రామంలో 35 మంది వరకు అతిసార లక్షణాలతో ఇళ్ల వద్దే ఉండి చికిత్స పొందుతున్నారు. 8 మందికి తీవ్ర లక్షణాలు ఉండటంతో చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో కలుషిత నీరు తాగటం వల్లనే ప్రజలు అతిసార వ్యాధి బారిన పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పారదర్శకత ప్రధానం

కేరళలోని కాసర్‌గోడ్‌లో నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) బీజేపీ అభ్యర్థికి కొన్ని అదనపు ఓట్లను నమోదు చేసిందన్న వార్తలపై దృష్టిసారించాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు గురువారం కోరింది. అందులో నిజం లేదని ఆ తరువాత ఎన్నికల సంఘం కోర్టుకు స్పష్టంచేసింది. ఎన్నికల సంసిద్ధతలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ మెషీన్ల పనితీరును పరీక్షిస్తున్నప్పుడు, కొన్ని అదనపు స్లిప్పులు ప్రచురితమై, ఈవీఎంలో బీజేపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడ్డాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ యంత్రాలను తనిఖీచేస్తున్న క్రమంలో ఇంజనీర్లు చేసిన ఓ పొరపాటువల్ల ఇది జరిగింది తప్ప, అవి అదనపు ఓట్లు కావని ఈసీ తేల్చింది. సుప్రీంకోర్టులో వీవీప్యాట్‌లపై వాదనలు జరుగుతున్నప్పుడే ఇది జరగడం విచిత్రం. ఈవీఎంలో వేసిన ఓట్లతో పాటు, వీవీప్యాట్ ద్వారా ముద్రితమవుతున్న పేపర్‌స్లిప్పులను కూడా పూర్తిగా లెక్కించి, సరిపోల్చిన తరువాతే విజేతలను నిర్ణయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరుపుతున్న సందర్భంలో, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ కేరళ ఘటనను న్యాయమూర్తుల దృష్టికి తీసుకువచ్చారు. దానిని ఎన్నికల సంఘం ఖండించడాన్ని అటుంచితే, ఈ దేశంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లమీద ఇంకా అనుమానాలు రేగుతూనే ఉన్నాయి, వివాదం సాగుతూనే ఉంది.

సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ ఆరంభానికి ఒకరోజు ముందు సుప్రీంకోర్టు ఈ అంశంపై తీర్పు రిజర్వుచేసింది. వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ లెక్కించడంలో ఎన్నికల సంఘానికి వచ్చే ఇబ్బంది ఏమిటన్నది సుప్రీంకోర్టు ప్రధాన ప్రశ్న. ఎన్నికల ప్రక్రియలో పవిత్రత నిలవాలి, ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరగాలి కనుక ఎన్నికల సంఘం అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాల్సిందేనని కోర్టు వ్యాఖ్యానించింది. ఎక్కడా లోపం లేదు, ఎవరికీ అన్యాయం జరగడం లేదు అని ఎన్నికల సంఘం అంటూనే ఉంటుంది. కానీ, న్యాయమూర్తులు వ్యాఖ్యానించినట్టుగా, ఓటర్లకు ఏ మాత్రం అన్యాయం జరగకూడదు, అనుమానాలకు ఆస్కారం కల్పించకూడదు. తాను కోరుకున్నవారికే ఓటువేశానని, ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ఓటరుకు విశ్వాసం కలగడం అత్యంత ప్రధానం. ఈ కారణంగానే, వీవీప్యాట్‌లో ప్రింట్ అయిన స్లిప్పులను ఓటరుకే ఇచ్చేస్తే మరీ మంచిది కదా అని ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తులు సరిగానే ప్రశ్నించారు. కానీ, అది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని ఈసీ వాదన. ఏ పార్టీకి ఓటు వేసిందీ మిగతావారికి తెలియడం నిజానికి అతడికి కొత్త సమస్యలు తేవచ్చును కూడా. వీవీప్యాట్ స్లిప్పును ఓటరు పరీక్షగా చూసుకొని సంతృప్తిచెందిన తరువాత బాక్సులో వేయడమన్న ప్రతిపాదన మంచిదే కానీ, ఇది ఎన్నికల ప్రక్రియను మళ్ళీ పాతవిధానానికి తీసుకెళ్ళడమేనని ఈసీ వాదన. ఓటరు గోప్యతను కాపాడుతూ, తాను వేసిన ఓటు ఎవరికి పడిందన్న విషయంలో ఏ విధమైన అనుమానాలకు తావులేకుండా ఉండాలంటే, వీవీప్యాట్ మెషిన్‌లోని లైట్ ఎప్పుడూ వెలుగుతూనే ఉండాలన్నది మరో సూచన. ఈవీఎంలో ఓటువేసిన తరువాత, పేపర్‌స్లిప్ ప్రింట్ అవుతుంది, అది సీల్డ్ బాక్సులో పడేముందు లైట్ వెలుగుతుంది, ఏడుసెకన్లు మాత్రమే ఓటరుకు ఆ స్లిప్ కనిపిస్తుంది. ఓటరు చూసి సంతృప్తిచెందడానికి ఈ సమయం సరిపోతుందని, నిర్ధారణకు కాగితాన్ని విడిగా చేతికి ఇవ్వడం లేదా బాక్సులో వేయడం, లైట్ వెలిగే కాలం పెంచడం ఇత్యాదివి అక్కరలేదని ఈసీ అంటోంది.

ఓటరు హక్కులను ఎత్తిపడుతూ వీవీప్యాట్ల అంశంపై విచారణ అత్యవశ్యకమని ప్రకటించి, సుప్రీంకోర్టు ఈ వాదనలన్నీ విన్నది. ఓటింగ్ ప్రక్రియ, మెషీన్ల పనితీరువరకూ మొత్తం తెలుసుకుంది, అనుమానాలు నివృత్తి చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా సర్వోన్నత న్యాయస్థానం తమ కేసువినాలన్న అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఆశ నెరవేరింది కానీ, తీర్పు రిజర్వులో ఉండిపోయింది. ఈవీఎంలో నమోదైన ఓట్లతో పాటు, వీవీప్యాట్లన్నింటినీ లెక్కించిన తరువాతే, విజేతను ప్రకటించాలన్న అభ్యర్థన అర్థం లేనిదేమీ కాదు. నూరుశాతం వీవీప్యాట్ల లెక్కింపు డిమాండ్‌ను సాంకేతికంగా సాధ్యం కాదనో, సమయం వృథా అవుతుందనో, తిరోగామి చర్య అనో తిరస్కరించడం కంటే, అందుకు సిద్ధపడటం ద్వారా ఈవీఎంలమీద ఉన్న అన్ని అనుమానాలను, అపనమ్మకాలను వమ్ముచేయడం మంచిది. ఎన్నికల వ్యవస్థను ఇది మరింత పారదర్శకంగా మారుస్తుంది, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది.

'శ్రమ దోపిడీ' మాటే ఎత్తని, 'లోతైన పరిశీలన'!

'సుప్రీం తీర్పు సంస్కరణేనా?' పేరుతో వచ్చిన జయప్రకాష్ నారాయణ గారి వ్యాసంలో (ఆంధ్రజ్యోతి, మార్చి 31) ప్రశ్నించవలిసిన విషయాలున్నాయి.

(1) సుప్రీం తీర్పు ఏమిటి? కార్పొరేట్లు (పెద్ద పెద్ద కంపెనీలు), రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల గురించి, ఏయే పార్టీలకు ఎంతెంత ఇస్తున్నారో వివరాలన్నీ చెప్పాలి – అనేదే. దీన్ని, 'సంస్కరణేనా' అనడంలో అర్థం ఏమిటో స్పష్టత లేదు.

(2) 'భారత రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యాన్నీ, పర్యవసానాల్నీ అర్థం చేసుకోవాలంటే మనకు మరింత లోతైన పరిశీలన అవసరం' అన్నారు. కానీ, ఆయన లోతైన పరిశీలనంతా, రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఇచ్చే విరాళాలలో పారదర్శకత ఉండాలంటే, ఆ కంపెనీల 3 సంవత్సరాల లాభాల సగటులో 5 శాతం పన్ను మినహాయింపు వుండాలని చెప్పడంగా ఉంది. పన్నుల్లో మినహాయింపు అనేది కంపెనీలకు సంతోషం కలిగించే సంస్కరణ!

(3) 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం' అనీ, 'లోపభూయిష్ట ప్రజాస్వామ్యం' అనీ, 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యం' అనీ, వ్యాసకర్త, ప్రజాస్వామ్యానికి వేరు వేరు లక్షణాలు చెప్పారు. సమాజం పేదా–ధనికా వర్గ భేదాలతో వున్నప్పుడు 'ప్రజాస్వామ్యం' అనేది ధనిక వర్గానికే అనుకూలంగా వుండడం జరుగుతుంది. ఏ దేశంలో అయినా, ఉన్నది ఇదే! పేద జనాభా వర్గాన్ని, ధనిక జనాభా వర్గం, 'కౌలూ–వడ్డీ–లాభం' పేర్లతో, శ్రమ దోపిడీ చెయ్యడానికి అనుకూలంగా వున్న చట్టాలతో వున్నదే నేటి ప్రజాస్వామ్యం! ఈ నాటి ప్రజాస్వామిక చట్టాలన్నీ 'దోపిడీ పద్ధతుల్లో పరిణతి' చెందినవే!

(4) జయప్రకాష్ గారు అనుకుంటున్నట్టు, డబ్బు ప్రాబల్యం భారత రాజకీయాల్లో మాత్రమే కాదు, ఆయన చెప్పే 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో' (ఉదాహరణకి, అమెరికాలో) కూడా డబ్బు ప్రాబల్యం ఎంతో వుంది. ఆధారాల కోసం, 'మైకేల్ పెరెంటీ' అనే రాజకీయశాస్త్ర ప్రొఫెసరు రాసిన 'కొద్దిమందికే ప్రజాస్వామ్యం' ('డెమోక్రసీ ఫర్ ది ఫ్యూ') అనే పుస్తకం చూడవచ్చును. 'డబ్బు అనేది ఎన్నికల రాజకీయాలకు జీవనాధారం' అనే విషయాన్ని, అనేక ఉదాహరణలతో ఆయన వివరిస్తాడు. అమెరికాలో, ఎన్నికలకు నిధులిచ్చే పెద్ద పెద్ద పరిశ్రమల వాళ్ళు ఎలా ప్రవర్తిస్తారంటే, ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు 'అక్షరాలా తమ ఆత్మల్ని అమ్ముకోవలిసి వస్తుంది' అని కొన్ని రుజువులు చూపిస్తాడు.

(5) రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలనేది జయప్రకాష్ గారు సూచించిన ఒక సంస్కరణ కదా? అలా ఇస్తే, అది 'పార్టీలకు విరాళాలు చట్టబద్ధంగా ఇచ్చే పద్ధతి' అవుతుందని ఆయన వాదన! ఈ వాదన 'ఎంత లోతైన పరిశీలనో' శ్రామిక ప్రజల పక్షాన నిలబడి ఆలోచిస్తేనే తెలుస్తుంది. 'అసలు లాభం అంటే ఏమిటి? వాటిని పెద్ద పెద్ద కంపెనీల అధిపతులూ, వేలాది వాటాదార్లూ ఎలా, ఎక్కడి నించీ పొందుతారు?' అనే ప్రశ్నలు వేసుకుని, సమాధానాన్ని రాబడితే, అదీ 'లోతైన పరిశీలన'!

నిత్యం తూర్పున సూర్యోదయం జరగడం అనేది ప్రకృతి సత్యం అయినట్టుగా, 'లాభం రావడం' అనేది కూడా అంత సహజమైనదని సంస్కర్తలు భావిస్తారు. ఒక మందుల కంపెనీ ఉందనుకుందాం. అది, కొన్ని మందుల ఉత్పత్తికి కావలిసిన సాధనాల కోసం 80కోట్లు పెట్టింది అనుకుందాం. సాధనాల్ని ఉపయోగిస్తూ పని చేయడానికి శ్రామికులు కావాలి. వారిలో వేరు వేరు స్థాయిల వారు వుంటారు. వారి జీతాల కోసం 20 కోట్లు అనుకుందాం. అలా సాధనాల 80 + శ్రామికుల 20 = 100 కోట్ల ఖర్చుతో తయారైన మందుల్ని 120 కోట్లకి ఆ కంపెనీ అమ్మిందనుకుందాం. అదనంగా వచ్చిన ఆ 20 కోట్ల విలువ ఎవరి వల్ల వచ్చింది? సాధనాల వల్ల అయితే కాదు. ఆ అదనపు కోట్ల విలువా, శ్రమలన్నీ చేసిన శ్రామికుల వల్ల వచ్చిందే! అది శ్రామికుల అదనపు శ్రమ విలువ. అదే అదనపు విలువ. కానీ, కంపెనీ యజమానులు ఏమంటారంటే, 'అది మా పెట్టుబడి తెచ్చే లాభం' అంటారు. ఎందుకంటే, శ్రమ దోపిడీ అనేది, పరిణతి చెందిన ప్రజాస్వామ్యాల రాజ్యాంగాలలో చట్టబద్ధమే కాబట్టి! ఇంకో విచిత్రం ఏమిటంటే, కంపెనీలు ప్రభుత్వానికి పన్నులు కడితే, అవి ఎక్కడివి? శ్రామికులనించీ దొంగిలించిన అదనపు విలువ లోవే!



రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలనేది జయప్రకాష్ గారు సూచించిన ఒక సంస్కరణ కదా? అలా ఇస్తే, అది 'పార్టీలకు విరాళాలు చట్టబద్ధంగా ఇచ్చే పద్ధతి' అవుతుందని ఆయన వాదన! ఈ వాదన 'ఎంత లోతైన పరిశీలనో' శ్రామిక ప్రజల పక్షాన నిలబడి ఆలోచిస్తేనే తెలుస్తుంది. 'అసలు లాభం అంటే ఏమిటి? వాటిని పెద్ద పెద్ద కంపెనీల అధిపతులూ, వేలాది వాటాదార్లూ ఎలా, ఎక్కడి నించీ పొందుతారు?' అనే ప్రశ్నలు వేసుకుని, సమాధానాన్ని రాబడితే, అదీ 'లోతైన పరిశీలన'!

(6) కార్పొరేట్లు బహిరంగంగా విరాళాలు ఇవ్వాలంటే, ఆర్థిక కలాపాలలో పక్షపాతాలూ, అనూహ్య నిర్ణయాలూ ఉండరాదని, జయప్రకాష్ గారి మరో సంస్కరణ. అధికారంలో వున్న పార్టీకి, ఏ కంపెనీ అయితే ఎక్కువ డబ్బు ఇస్తుందో, ఆ కంపెనీకి అనుకూలంగా ప్రభుత్వం అనూహ్య నిర్ణయాలన్నీ చేస్తుంది. వీటిని భారత ప్రభుత్వం ద్వారా కూడా చూడగలం. విదేశాలతో ఒప్పందాలు చేసుకునే సమయంలో, ప్రధానమంత్రే, తమ పార్టీకి ఎక్కువ విరాళాలు ఇచ్చిన పెట్టుబడిదారుణ్ణి తన వెంటబెట్టుకు పోగలడు. లేదా, ఫోన్ చేసి, 'మా మిత్రుడికి ఆ విద్యుత్తు ప్రాజెక్టు కాంట్రాక్టు ఇవ్వండి' అని పొరుగునున్న ఏదో ఒక బడుగు దేశాన్ని ఒత్తిడి చెయ్యగలడు. పరిణతి చెందిన అమెరికా ప్రజాస్వామ్యంలో, రక్షణ శాఖనించీ, వందల కోట్ల (బిలియన్ల) విలువగలిగిన కాంట్రాక్టులను మిలిటరీ అధికారులు కొన్ని కంపెనీలకు మాత్రమే ఇప్పించడం, వాటినించీ అపారమైన ప్రతిఫలం రకరకాల రూపాల్లో పొందడం ఎప్పటినించో జరుగుతున్నట్టు మైకెల్ పెరెంటీ ఆధారాలు చూపాడు.

(7) 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో తమ రాజకీయ ప్రాధాన్యతలను కార్పొరేట్లు బాహాటంగా చెబుతారు' అని, అదేదో గొప్ప విషయం అన్నట్టు చెపుతున్నారు జయప్రకాష్ గారు. భారత ప్రజాస్వామ్యంలో మాత్రం, కార్మిక వర్గ వ్యతిరేక 'ఆర్థిక సంస్కరణల'ను వేగవంతం చెయ్యమని భారత పారిశ్రామికవేత్తల సంఘాలు బాహాటంగా చెప్పడం లేదా? కార్మిక వర్గం నిద్రావస్థలో వున్నప్పుడు పెట్టుబడిదారులు ఎన్నయినా చెపుతారు మరి!

(8) 'ప్రతీకార చర్యలుంటాయనే భయం లేకుండా, పార్టీలకూ, అభ్యర్థులకూ కార్పొరేట్లు విరాళాలిచ్చే చట్టబద్ధపాలన వాతావరణం భారతదేశానికి అవసరం' – అని ఇంకో సంస్కరణ సూచించారు జయప్రకాష్ గారు. అంటే, భారతదేశం పరిణతి చెందని లోపభూయిష్ట ప్రజాస్వామ్యం అనీ, అందుకే విరాళాలు ఇవ్వని కంపెనీల మీద, అధికారంలో వున్న పార్టీలు ప్రతీకారంతో ఇబ్బంది పెడుతున్నాయి అనీ, అర్థం.

ఇంతకీ, జయప్రకాష్ గారి ఆవేదన అంతా, కార్పొరేట్లు శ్రామిక ప్రజల్ని దోచి లాభాలు సంపాదిస్తున్నారే – అని కాదన్న మాట! దోపిడీ ఆదాయాల్ని సంపాదించుకునే వీలునిచ్చేచట్టాలే కాకుండా, నచ్చిన పార్టీలకే ఇష్టం వచ్చినన్ని విరాళాలు ఇచ్చుకునే చట్టబద్ధ పాలన వుండాలని కూడా!

'శ్రమ దోపిడీ' మాట ఎత్తకుండా, ఎంత లోతైన పరిశీలన ఇది?

• రంగనాయకమ్మ

'77 ఎన్నికలు, నిలబడిన ప్రజాస్వామ్యం

ఇంతవరకూ జరిగిన 17 సార్వత్రిక ఎన్నికలలో రెండు ప్రత్యేకంగా ముఖ్యమైనవి. మొదటిది 1952లో జరిగిన ప్రప్రథమ సార్వత్రిక ఎన్నికలు. ఆ ఎన్నికలు అపూర్వమైనవి. అయితే భారత్‌లో ప్రజాస్వామ్యపాలన సాధ్యతను సంశయిస్తున్నవారు వాటిని పరిహసించారు. భారతీయులు నిరుపేదలని, కులమతాలు, భాషా ప్రాంతాల వారీగా చీలిపోయి ఉన్నారని, పైగా అత్యధికులు నిరక్షరాస్యులనీ వారి ఆక్షేపణ. తత్కారణంగా తమ నాయకులను ఎన్నుకునే హక్కు భారతీయులకు ఇవ్వడం వివేకవంతమైన నిర్ణయం కాదని సంశయవాదులు విశ్వసించారు.

తన సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు తొలుత విముఖత చూపిన ఒక మహారాజా నాడు దేశంలో పర్యటిస్తున్న ప్రముఖ అమెరికన్‌తో "ప్రజలందరూ దాదాపుగా నిరక్షరాస్యులే అయిన దేశంలో సార్వత్రిక ఓటు హక్కును కల్పించడం 'పిచ్చితనం' మినహా మరేమీ కాదని" వ్యాఖ్యానించాడు. 'అత్యధిక ప్రజలు మొట్టమొదటిసారి ఓటు వేయనున్నారు. వారిలో చాలామందికి ఓటు అంటే ఏమిటో, తాము ఓటు ఎందుకు వేయాలో, ఎవరికి వేయాలో తెలియని వారే. మరి ఈ ప్రజాస్వామిక సాహసాన్ని చరిత్రలో అతి పెద్ద జూదంగా పరిగణింపబడడం ఆశ్చర్యమేమీ కాదు' అని మద్రాసు (నేడు చెన్నై)లో ఒక ఎడిటర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. సరే, ఆరెస్సెస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' ఇలా వ్యాఖ్యానించింది: 'భారత్‌లో సార్వత్రిక వయోజన వోటింగ్ హక్కు విఫలమయిందని అంగీకరించేందుకు పండిట్ నెహ్రూ జీవించే ఉంటారు'. అయితే ఆ జూదంలో భారత్ గెలిచింది. భిన్న భావజాలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు, వ్యక్తులు ఆ సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేశారు. వయోజన స్త్రీ పురుషులు స్వేచ్ఛగా తమకు స్ఫూర్తినిచ్చిన వారిని ఎన్నుకున్నారు. ప్రథమ సార్వత్రిక ఎన్నికలను జయప్రదంగా నిర్వహించడం భారత దేశ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయి. 1957, 1962, 1967, 1971లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు 1952లో సమకూరిన ప్రజాస్వామిక లబ్ధిని దృఢీకరించాయి.

మన దేశ చరిత్రలో ఎంతో చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న రెండవ సార్వత్రిక ఎన్నికలు 1977 మార్చిలో జరిగాయి. జూన్ 1975లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు అది స్వేచ్ఛాయుత, పోటీదాయక రాజకీయాలకు చరమగీతమని చాలా మంది విశ్వసించారు. వలసపాలన నుంచి విముక్తి పొందిన అనంతరం నియంతృత్వ పాలనలోకి జారిపోయిన పలు ఆసియన్, ఆఫ్రికా దేశాల సరసన భారత్ కూడా చేరినట్టేనని ఎంతో మంది నిస్పృహ పాలయ్యారు. 1976 ద్వితీయార్థంలో దేశవ్యాప్తంగా సమస్త వీధులూ శాంతియుతంగా ఉన్నాయి. నా వ్యక్తిగత అనుభవం నుంచి నేను ఇది చెప్తున్నాను. ఇందిర పాలనకు ఎలాంటి ముప్పు ఏర్పడలేదు. ఆమెను సవాల్ చేసే వారే లేరు. అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం ఆమెకు లేనేలేదు. అయినా ఆశ్చర్యకరంగా ఆమె ఎన్నికలకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు.

1977 సార్వత్రిక ఎన్నికలకు చరిత్రాత్మక ప్రాధాన్యాన్ని సమకూర్చినవిగా మూడు అంశాలను చరిత్రకారులు ప్రముఖంగా ప్రస్తావిస్తారు. వాటిలో మొదటిది అసలు ఆ ఎన్నికలను నిర్వహించడం. రెండవది ఆ ఎన్నికల ఫలితాలు పోల్‌స్టర్స్ (ఓటర్ల అభిప్రాయాల విశ్లేషకులు) అంచనాలకు భిన్నంగా ఉండడం (ఇందిర అజేయురాలు అన్న విశ్వాసమే ఆ తప్పుడు అంచనాలకు ప్రధాన కారణం). ఆ సేతు హిమాచలం సకల సామాజిక వర్గాలకూ ఆమె ఒక తిరుగులేని అభిమాన నాయకురాలుగా ఉన్నారు. దీనికి తోడు 1971లో పాకిస్థాన్‌పై సాధించిన సైనిక విజయం ఆమె కీర్తి ప్రతిష్ఠలను ఇతోధికంగా పెంచింది. ఆరు సంవత్సరాల అనంతరం కూడా ఆ కీర్తి వెలుగులు అంతే దేదీప్యమానంగా ఉన్నాయి. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆమె పార్టీకి విశేష ప్రజాదరణ ఉన్నది. పార్టీలో ఆమె నాయకత్వానికి తిరుగులేదు. పార్టీకి ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిపక్షం పరిస్థితి కాంగ్రెస్‌కు పూర్తిగా భిన్నమైనది. ఐక్యత కొరవడడంతో పాటు ఆర్థిక వనరులూ కనీసమాత్రంగానైనా లేని దుస్థితిలో అవి ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు అందరూ అత్యవసర పరిస్థితి కాలంలో జైలు వాసం చేసిన వారే. అయితే పోల్‌స్టర్స్ అంచనాలకు భిన్నంగా కాంగ్రెస్ మెజారిటీ పొందలేకపోయింది. అసలు ఇందిరే స్వయంగా ఓడిపోయారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంగ్రేసేతర పార్టీ ఒకటి న్యూ ఢిల్లీలో ప్రప్రథమంగా అధికార పీఠాన్ని అధిష్ఠించింది.

అసలు ఆ సార్వత్రిక ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ఓడిపోవడం, భారత్ ఏకపార్టీ పాలనలో ఉండాల్సిన పరిస్థితి తొలగిపోవడం అనే మూడు ప్రధాన లక్షణాలతో పాటు 1977కి నాలుగో లక్షణాన్ని చేర్చవలసి ఉన్నది. సర్వశక్తిమంతమైన కాంగ్రెస్‌ను ఒక ఛత్రం కింద సమైక్యమైన వివిధ పార్టీలు ఓడించడం. కాంగ్రెస్‌ను ఓడించిన జనతాపార్టీ భిన్న భావజాలాలు, రాజకీయ కార్యక్రమాలు ఉన్న నాలుగు పార్టీల సంకీర్ణం. నియంతృత్వాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలనే ఏకైక లక్ష్యంతో ఆ నాలుగు పార్టీలూ జనతా పార్టీగా ఏర్పడ్డాయి.

1977–2014 మధ్య కేంద్రంలో ఏ ఒక్క పార్టీ గానీ, కూటమి గానీ వరుసగా రెండుసార్లు కంటే ఎక్కువగా అధికారంలో లేదు. వరుసగా ప్రత్యామ్నాయపార్టీలు అధికారంలోకి రావడం భారత ప్రజాస్వామ్యానికి పెద్ద మేలు చేసింది. ఒకే ఒక్క పార్టీ సుదీర్ఘ కాలం అధికారంలో ఉండగలదన్న భయం తొలగిపోవడంతో ఆ మూడున్నర దశాబ్దాల కాలంలో మీడియా మరింత నిర్భీతితో స్వేచ్ఛగా తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించింది; సివిల్ సర్వీసులు స్వతంత్రంగా వ్యవహరించాయి; న్యాయవ్యవస్థ దృఢ వైఖరితో, నిర్భయంగా నిర్ణయాలు తీసుకుంది. ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం అధికారంలో లేకపోవడమన్నది భారత సమాఖ్య పాలనా విధానానికి కూడా మేలు చేసింది. రాష్ట్రాలు మరింత స్వతంత్రంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాయి. స్వేచ్ఛగా తమ సొంత రాజకీయ, సామాజిక ఎజెండాలను అనుసరించి ప్రజా శ్రేయస్సుకు తోడ్పడ్డాయి. ప్రస్తుత ఎన్నికలు ఆ ధోరణులను వెనక్కి మరలిస్తాయా? రాజకీయ పరిశీలకులు పలువురు అవుననే అంటున్నారు. భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి విజయం సాధిస్తుందని, నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఆ తరువాత ఏమి జరగనున్నది? మోదీ, బీజేపీ మూడోసారి గెలిస్తే 'దేశంలో ఇంకెంత మాత్రం ఎన్నికలు జరగబోవు' అని ప్రముఖ వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్ చెప్పినమాటలను పలువురు ఉటంకిస్తున్నారు. ఇందిరాగాంధీ వలే మోదీలో కూడా పెత్తందారీ సహజాతాలు ఉన్నాయి. దేశ పాలనపై సంపూర్ణ ఆధిపత్యం వహించాలనే ఆకాంక్ష ప్రగాఢంగా ఉన్నది. అయితే ఇందిర నాటి రాజకీయ పరిస్థితులకు మోదీ కాలీన రాజకీయ పరిస్థితులకు మధ్య ఒక ముఖ్య వ్యత్యాసం ఉన్నది. 1977లో కాంగ్రెస్ ఒక్క రాష్ట్రం (తమిళనాడు–ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా న్యూ ఢిల్లీకి విధేయ పూర్వకంగా ఉండేవారు)లో మినహా దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్నది. మరి 2014లో బీజేపీ దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కడా అధికారంలో లేదు. తూర్పు, ఉత్తర భారత రాష్ట్రాలు చాలా వాటిలో కూడా అధికారంలో లేదు.

1975–77 సంవత్సరాల మధ్య ప్రజాస్వామిక ప్రతిపక్షాల గొంతును పూర్తిగా నొక్కివేయడంలో ఇందిర, కాంగ్రెస్ సఫలమయ్యాయి. ఇప్పుడు, మోదీ ఆశిస్తున్నట్టు లోక్‌సభలో 370 సీట్లను బీజేపీ గెలుచుకున్నప్పటికీ ప్రతిపక్షాల గొంతు నొక్కి వేయడం నరేంద్ర మోదీ, బీజేపీకి సాధ్యమయ్యే పని కాదు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, తెలంగాణ మొదలైన రాష్ట్రాలలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ఉంటాయి. మోదీ, షాలు వాటిని ఏమి చేస్తారు? ఆ రాష్ట్రాలలో అధికరణ 356ని విధిస్తారా? శాసన సభ్యులను కొనుగోలు చేస్తారా? ఆ మార్గాన్నో, ఈ మార్గాన్నో అనుసరించవచ్చు. అనైతిక రాజకీయాలకు వెనుకాడని మోదీ–షా ద్వయం ఏమైనా చేయవచ్చు. అయితే మోదీ మాయలో పడని, బీజేపీకి ఓటు వేయని లక్షలాది పౌరులు మోదీని ఆయన పార్టీని గట్టిగా వ్యతిరేకించటం ఖాయం. దేశంలోని చాలా ప్రాంతాలు బీజేపీ ప్రాబల్యాన్ని తిరస్కరించడం ఖాయం కనుక భారత్, అత్యవసర పరిస్థితి కాలం నాటి నియంతృత్వ పాలనా విధానాలకు పూర్తిగా మళ్లేందుకు ఆస్కారం లేదు. కలవరపడాల్సిన పరిస్థితి లేనప్పటికీ, ఎవరూ సంతృప్తికర భావంతో ఉండడానికి వీలు లేదు. ఎందుకని? బీజేపీ విద్వేష పూరిత, విభజనలను రెచ్చగొట్టే కరడుగట్టిన మితవాద హిందూత్వ భావజాలాన్ని ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళుతోంది.

2007లో ప్రచురితమైన ఒక పుస్తకంలో భారత్‌ను '50–50' ప్రజాస్వామ్యంగా అభివర్ణించాను. దశాబ్దంన్నర అనంతరం ఆ పుస్తకాన్ని అప్‌డేట్ చేస్తూ ఆ వ్యాఖ్యను '30–70' ప్రజాస్వామ్యంగా మార్చాను. బీజేపీకి మూడోసారి మెజారిటీ లభిస్తే ఆ పతనం మరింత వేగవంతమవుతుంది. 1970ల్లో ఇందిరా గాంధీ తన నిరంకుశపాలనా విధానాలను కుటుంబ పాలనతో మిళితం చేయగా ఇప్పుడు నరేంద్ర మోదీ తన పెత్తందారీ పాలనను హిందూ మెజారిటేరియనిజంతో కలగలుపుతున్నారు. పరివార్ వాద్ చెడ్డది. బహు సంఖ్యావాదం అంత కంటే హానికరమైనది. ఇస్లామిక్, బౌద్ధ మతవాదుల మెజారిటేరియనిజం ప్రభావ పరిధిలోకి వెళ్లిన మన ఇరుగు పొరుగు దేశాల పరిస్థితులే ఇందుకు నిదర్శనం. హిందూ మెజారిటేరియన్ పాలన భిన్నంగా ఉండగలదని భావించేందుకు సహేతుకమైన కారణాలు కన్పించడం లేదు.

నియంతృత్వ పాలన మానవ స్ఫూర్తిని అణచివేస్తుంది. అధిక సంఖ్యాకవాదం హృదయాలను విషతుల్యం చేస్తుంది. అది ప్రోత్సహించే విద్వేషం, మత సంకుచితత్వం సమాజమంతటా కేన్సర్‌లా వ్యాపిస్తాయి. వ్యక్తుల, సమాజ సభ్యత, మర్యాద, దయాశీలత, మానవతను బలప్రయోగంతో హరించివేస్తాయి. అందుకే మెజారిటీ వాదం ఉత్థానాన్ని నియంత్రించాలి, ప్రతిఘటించాలి. అందుకు అవసరమైన ప్రజాస్వామ్య మార్గాలు మనకు ఇంకా అందుబాటులో ఉన్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)



akbar

అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం ఇందిరాగాంధీకి లేనేలేదు. అయినా ఆశ్చర్యకరంగా ఆమె ఆ నిర్ణయం తీసుకున్నారు. అయితే, అంచనాలకు భిన్నంగా కాంగ్రెస్ మెజారిటీ పొందలేకపోయింది. ఇందిరే స్వయంగా ఓడిపోయారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంగ్రేసేతర పార్టీ ఒకటి న్యూ ఢిల్లీలో అధికార పీఠాన్ని అధిష్ఠించింది. అసలు ఆ సార్వత్రిక ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ఓడిపోవడం, భారత్ ఏకపార్టీ పాలనలో ఉండాల్సిన పరిస్థితి తొలగిపోవడం అనే మూడు ప్రధాన లక్షణాలతో పాటు 1977కి నాలుగో లక్షణాన్ని చేర్చవలసి ఉన్నది. సర్వశక్తిమంతమైన కాంగ్రెస్‌ను ఒక ఛత్రం కింద సమైక్యమైన వివిధ పార్టీలు ఓడించడం. కాంగ్రెస్‌ను ఓడించిన జనతాపార్టీ భిన్న భావజాలాలు, రాజకీయ కార్యక్రమాలు ఉన్న నాలుగు పార్టీల సంకీర్ణం.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

అవిశ్రాంత పోరాట యోధుడు

1995 సెప్టెంబర్ 1– తెలుగుదేశం పార్టీని కాపాడుకోవడానికి మెజార్టీ పార్టీ శ్రేణుల ఒత్తిడి మేరకు ఎన్టీఆర్‌ను అధికారం నుంచి దింపి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన రోజు. నాటి మీడియాలో ఈ విషయంపై సహజంగానే భిన్న కథనాలు వెలువడ్డాయి. ఎన్టీఆర్‌కున్న ఆకర్షణ శక్తి, ప్రజాబలం చంద్రబాబుకు లేవని, ఆయన బలమంతా ఆయన నడిపే మంత్రాంగంలోనే ఉంది కనుక ఆయన ఎక్కువ రోజులు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగలేరని, ఆరు నెలల్లోగానే దిగిపోవడం ఖాయమని చాలా మంది అంచనా వేశారు. అయితే, చంద్రబాబు రోజురోజుకూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటూ 1996, 1999 లోక్‌సభ ఎన్నికలలో; 1999 అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఘనవిజయాలు అందించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘకాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా ఓ అరుదైన రికార్డు నెలకొల్పారు.

2004లో అధికారం కోల్పోయినపుడు కూడా చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులు ఇక ఎన్టీఆర్ భవన్‌ను వేడుకలకు అద్దెకిచ్చుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. కువిమర్శల్ని లెక్కచేయని ఆయన పదేళ్ళు ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చినా, ఆ సమయంలో పార్టీ అనేక ఒడిదుడుకులకు లోనైనా కృంగిపోలేదు. తెలుగుదేశం పార్టీని నిర్మాణాత్మక ప్రతిపక్షంగా నడిపారు. రాష్ట్ర విభజన సమయంలో స్వప్రయోజనాలకంటే తెలుగు ప్రజల భవిష్యత్తు ముఖ్యమని భావించి ఇరు ప్రాంతాలకు సమన్యాయం జరగడం కోసం కృషి చేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేనలతో జతకట్టి ప్రజాభిమానం చూరగొని విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి మరో రికార్డు నెలకొల్పారు.

ఆ తర్వాత, 2019లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి కేవలం 23 సీట్లు మాత్రమే దక్కిన నేపథ్యంలో రాజకీయ ప్రత్యర్థులు మరోసారి రెచ్చిపోయారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో 2019–2024 మధ్య ఈ ఐదేళ్ల కాలం ఓ కాళరాత్రి లాంటిదే. అధికారంలో ఉన్నవారు తెలుగుదేశం పార్టీని నామరూపాలు లేకుండా చేయాలని సాగించిన ప్రయత్నాల్ని, వేసిన ఎత్తుగడల్ని, చేసిన విధ్వంసాలను, వ్యక్తిగత దూషణలను, పార్టీ ముఖ్యనేతలపై సాగించిన వేధింపులను, పెట్టిన కేసులను తట్టుకుంటూ ముందుకు సాగారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను 52 రోజులపాటు జైలులో నిర్బంధించినా మొక్కవోని ధైర్యం, మనోనిబ్బరంతో అన్నింటినీ ఎదుర్కొని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు భరోసా కల్పిస్తూ చంద్రబాబు సాగించిన ఈ ఐదేళ్ళ రాజకీయ ప్రయాణం ఆద్యంతం సమరశీలమే. రాజకీయాలలో గెలుపోటములు సహజమే అయినా, ఓటమి తర్వాత అగ్రస్థాయి నాయకులు సైతం కొంతకాలం స్తబ్దుగా ఉండిపోయిన ఉదంతాలు కోకొల్లలు. అయితే, చంద్రబాబు టీడీపీకి అధ్యక్షుడైన ఈ మూడు దశాబ్దాల కాలంలో అధికారంలో ఉన్నా, లేకున్నా వార్తల్లో లేనిరోజు లేదు. ఇందుకు కారణం– ఆయనొక అవిశ్రాంత పోరాటయోధుడు కావడమే!

ముఖ్యమంత్రి అయిన మూడు సందర్భాల్లోనూ చంద్రబాబు నాయుడుకు అధికారం పూలపాన్పులా కాకుండా ముళ్లబాటగానే సాగింది. 1995లో తొలిసారి ముఖ్యమంత్రి అయినపుడు క్షీణించిన రాష్ట్ర ఆర్థిక, సామాజిక రంగాలు; వారసత్వపు సవాళ్లు ఆయనకు స్వాగతం పలికిన నేపథ్యంలోనే వాటిని చాలెంజీగా స్వీకరించి సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనలపై దృష్టి పెట్టి పాలనా యంత్రాంగంలో ఆధునిక నిర్వహణ విధానాలను తెచ్చి, ఉద్యోగుల దృక్పథంలో గణనీయమైన మార్పుకు బాటలు వేశారు. అప్పుడే అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికంటే ముందుగా అందిపుచ్చుకొని రాష్ట్రంలో ఐటి విప్లవానికి బాటలు వేశారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాలను పెట్టుబడులకు, ఐటీ కంపెనీలకు గమ్యస్థానంగా మార్చడంలో గొప్ప విజయం సాధించారు. చదువుకున్న యువతకు రాష్ట్రంలో, దేశ విదేశాల్లో అపారమైన అవకాశాలు పొందడానికి దోహదం చేశారు.



రాజకీయాలలో గెలుపోటములు సహజమే అయినా, ఓటమి తర్వాత అగ్రస్థాయి నాయకులు సైతం కొంతకాలం స్తబ్దుగా ఉండిపోయిన ఉదంతాలు కోకొల్లలు. అయితే, చంద్రబాబు తెలుగుదేశం పార్టీకి అధ్యక్షుడైన ఈ మూడు దశాబ్దాల కాలంలో అధికారంలో ఉన్నా, లేకున్నా వార్తల్లో లేనిరోజు లేదు. ఇందుకు కారణం – ఆయనొక అవిశ్రాంత పోరాట యోధుడు కావడమే!

దేశంలో రెండవ దశ సంస్కరణలకు నాంది పలికిన చంద్రబాబు రాజకీయ స్వార్థం లేకుండా దూరదృష్టితో నిర్ణయాలు తీసుకున్నందునే విద్యుత్ రంగంతోసహా వివిధ రంగాలు నష్టాలబారి నుంచి బయటపడి అభివృద్ధిపథంలో సాగాయి. అదేవిధంగా రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్యం, పురపాలకం, రవాణా తదితర రంగాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రవేశపెట్టిన సంస్కరణలు రాష్ట్ర ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసి దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టాయి.

చంద్రబాబు రాష్ట్ర హక్కుల కోసం, సమాఖ్య స్ఫూర్తి అమలు కోసం కేంద్రానికి మద్దతిస్తూనే మరోవైపు రాజీలేని పోరాటం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ – సమాఖ్య మార్కెట్ ఎకానమీగా రూపాంతరం చెందిన నేపథ్యంలో.. ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి రాష్ట్రాలకు తగిన స్వేచ్ఛ కల్పించాలని గట్టిగా వాదించారు. అదేవిధంగా, ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక సంఘం నిధులు తగ్గించి, పేదరికాన్ని పెంచిపోషిస్తున్న రాష్ట్రాలకు అధిక నిధులు అందించే సంప్రదాయ మూస విధానాలకు స్వస్తి చెప్పాలని నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయి నేతృత్వం వహించిన ఇంటర్ స్టేట్ కౌన్సిల్‌లో చంద్రబాబు గళం విప్పడం అప్పట్లో ఓ సంచలనం. తర్వాతి కాలంలో ఆయన ఆశించినట్లే కేంద్ర ఆర్థిక సంఘం ప్రగతి సూచికల ఆధారంగా రాష్ట్రాలకు నిధులు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది.

చంద్రబాబుపై రాజకీయ ప్రేరేపితమైన అనేక అసత్యాలు చెలామణిలో ఉన్నాయి. ఆయన పేదల వ్యతిరేకి అని, వ్యవసాయం దండగమారి అన్నారని.. ఇలా అనేక కథనాల్ని రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు వ్యతిరేకులు పదేపదే ప్రచారం చేశారు. అయితే, ఆయన అధికారంలో ఉన్నప్పుడు పేదవర్గాలకు చేసిన మేలు పెద్దగా ప్రచారానికి నోచుకోలేదు. చంద్రబాబు అనగానే అందరికీ హైటెక్‌సిటీ, సైబరాబాద్ గుర్తుకొస్తాయి. కానీ, ఆయన రాష్ట్ర నిధులతో పాటు డిఎఫ్‌ఐడి నిధులను తెచ్చి హైదరాబాద్ జంట నగరాలలోని 180 మురికివాడలను అభివృద్ధి చేశారనే వాస్తవం చాలా మంది గుర్తించరు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు మెట్ట ప్రాంతాలలో వాటర్‌షెడ్‌లు, నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి భూగర్భ జలాలను పెంచారనే సత్యం మరుగున పడిపోయింది. పేద గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకాన్ని ఓ ఉద్యమస్థాయిలో ప్రోత్సహించిన వైనాన్ని, దీపం పథకంతో ప్రతి పేద కుటుంబానికి గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేయడం, పేద బాలికల విద్యను ప్రోత్సహించడానికి వారికి ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం, కులవృత్తిదారులకు ఆధునిక పనిముట్లు అందించడం, పేదరికం నిర్మూలనకు వెలుగు వంటి పథకాలను అమలు చేయడం వంటివెన్నో తగిన ప్రాచుర్యం పొందలేదు.

అయితే, చంద్రబాబు అధికారంలో ఉంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉంటాయని, ప్రజా ఆస్తులకు భద్రత ఉంటుందని, పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని, కుల మత ప్రాంతాలకు అతీతంగా పరిపాలన జరుగుతుందని, దేశంలోనే రాష్ట్రానికి ఓ ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ప్రజలకు అర్థమవుతూనే ఉంది. ఈ పూర్వరంగంలోనే ఆంధ్రప్రదేశ్ పునర్‌నిర్మాణానికి చంద్రబాబు అనుభవం అత్యంత అవసరం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

▪ విక్రమ్ పూల
సీనియర్ జర్నలిస్ట్

నవ్యాంధ్ర నవయువకుడు

ఆయనకు వయస్సు నెంబర్ మాత్రమే. ఎంత వయస్సు పెరిగితే ఆయన రెట్టింపు ఉత్సాహంతో ఉంటారు. విజనరీ ఆయన ఇంటి పేరు అభివృద్ధి, సంక్షేమం ముద్దు పేరు. ఆయనే నవ్యాంధ్ర నవయువకుడు నారా చంద్రబాబు నాయుడు. ఆయన గురించి ఈ తరం యువత ఖచ్చితంగా తెలుసుకొని తీరాలి. ఎందుకంటే ఆయన ఇన్నాళ్లు చేసిన పోరాటం, పడిన ఆరాటం భవిష్యత్ తరాల గురించే. సరిగ్గా 26 ఏళ్ల క్రితం ఆయన వేసిన హైటెక్ సిటీ మొక్క నేడు వటవృక్షమై లక్షలాది యువతకు నీడనిస్తోంది. అందుకే ఆయనను అక్రమ అరెస్ట్ చేసి ఇబ్బందులకు గురి చేసినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది నిరసనలు తెలియజేశారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులెత్తించడం, ప్రజలను ప్రగతిపథంలో నడిపించడం చంద్రబాబు ధ్యేయం. ఆయన విజన్‌కు యావత్ ప్రపంచ దిగ్గజాలు సైతం తలవంచక తప్పలేదు. ప్రజా నాయకుడిగా నిర్వహించే విధ్యుక్తధర్మంలో భాగంగా ఆయన అనేక ఆటుపోట్లను ఎదుర్కొని అజేయుడిగా నిలిచి, ప్రజల చేత మన్ననలను పొందారు. ఆయనలోని దీక్షా, పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాల వల్లనే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన 17వ వ్యక్తిగా చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచారు. రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అనతి కాలంలోనే ఘన విజయాలను సాధించారు. జన్మభూమి, శ్రమదానం, ప్రజల వద్దకు పాలన తదితర కార్యక్రమాలతో నిరంతరం ప్రజల్లోనే ఉన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక బోర్డును ఏర్పాటు చేశారు. కంప్యూటర్ విద్య, మహిళా కండక్టర్లు వంటి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. జాతీయంగా, అంతర్జాతీయంగా తెలుగుజాతి ఖ్యాతి ఇనుమడింపజేశారు. యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా చంద్రబాబు వ్యవహరించారు. చంద్రబాబు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా, రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విజన్ 2020 పేరుతో 20 ఏళ్ల భవిష్యత్తుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల సమస్యలపైనే రాజీలేని పోరాటం చేశారు.

చంద్రబాబు అనుభవంపై నమ్మకంతో 2014 ఎన్నికలలో ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. లోటు బడ్జెట్‌తో, విద్యుత్ లోటుతో రాజధాని, నిధులు లేకుండా పాలన మొదలుపెట్టి ఐదేళ్లల్లో దేశంలో ఎక్కడా అమలుకాని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో చంద్రబాబు అమలు చేశారు. అటువంటి నాయకుడిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

–ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రి

(నేడు నారా చంద్రబాబునాయుడి పుట్టిన రోజు)

www.andhrajyothy.com
ABN ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చికెన్‌తో చేసే వంటలు ఏవైనా మినిమమ్ గ్యారెంటీ. ఎప్పుడూ వండే కూరలు కాకుండా కాస్త వెరైటీగా ఆఫ్ఘనీ చికెన్ కర్రీ, అపోలో చికెన్, చికెన్ లెగ్స్ ఫ్రై, చికెన్ పాప్‌కార్న్‌ను సులువుగా చేసుకోవచ్చు. ఈ వీకెండ్ మీరూ ఎంచక్కా చేసుకోండిలా..

కోడి మాంసం.. కాస్త వెరైటీగా!

చికెన్ లెగ్స్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ లెగ్ పీస్‌లు- 6, పెరుగు- 6 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, కారం పొడి- రెండున్నర టీ స్పూన్లు, జింజర్ గార్లిక్ పేస్ట్- 2 టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- టీస్పూన్, గరం మసాలా- టీస్పూన్, పెప్పర్ పౌడర్- అర టీస్పూన్, చాట్ మసాలా- అరటీస్పూన్, టమోటా కెచప్- 4 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ-1, పచ్చిమిర్చి- 3 (సన్నగా తరగాలి), తరిగిన కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకులు- 10, నూనె- 3 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: చికెన్ లెగ్ పీస్‌లను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. లెగ్ పీస్‌ల మీద కత్తితో మూడు గాట్లు పెట్టాలి. ఈ పీస్‌లను ఒక బాక్స్‌లో ఉంచాలి.

మరో బౌల్‌లో పెరుగు, ఉప్పు, ధనియాల పొడి, కారం పొడి, జింజర్ గార్లిక్ పేస్ట్, పసుపు, గరం మసాలా, పెప్పర్ పొడి, చాట్ మసాలా, టమోటా కెచప్ వేశాక నిమ్మకాయ రసాన్ని పిండాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, కరివేపాకు వేసి స్పూన్‌తో రెండు నిముషాలు మిక్స్ చేశాక ఎగ్ మిక్సర్‌తో మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని లెగ్ పీస్‌ల మీద వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపితే ముక్కలకు పడుతుంది. బాక్స్‌ను క్లోజ్ చేసి రెండున్నర గంటల పాటు మారినేట్ చేసుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసి మారినేట్ చేసుకున్న లెగ్ పీస్‌లను వేసుకోవాలి. బాక్సులో మిగిలిన మిశ్రమాన్నంతా అందులోనే వేయాలి. ఆ తర్వాత మంటను మీడియమ్ ఫ్లేమ్‌లో ఉంచి కుక్ చేసుకోవాలి.



ప్యాన్‌కు అంటుకోకుండా.. ముక్క మాడిపోకుండా గరిటెతో కదుపుతూనే ఉండాలి. ఉడికిన తర్వాత చివరగా సిమ్‌లో ఉంచి వేయించాలి. ముక్కలు రెండు వైపులా బాగా కాల్చుకున్న తర్వాత స్టవ్ కట్టేసి వడ్డించుకోవటమే. ఈ లెగ్‌పీస్‌లు జ్యూసీగా ఉంటాయి. అవసరం అనుకుంటే టమోటా కెచప్ లేదా కొత్తిమీర చట్నీతో తినాలి.

అపోలో చికెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- 400 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 4 (సన్నగా తరగాలి), కరివేపాకు- 10 ఆకులు, పచ్చిమిర్చి- 4 (సన్నగా నిలువుగా కోయాలి), కారం- అర టీస్పూన్, చిన్న ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, కోడిగుడ్డు- 1, మైదా- రెండున్నర టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్- రెండున్నర టేబుల్ స్పూన్లు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, పండు మిరపకాయల పేస్ట్- కొద్దిగా, పసుపు- చిటికెడు, పెరుగు- 300 గ్రాములు, ధనియాల పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్,

తయారీ విధానం: చికెన్ శుభ్రంగా కడిగి.. చిటికెన వేలంత పొడవుగా, సన్నగా కట్ చేసుకోవాలి. దీన్ని బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి అర టీస్పూన్ జీలకర్ర, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్,



కారం, పసుపు, కోడిగుడ్డు సొన, మైదాపిండి, కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. ఈ చికెన్ ముక్కలను రెండు నిముషాల పాటు ఉంచి.. ఆ తర్వాత నూనె వేడి చేసి మీడియం ఫ్లేమ్‌లో ఈ చికెన్ ముక్కలను పకోడాల్లా డీప్ ఫ్రై చేసుకోవాలి. మరో బౌల్‌లో నూనె వేసి వెల్లుల్లి రెబ్బలు వేసి గరిటెతో కదిపాక కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ వేయించాక అందులోకి కొద్దిగా అల్లం పేస్ట్ వేసి గరిటెతో కలపాలి. ఇందులోకి పండు మిరపకాయల పేస్ట్, పసుపు వేసి బాగా కలపాలి. ఇందులోకి పెరుగు వేసి మిక్స్ చేయాలి. ఇందులోకి తగినంత ఉప్పు వేశాక మిగిలిన జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా వేసి నిముషం పాటు గరిటెతో కదిపాక.. ఇందులోకి వేయించిన చికెన్ ముక్కలను వేసి కలపాలి. గరిటెతో మూడు నిముషాల పాటు కదిపితే చికెన్ ముక్కలకు మసాలా బాగా పడుతుంది. చివరగా కొత్తిమీర వేసి నిముషం పాటు కదిపి ప్లేట్‌లో వేసి వడ్డించుకోవటమే తరువాయి.

చికెన్ పాప్‌కార్న్

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- పావు కేజీ (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), ఉప్పు- రుచికి తగినంత, కారం- 1 టీస్పూన్, వెల్లుల్లి పొడి- 1 టీస్పూన్, వెనిగర్- టేబుల్ స్పూన్, సోయాసాస్- అర టీస్పూన్, రెడ్ చిల్లీ సాస్- 2 టేబుల్ స్పూన్లు, పాలు- పావు కప్పు, కోడిగుడ్డు- 1, మైదా- 1 కప్పు, కార్న్ ఫ్లోర్- 1 కప్పు, కారం - టీస్పూన్, అల్లం పొడి- 1 టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం: బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి అందులో తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి పొడి, వెనిగర్, సోయాసాస్, రెడ్ చిల్లీ సాస్, పాలు వేసి స్పూన్‌తో బాగా మిక్స్ చేయాలి. దీన్ని పాలిథీన్ కవర్‌తో కవర్ చేసి ఫ్రిజ్‌లో ఉంచి అర గంట పాటు మారినేట్ చేసుకోవాలి.

ఫ్రిజ్‌నుంచి తీశాక కోడిగుడ్డు సొన వేసి కలపాలి. మరో బౌల్‌లో మైదా, కార్న్‌ఫ్లోర్, కారంతో పాటు రుచికి తగినంత ఉప్పు, అల్లం పొడి వేసి ఎగ్ మిక్సర్‌తో మిశ్రమాన్ని బాగా కలపాలి. చిన్న బౌల్‌లో చల్లనీళ్లు తీసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లోని చికెన్ ముక్కలను స్పూన్‌తో ఒక్కోటి తీసుకుని మిక్స్ చేసి మైదా పిండిలో వేయాలి. పిండి బాగా పట్టేట్లు కదిపి.. ప్రతి ముక్కను చల్లనీళ్లలో వేసి మళ్లీ పిండిలో వేయాలి. ఇలా చేస్తే మైదా, కార్న్‌ఫ్లోర్‌ల మిశ్రమం ముక్కకు బాగా పడుతుంది. పిండి అద్దిన ఈ చికెన్ ముక్కలను ఒక బౌల్‌లో వేసుకుని ఒకేసారి డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ పాప్‌కార్న్ మంచి టెక్చర్‌తో పాటు రుచికరంగా ఉంటాయి. టమోటా కెచప్‌తో తినొచ్చు.

ఆఫ్ఘనీ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

చికెన్- కేజీ, పచ్చి మిరపకాయలు- 8 (సన్నగా తరగాలి), మీడియం సైజ్ ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 9 (సన్నగా తరగాలి), అల్లం- చిన్న ముక్క, పెరుగు- కప్పు, కొత్తిమీర- కట్ట (సన్నగా తరగాలి), ఫ్రెష్ క్రీమ్- కప్పు, గరం మసాలా- ముప్పావు టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, కసూరీ మేథీ- టేబుల్ స్పూన్, చాట్ మసాలా- రెండు టీస్పూన్లు, యాలకులు-3, లవంగాలు-3, నూనె- 3 టేబుల్ స్పూన్లు, చిన్న నిమ్మకాయ- 1, దాల్చిన చెక్క- 1, మిరియాల పొడి - టేబుల్ స్పూన్.

తయారీ విధానం

జార్‌లో ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, వెల్లుల్లి, అల్లం, కొత్తిమీర వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తని పేస్ట్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి పెరుగు, ఫ్రెష్ క్రీమ్, గరం మసాలా, ఉప్పు, చాట్ మసాలా, మిరియాల పొడి, కసూరీ మేథీ వేసి అందులో సగం నిమ్మకాయ రసం పిండాలి. గరిటెతో రెండు నిముషాలు కలిపిన తర్వాత ఎగ్ మిక్సర్‌తో వేగంగా మిక్స్ చేయాలి. దీనివల్ల అన్ని ఫ్లేవర్స్ బాగా కలసిపోతాయి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి.

చికెన్‌ను మంచి నీళ్లతో శుభ్రంగా కడిగి.. ప్రతీ ముక్క మీద కత్తితో రెండు లేదా మూడు గాట్లు పెట్టాలి. ఆ చికెన్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి మిక్సీ పట్టిన పేస్ట్ కొంచెం వేసి చికెన్ ముక్కలకు అంటేట్లు బాగా చేత్తో కలపాలి. మారినేట్ చేసి గంటన్నరపాటు వదిలేయాలి. మిగిలిన పేస్ట్‌ను కూడా గంటన్నరపాటు పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ ముక్కలను ఉంచాలి. రెండు వైపులా ఉడికేట్లు గరిటెతో తిప్పుతూ కుక్ చేసుకోవాలి. కనీసం పదిహేను నిముషాల పాటు ప్యాన్‌లో ముక్కలను వేయించి ప్లేట్‌లో ఉంచుకోవాలి. వెంటనే ప్యాన్‌లో మిగిలిన నూనెలో యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి కలపాలి. ఆ తర్వాత మిక్సీ పట్టిన మిగిలిన పేస్ట్‌ను వేసి బాగా కలిపి.. ప్యాన్ మూత పెట్టి పది నిముషాల పాటు ఉడికించాలి. ఆ తర్వాత వేయించిన చికెన్ ముక్కలు వేసి మిశ్రమంలో రెండు నిముషాల పాటు కలిపిన తర్వాత ప్యాన్ మూత ఉంచి పదిహేను నిముషాల పాటు చిన్న మంట మీద కుక్ చేయాలి. చికెన్ ముక్కలు మగ్గుతాయి. నూనె పైకి తేలి ఉడికినట్లు కనపడితే రెండు నిముషాలు గరిటెతో మిక్స్ చేసి దించేసుకోవటమే. ఈ ఆఫ్ఘనీ చికెన్ కర్రీలో నిమ్మకాయ పిండుకుని రోటీ, చపాతీ, దోశల్లోకి తింటే భలే ఉంటుంది.



శంఖానుకారీ తచ్ఛుభ్రంచంద్రవత్సరం దధి
ధృష్టంతన్మకరాధారైః స్ఫోటితం పరివేషితమ్!

పెరుగంటే తెల్లని శంఖంలా ఉండాలి. దట్టంగా మీగడ కట్టి, చంద్రబింబంలా కనిపించాలి. చెంచాలాంటి పరికరంతో ముక్కలుగా కోయగలిగేంత గట్టిగా ఉండాలంటున్నాడు క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలోని ఈ పద్యంలో. అలాంటి పాలనిచ్చే ఆవునో, గేదెనో మేపటం, ప్రత్యేకమైన పొయ్యి మీదో పాలు కాయడం దగ్గరినుంచి... తోడు పెట్టేవరకూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటే ఒకటి రెండు చెంచాలు కలిపి, కొద్దిగా జీలకర్ర పొడి వేసుకుని తాగితే జీర్ణ శక్తి పదిలం అవుతుంది. కడుపులో చల్లగా ఉంటుంది. ఎసిడిటీ తగ్గుతుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధులకు ఇదే మందు. అల్సర్లు త్వరగా తగ్గుతాయి.

- బాగా చిక్కపడేలా కాచిన పాలకు రెండు అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. మొదటిది అంతటి అత్యధిక ఉష్ణోగ్రత దగ్గర కాయటం వలన పాలలో ఉండే చెడ్డ బాక్టీరియా పూర్తిగా నశిస్తుంది. కొద్దిగా పొంగు వస్తే చాలు కాయటం ఆపేసిన పాలలో చెడ్డ బాక్టీరియా పూర్తిగా చావదు. ఒక వంతు పాలు మరిగే

పెరుగు ఎలా ఉండాలంటే

పెరుగు ఇలా జున్ను ముక్కలా కోయగలిగేలా తోడుకుంటుంది కూడా!

ఇలా తోడుకున్న పెరుగుకు ఆయుర్వేద శాస్త్రంలో చెప్పిన గుణాలన్నీ ఉన్నాయి. ఒక్కో జంతువు పాలతో తోడుపెట్టిన పెరుగుకు ఒక్కో లక్షణాలు చెప్పింది శాస్త్రం. మనకు పాలు ప్యాకెట్లలో పట్టి, పాల కంపెనీలు పంపిస్తున్నాయి. వారు ఏది ప్యాకెట్లో ఇస్తే అదే మనకు శరణ్యం అవుతోంది. లేకపోతే బిందెల్లో ఇంటికి తెచ్చి పోసే పాల మీద ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వాలకు పాల మీద అదుపు లేదు. పాలు కుళ్లు వాసన వస్తుంటే ఇవ్వాళేదో రుచిలో తేడాగా ఉన్నదనుకుంటూనే సరిపెట్టుకుని వాడేసుకుంటున్నాం.

ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా సామాన్యుడు పాలను... పెరుగునూ కొనుక్కుని వాడుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో పాలు కొనుక్కొని తోడు పెట్టుకోవటమే ఉన్నంతలో నయం. పాలను రెండు మూడు పొంగులొచ్చేదాకా మరగనిస్తే చిక్కదనం వస్తుంది. వాటిని తోడేసిన పెరుగు గట్టిగా ఉంటుంది. పలుచని పెరుగులో కన్నా గట్టి పెరుగులో ఉపయోగపడే బాక్టీరియా బలంగా ఎదుగుతుంది.



దాకా కాచిన పాలే ఆరోగ్యదాయకమైనవి. ఈ పాలతో తోడుపెట్టిన పెరుగు మరింత ఆరోగ్యదాయకమైంది. బలమైన, ఉపయోగపడే బాక్టీరియాని కలిగి ఉండి పేగుల్ని సంరక్షిస్తుంది. చిక్కటి పాలతో చేసిన పెరుగు వాతాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందని క్షేమశర్మ చెప్పాడు. ధాతువుల్లో ఉండే అగ్నిని పెంపు చేస్తుంది. ధాత్వగ్ని పాకం జరిగిన రస రక్త మాంసాది ధాతువులు శరీరానికి బాగా అందుతాయి. శక్తి ఉత్పత్తి బాగా జరుగుతుంది. ఎనీమియా లాంటి ధాతుక్షీణ వ్యాధులు రాకుండా ఉంటాయి.

'శాల్యోదనేన సంయుక్తం సతతం మాహిషం దధి' అంటూ గేదె పెరుగు కలిపిన అన్నం కృష్ణుడికి ఇష్టం అని గోపికలు తెచ్చి ప్రేమతో తినిపించేవారట. చద్దన్నం అంటే ఈ చల్లన్నమే! పాచిపోయిన అన్నం కాదు! పెరుగన్నం వాతాన్ని, వేడినీ తగ్గిస్తుంది. బలాన్ని శక్తినీ ఇస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. ఇందులో దానిమ్మ గింజలు, ద్రాక్ష పండ్లు వగైరా కలిపి, కొత్తిమీరతో అలంకరించి తాలింపు పెట్టిన దద్ధోజనం తిరుగులేని శక్తిదాయిని.

గట్టిగా తోడుకున్న పెరుగుని తీసుకుని దాంతో మనం చేసుకోగల పదార్థాల గురించి క్షేమశర్మ వివరించాడు. మండే ఈ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్నిచ్చే పెరుగు మజ్జిగల గురించే కదా మనం ఆలోచించాల్సింది!

- ఒక గ్లాసు పెరుగులో 3 గ్లాసుల నీళ్లు కలిపి చిలికి, ఒక రాత్రంతా ఉంచి, మర్నాడు అందులో సైంధవ లవణం, అల్లం కలిపి నూరాలి. ఈ ముద్దను
- గేదె పాలకన్నా ఆవు పాలు కొద్దిగా పలచగా ఉంటాయి. అందుకని ఆవు పాలను మరింతసేపు కాయాల్సి ఉంటుంది. చిక్కని ఆవుపాలతో చేసిన పెరుగు అన్ని దోషాలనూ హరిస్తుంది. పూర్తిగా జీర్ణం అయ్యాక తీపి పదార్థం ఏ గుణాలిస్తుందో పెరుగు కూడా అవే గుణాలిస్తుంది. ఒక కప్పు పెరుగు 200 గ్రాముల స్వీటుతో సమానమే. కానీ పెరుగు గుండెకు మంచిది. జీర్ణ శక్తిని పెంచుతుంది. కొద్దిగా వేడి చేస్తుంది.
- గేదె పాలతో చేసిన పెరుగు పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తుంది. కానీ, కష్టంగా అరుగుతుంది. నాలుగైదు పొంగులు వచ్చేదాకా మరిగిస్తే తేలిగ్గా అరుగుతాయి. చలవనిస్తుంది. కాగీ కాగని పాలతో చేసిన పెరుగు వాతాన్ని, అజీర్తిని పెంచుతుంది. స్థూలకాయాన్ని తెస్తుంది. స్త్రీ, పురుష పరమైన శక్తి, ఆసక్తి పెరుగుతాయి.
- మేక పాలను కూడా ఇలానే కాచుకుని తోడు పెట్టుకుంటే మూడు దోషాలూ హరిస్తాయి. క్షయవ్యాధికి గొప్ప ఔషధంగా పని చేస్తాయి. క్షీణింపచేసే వ్యాధుల్లో మేలు చేస్తాయి. దగ్గు, జలుబు, ఆయాసం, ఉబ్బసం రోగులకు మంచిది.
- ప్యాకెట్టు పాలు, పెరుగు కచ్చితంగా ఏ పాలతో తయారయ్యాయో తెలియదు. విదేశాల నుంచి దిగుమతి అయిన పాల పొడితో తయారైన పాలకు మన దేశపు ఆవు పాల గుణాలున్నాయో లేదో చెప్పలేము. ఏ పాలతో తయరైన పెరుగైనా రాత్రిపూట తినటం మంచిది కాదు. బాగా చిలికి అందులో అల్లం, జీలకర్ర, సైంధవలవణం కలిపి తాగటమే శ్రేయస్కరం. ఉప్పు నిషేధం ఉన్నవారు అది లేకుండానే జీలకర్ర వగైరా కలిపి తాగవచ్చు. పెరుగుకు నిషేధాలున్నాయి గానీ మజ్జిగకు శీతాకాలం, వర్షాకాలం ఇలా ఏ కాల నియమాలూ లేవు.

- గంగరాజు అరుణాదేవి

అలసిన కళ్లు మిలమిల

మేకప్

అలసటతో జీవం తగ్గిన కళ్లకు ఐ మేకప్‌తో జీవం పోయవచ్చు. కళ్ల కింద నలుపు, వాపు లాంటి లక్షణాలను కూడా ఐమేకప్‌తో దాచేయవచ్చు. అదెలాగంటే..

ఐ షాడో: తేలిక రంగు ఐ షాడోను కనురెప్పల పైన, కళ్ల అంచుల్లో ఉండే ముడతలు, కళ్ల చివర్లలో అద్దుకుంటే అలసట ప్రతిబింబించే కళ్ల మెరుపును సంతరించుకుంటాయి.

కన్‌సీలర్: కన్‌సీలర్ కళ్ల కింద నలుపును పూర్తిగా దాచలేదు. కాబట్టి కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత, దాని పైన షిమ్మరీ హైలైటర్ అప్లై చేసుకోవాలి.

ఐబ్రో: అలసిన కళ్ల నుంచి చూపులను మరల్చడం కోసం కనుబొమలను ఆకర్షణీయంగా దిద్దుకోవాలి. ఐబ్రో పెన్సిల్ లేదా ఐ షాడోతో కనుబొమలను మృదువుగా అందంగా దిద్దుకోవాలి. కనుబొమలను దిద్దుకోడానికి నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుమ రంగు ఎంచుకోవాలి. ఇలా చేయడం వల్ల న్యాచురల్ లుక్ సొంతమవుతుంది.




కనురెప్పలు: మస్కారా అప్లై చేయడాని కంటే ముందు కనురెప్పల వెంట్రుకలను కర్లర్‌తో పైకి తిప్పుకోవాలి. ఇలా తిప్పుకునే సమయంలో రెప్పల వెంట్రుకలన్నీ కర్లర్‌లోకి ఒదిగాయో లేదో గమనించుకోవాలి. వెంట్రుకల కుదుళ్ల నుంచి అంచుల వరకూ కర్లర్‌ను కదిలిస్తూ ల్యాషెస్‌ను వంపు తిప్పుకోవాలి.

వైకల్యాన్ని జయించి... సివిల్ సర్వీసెస్ నెగ్గి

సెరెబ్రల్ పాల్సీతో చక్రాల కుర్చీకే పరిమితమైపోయిన 23 ఏళ్ల కేరళ యువతి సారిక, సివిల్ సర్వీస్ పరీక్షలో నెగ్గి, మనోబలంతో అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది. యుపిఎస్సీలో 922వ ర్యాంకు సాధించిన సారిక గురించిన ఆసక్తికరమైన కథనమిది.

స్ఫూర్తి



'నడవలేకపోయినా, చేతులు సహకరిస్తే అదే పది వేలు, అన్ని పనులకూ ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి తప్పుతుంది' అనుకుంటారు దివ్యాంగులు. కానీ కేరళలోని కోజికోడ్‌కు చెందిన సారిక పరిస్థితి అంతకంటే దారుణం. సెరెబ్రల్ పాల్సీతో చేతులు కూడా సహకరించని పరిస్థితి ఆ అమ్మాయిది. అయినా వైకల్యాన్ని అధిగమించి అందలాలను అందుకున్న వాళ్ల కథల నుంచి ఆ అమ్మాయి ప్రేరణ పొందింది. సివిల్ సర్వీసెస్‌లో నెగ్గి, అనుకున్నది సాధించడానికి వైకల్యం అడ్డు రాదని నిరూపించాలని అనుకుంది. మొదటిసారి పరీక్షలో నెగ్గలేకపోయినా, రెండోసారి 2023 యుపిఎస్సీలో 922వ ర్యాంకును సాధించగలిగింది. ఆ ఘనత, తన ఉపాధ్యాయులు తల్లితండ్రులు, స్నేహితులకే దక్కుతుందని అంటున్న సారిక... "నా సంతోషాన్ని ఎలా వ్యక్తం చేయాలో తెలియడం లేదు. ఇది నేను ఊహించని విజయం" అంటూ తన సంతోషాన్ని మీడియాతో పంచుకుంది.

సవాళ్లను అధిగమించి

సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయడం కోసం సరిత చేసిన ప్రయాణమంతా సవాళ్లతోనే సాగింది. పరీక్ష సెంటర్లను వెతుక్కుంటూ వెళ్లడం మొదలు, వారం రోజుల పాటు సాగే మెయిన్స్‌కు హాజరవడం వరకూ తనకెదురైన సవాళ్లన్నిటినీ ఆ అమ్మాయి పట్టుదలతో అధిగమించింది. ఐఏఎస్ అకాడమీ ఫౌండర్, మోటివేషనల్ స్పీకర్, డాక్టర్ జోబిన్ ఎస్ కొట్టాయం, కేరళలో ప్రాజెక్ట్ చిత్రశలభం అనే ట్రైనింగ్ ప్రోగ్రాంను లాంచ్ చేశాడు. దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సివిల్ సర్వీస్ కోచింగ్ ఇవ్వడం ఆ ప్రోగ్రాం లక్ష్యం. అలా ఉచిత శిక్షణ తీసుకున్న సరిత, రెండోసారి సివిల్ సర్వీసెస్‌కు పట్టుదలతో సిద్ధపడింది. కోజికోడ్‌లో పరీక్ష హాల్ డిజేబుల్డ్ ఫ్రెండ్లీ కావడం కూడా సరితకు కలిసొచ్చింది. తిరువనంతపురంలో జరిగిన మెయిన్స్ కోసం కూడా సరితకు తగిన ఏర్పాట్లను కల్పించడం జరిగింది. పరీక్ష రాయడానికి కుడి చేయి సహకరించదు కాబట్టి సరిత స్క్రైబ్‌ను ఉపయోగించుకుంది. అంతిమంగా ఢిల్లీ ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయానికి సరిత తండ్రి ఖతార్ నుంచి వచ్చి, కూతురికి సహాయపడ్డాడు. తన పుట్టినూరు కోజికోడ్‌ను గ్రాడ్యుయేషన్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవడంతో, ఇంటర్వ్యూ మొత్తం ఆ దిశగానే సాగిందని ఇంటర్వ్యూ తర్వాత చెప్పుకొచ్చింది సరిత.

ఆమే నాకు ప్రేరణ

సాదాసీదా ఉద్యోగానికి బదులుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాన్నే లక్ష్యంగా ఎంచుకోవడం గురించి వివరిస్తూ... "చేతులు లేని లైసెన్స్‌డ్ పైలట్ 'జెస్సికా కాక్స్' నుంచి నేను ప్రేరణ పొందాను. మనోబలం, పట్టుదల కలిగి ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు అనడానికి ఆవిడ కథే ఒక ఉదాహరణ' అంటూ వివరించిన సరిత, ప్రభుత్వోద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను కూడా ఇంతే పట్టుదలతో అధిగమిస్తూ, ప్రజలకు సేవలందించడానికి శాయశక్తులా కృషి చేస్తానని కూడా అంటోందామె.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/uI5BIAjలో చదవండి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5fyrUG0 లో చదవండి.

ఇక జోరుగా పీఎస్‌యూల విక్రయం!

ఎల్ఐసీ, జీఐసీలో వాటాల అమ్మకం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో వాటాల విక్రయం మరింత జోరందుకోనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలైన జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) ఈక్విటీలో 10 శాతం, ఎల్ఐసీ ఈక్విటీలో మరో 1.5 శాతం విక్రయానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. ఇందులో జీఐసీ ఈక్విటీలో 10 శాతం విక్రయం ద్వారా రూ.5,700 కోట్లు, ఎల్ఐసీ ఈక్విటీలో 1.5 శాతం విక్రయం ద్వారా కనీసం రూ.10,000 కోట్లు లభిస్తాయని అంచనా.

మరో మూడు బ్యాంకులు..

జీఐసీ, ఎల్ఐసీకి తోడు ఐడీబీఐ బ్యాంక్, ప్రభుత్వ రంగంలోని రెండు బ్యాంకుల ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి చేసేందుకు అధికార వర్గాలు కసరత్తు పూర్తి చేశాయి. ఈ రెండు బ్యాంకులు ఏవనే విషయాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకు బయటపెట్టలేదు. అయితే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఈ జాబితాలో ఉన్నట్టు సమాచారం. ఎన్ఎండీసీ అనుబంధ సంస్థ ఎన్ఎండీసీ స్టీల్ ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందని భావిస్తున్నారు.

విప్రో.. డీలా!



నిరాశాజనకంగా కంపెనీ ఆర్థిక ఫలితాలు

7.8% తగ్గి రూ.2,835 కోట్లకు పరిమితమైన క్యూ4 లాభం

- రూ.22,208 కోట్లకు జారిన ఆదాయం
- 9.5 శాతం తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- ఉద్యోగుల వలసల రేటు 14.2 శాతం
- ఒక్కో షేరుకు రూపాయి డివిడెండ్

బెంగళూరు: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికంలో (క్యూ4) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.8 శాతం క్షీణించి రూ.2,834.6 కోట్లకు పరిమితమైంది. ఆదాయం కూడా 4.2 శాతం తగ్గి రూ.22,208.3 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సైతం విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 0.8 శాతం తగ్గి రూ.89,760.3 కోట్లకు చేరుకోగా.. నికర లాభం 2.6 శాతం తగ్గుదలతో రూ.11,045.2 కోట్లుగా నమోదైంది. క్యూ4లో ఐటీ సేవల విభాగం నుంచి కంపెనీకి సమకూరిన ఆదాయం 265.7 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే 0.1 శాతం అధికమిది. మరిన్ని విషయాలు..

- ఈ జూన్ 30తో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికానికి (క్యూ1)లో ఐటీ సేవల వ్యాపారం ద్వారా కంపెనీకి సమకూరనున్న ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారంగా) 261.7-267 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. అనగా, 2023-24 క్యూ4తో పోలిస్తే 2024-25 క్యూ1లో ఆదాయ వృద్ధి మైనస్ 1.5 శాతం నుంచి 0.5 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని కంపెనీ భావిస్తోంది.
- క్యూ4లో 120 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను దక్కించుకున్నట్లు విప్రో వెల్లడించింది. క్యూ3లో లభించిన 90 కోట్ల డాలర్ల బడా కాంట్రాక్టులతో పోలిస్తే 31 శాతం అధికమిది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారీ డీల్స్ 460 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, క్యూ4 మొత్తం బుకింగ్స్ 360 కోట్ల డాలర్లుగా, 2023-24 మొత్తానికి 1,490 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.
- ఈ జనవరి 12న నిర్వహించిన బోర్డు సమావేశంలో వాటాదారులకు ఒక్కో షేరుకు రూపాయి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు. దీనికి బోర్డు సభ్యులు తాజాగా ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను దీన్నే తుది డివిడెండ్‌గా పరిగణించడం జరుగుతుందని విప్రో స్పష్టం చేసింది.
- క్యూ4లో విప్రోలో నికరంగా 6,180 మంది ఉద్యోగులు తగ్గారు. త్రైమాసికం చివరినాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గడం వరుసగా ఇది ఆరోసారి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 9.5 శాతం (24,516 మంది) తగ్గడంతో ఈ మార్చి 31 నాటికి 2,34,054 మందికి పరిమితమైంది. గడిచిన దశాబ్దకాలంలో విప్రో ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన తగ్గడం ఇది మూడోసారి. కాగా, కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 14.2 శాతంగా నమోదైంది.

అనిశ్చితులు అలాగే..

గడిచిన ఆర్థిక సంవత్సరం ఐటీ పరిశ్రమకు పెద్ద సవాలుగా నిలిచింది. అది మా కంపెనీ పనితీరుపైనా ప్రభావం చూపింది. ఇప్పటికీ ఆర్థిక అనిశ్చితులు అలాగే కొనసాగుతున్నాయి. స్వల్పకాలికంగా మరిన్ని సవాళ్లు ఎదురుకావచ్చు. అయినప్పటికీ, అవకాశాలు అపరిమితం. మా ముందున్న అవకాశాలపై ఆశావహంగా ఉన్నాం. సాంకేతికంగా ఐటీ రంగం పెను మార్పులకు లోనవుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అందుబాటులోకి రావడంతో క్లయింట్ల అవసరాలూ మారుతున్నాయి. ఎందుకంటే, వారు ఏఐ టెక్నాలజీ సాయంతో మార్కెట్ పోటీలో నిలబడటంతో పాటు వ్యాపార విలువను పెంచుకోవాలని చూస్తున్నారు. మేం కూడా ఇందుకు సిద్ధమవుతున్నాం. క్లయింట్లు తమ లక్ష్యాల సాధించేందుకు తోడ్పడే సామర్థ్యం, నాయకత్వం, 2.30 లక్షలకు పైగా నిపుణులైన సిబ్బంది మాకుంది. ఇందుకోసం మేం గణనీయంగా కసరత్తు చేయాల్సి ఉన్నప్పటికీ సమిష్టి కృషితో కంపెనీ భవిష్యత్ వృద్ధికి బాటలు వేస్తాం.

- శ్రీనివాస్ పల్లియా, సీఈఓ, విప్రో

చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకం

మరో ఐదేళ్ల పాటు (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, మరో ఐదేళ్ల (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా అజీమ్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

గ్రీన్‌కో నుంచి అమర రాజా ఇన్‌ఫ్రాకు ఆర్డర్

న్యూఢిల్లీ: అమర రాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఐపీఎల్)కు గ్రీన్‌కో నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద కంపెనీ కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ పట్టణ సమీపంలో గ్రీన్‌కో కోసం 2,200 ఎకరాల్లో 700 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో కంపెనీ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. తాజా ఆర్డర్‌తో ఈ ఏడాది మార్చి చివరి నాటికి అమర రాజా ఇన్‌ఫ్రా చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.1,516 కోట్లకు చేరింది.

'సినర్జీస్' కంపెనీ ఎండీ శేఖర్ మొవ్వా కన్నుమూత



కూర్మన్నపాలెం (విశాఖపట్నం): ప్రముఖ పారిశ్రామికవేత్త, 'సినర్జీస్' కాస్టింగ్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ మొవ్వా హఠాన్మరణం చెందారు. ఆయన కంపెనీ పనిపై కొద్ది కాలం కిందట లండన్ వెళ్లారు. ఈ నెల 16వ తేదీన ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగా శేఖర్ తుదిశ్వాస విడిచారు. ఈ సమాచారం తెలిసి సంస్థ ఉద్యోగులు, దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో పారిశ్రామికవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన భౌతిక కాయం శనివారం విశాఖ నగరానికి తీసుకువస్తున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ.. అల్లాయ్ వీల్స్ పరిశ్రమలో శేఖర్ ఎన్నో నూతన ఒరవడులను తీసుకువచ్చారన్నారు. పాతికేళ్ల క్రితం సినర్జీస్ పరిశ్రమను స్థాపించి ఎంతోమందికి జీవనోపాధిని కల్పించారన్నారు.

ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు రాబోతున్నాయ్..!

2026లో అందుబాటులోకి

న్యూఢిల్లీ: దేశంలో మరో రెండేళ్లలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు అందుబాటులోకి రాబోతున్నాయి. దేశీయ ఎయిర్‌లైన్స్ ఇండిగో యాజమాన్య సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో కలిసి అమెరికాకు చెందిన ఆర్చర్ ఏవియేషన్ ఈ ఎయిర్ ట్యాక్సీలను దేశంలో ప్రవేశపెట్టనుంది. వీటి ద్వారా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కు కేవలం 7 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.2,000- 3,000 వరకు వసూలు చేయనున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. ఈ 27 కిలోమీటర్ల రోడ్డు మార్గ ప్రయాణానికి గంటన్నర పడుతుందని, ట్యాక్సీ అద్దె రూ.1,500 వరకు అవుతుందన్నారు. అంటే, క్యాబ్ చార్జీతో పోలిస్తే 1.5 రెట్ల ధరకే నిమిషాల్లో గమ్యాన్ని చేరుకోవచ్చు. తొలుత ఢిల్లీ-గురుగ్రామ్‌తో పాటు ముంబై-బెంగళూరు మార్గంలోనూ ఈ సేవలు ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. భారత్‌లో ఎయిర్ ట్యాక్సీ సేవల ప్రారంభం కోసం గత ఏడాది నవంబరులో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో ఆర్చర్ ఏవియేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీ

600 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల నష్టాలకు శుక్రవారం తెర దించింది. బ్యాంకింగ్, ఆటో షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్ 599.34 పాయింట్లు లాభపడి 73,088.33 వద్ద ముగియగా నిఫ్టీ 151.15 పాయింట్లు లాభపడి 22,147 వద్ద క్లోజైంది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1,156.57 పాయింట్లు, నిఫ్టీ 372 పాయింట్లు నష్టపోయాయి.

నెస్లే డౌన్: తక్కువగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో శిశు పాల ఉత్పత్తులను అధిక చక్కెర శాతంతో విక్రయించిందన్న అభియోగాల నేపథ్యంలో నెస్లే షేరు పతనం కొనసాగుతోంది. బీఎస్ఈలో శుక్రవారం ఈ షేరు ఇంట్రాడేలో 3.53 శాతం నష్టంతో రూ.2,375.75 స్థాయికి దిగజారింది. అయితే చివరికి 1.04 శాతం నష్టంతో రూ.2,437.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 1.32 శాతం నష్టంతో రూ.2,430 వద్ద ముగిసింది.

23న ఎంఫోర్స్ ఆటోటెక్ ఇష్యూ: ఆటో విడిభాగాల తయారీదారు ఎంపోర్స్ ఆటోటెక్ ఐపీఓ వచ్చే మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా 54.99 లక్షల తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయడం ద్వారా రూ.54 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. షేరు ధర శ్రేణిని రూ.93-98గా నిర్ణయించారు. ఈ షేర్లను బీఎస్ఈ ఎస్ఎంఈ సూచీలో లిస్టింగ్ చేస్తారు.

కెనరా స్టాక్ విభజన : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ షేర్ల విభజనకు రికార్డు తేదీని మే 15గా నిర్ణయించింది. ఆ తేదీకి బ్యాంక్ షేర్లున్న వారందరూ దీనికి అర్హులవుతారు. ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల షేర్లను ఒక్కోటి రూ.2 విలువ గల ఐదు షేర్లుగా విభజించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఫిబ్రవరిలో ఆమోదముద్ర వేసింది.

బంగారం అ'ధర' హో: బులియన్ మార్కెట్లో బంగారం ధర ఎక్కడా వెనుక చూపే లేదన్నట్టుగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ.400 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.74,100 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.100 పెరిగి కొత్త రికార్డు స్థాయి రూ.86,600 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 15 డాలర్లు పెరిగి 2,390 డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సు 28.29 డాలర్లు పలికింది.

ఐటీలో ఆగని సంక్షోభం

64,000 మంది ఉద్యోగులు బయటకు

బెంగళూరు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో సంక్షోభం కొనసాగుతోంది. ఈ ప్రభావం ఉద్యోగుల మీదా పడుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మూడు అగ్రశ్రేణి ఐటీ దిగ్గజ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు 64,000 మంది ఉద్యోగులను బయటికి పంపించాయి. ఇందులో ఇన్ఫోసిస్ 24,994 మందిని,విప్రో 24,516 మందిని, టీసీఎస్ 13,244 మందిని ఇంటికి పంపించాయి.చిన్న,మధ్య తరహా ఐటీ కంపెనీలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య లక్షకు పైనే ఉంటుందని అంచనా. అయితే ఇందులో కొందరు ఉద్యోగాలు మారిన వారు కూడా ఉన్నారు.

తీసివేతలకు కారణాలు..

- అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తటం
- కంపెనీలు తమ ఐటీ బడ్జెట్‌లను గణనీయంగా తగ్గించడం
- ఆర్డర్లు తగ్గడంతో కంపెనీలు ఉద్యోగుల కోతలకు దిగడం
- కొంతమంది ఉద్యోగులు సరికొత్త టెక్నాలజీలను సరిగా నేర్చుకోలేక పోవడం
- తయారీ, బీఎఫ్ఐఎస్ రంగాల్లో మంచి అవకాశాలు లభించడం

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,340 ▲	68,150 ▲	90,000 ▼
ముంబై	73,404 ▼	67,236 ▼	82,853 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	415
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	493	విశాఖపట్నం	430

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X హైదరాబాద్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)

లఖ్‌నవూ సూపర్

చెన్నైపై ఘనవిజయం

రాహుల్, డికాక్ అర్ధసెంచరీలు

తేలిపోయిన సీఎస్‌కే బౌలర్లు

లఖ్‌నవూ: హ్యాట్రిక్ విజయాలపై కన్నేసిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఝలక్. అటు రెండు వరుస ఓటముల తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాల బాట పట్టింది. సొంత మైదానమంతా పసుపుమయం అయినప్పటికీ.. ఆల్‌రౌండ్ షోతో అదుర్స్ అనిపించింది. ముందుగా బౌలర్లు సీఎస్‌కేను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయగా.. ఆ తర్వాత ఓపెనర్లు రాహుల్ (53 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 82), డికాక్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) శతక భాగస్వామ్యంతో విజయాన్ని ఖాయం చేశారు. చెన్నై బౌలర్లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయారు. దీంతో 8 వికెట్ల తేడాతో గెలిచిన లఖ్‌నవూ 8 పాయింట్లతో నిలిచింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు సాధించింది. జడేజా (40 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్), రహానె (36), మొయిన్ అలీ (30), ఎంఎస్ ధోనీ (9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28 నాటౌట్) రాణించారు. క్రునాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు.



ధోనీ (9 బంతుల్లో 28 నాటౌట్)



రాహుల్ (53 బంతుల్లో 82)

అలవోకగా..: స్లో పిచ్‌పై ఛేదన లఖ్‌నవూకు కూడా కష్టంగా మారుతుందనిపించినా.. ఓపెనర్లు రాహుల్, డికాక్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకుసాగారు. వికెట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో ఈ ఇద్దరూ శతక భాగస్వామ్యంతో చెన్నై బౌలర్లను ఆటాడేసుకున్నారు. ముఖ్యంగా రాహుల్ దూకుడుకు స్కోరు 11 ఓవర్లలోనే వంద దాటడం విశేషం. బంతి చక్కగా బ్యాట్ మీదికి రావడంతో రాహుల్ ఆరంభం నుంచే వేగంగా ఆడాడు. మూడో ఓవర్‌లో 4,6.. ఆరో ఓవర్‌లో 4,6 బాదడంతో పవర్‌ప్లేలో 54 రన్స్ చేసింది. 11వ ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో రాహుల్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు డికాక్ కూడా చక్కగా సహకరిస్తూ 40 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఈ దశలో వికెట్ కోసం చెన్నై ఎదురుచూపులకు తెర దించుతూ 15వ ఓవర్‌లో ముస్తాఫిజుర్.. డికాక్ వికెట్ తీశాడు. దీంతో తొలి వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కానీ అప్పటికి ఎల్ఎస్‌జీ విజయానికి 30 బంతుల్లో 43 పరుగులే అవసరమయ్యాయి. 17వ ఓవర్‌లో పూరన్ రెండు, రాహుల్ ఓ ఫోర్‌తో 15 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లో జడేజా డైవింగ్ క్యాచ్‌తో రాహుల్ వెనుదిరిగినా లఖ్‌నవూకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. పూరన్ (23 నాటౌట్), స్టొయినిస్ (8 నాటౌట్) మరో ఓవర్ ఉండగానే మ్యాచ్‌ను ముగించారు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ 50+ స్కోర్లు (25) సాధించిన వికెట్‌కీపర్‌గా రాహుల్. ధోనీ (24)ని అధిగమించాడు.

జడేజా నిలకడ, ధోనీ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఆరంభం నుంచే తడబడింది. పరుగులు కష్టంగా మారిన ఈ పిచ్‌పై లఖ్‌నవూ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లను తీస్తూ ఒత్తిడి పెంచారు. కానీ ఆఖరి రెండు ఓవర్ల సమయంలో బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ధనాధన్ షోతో మురిపించాడు. జడేజా అజేయ అర్ధసెంచరీతో నిలువగా జట్టు సవాల్ విసిరే స్కోరందుకోగలిగింది. పేసర్ మొహిసిన్ అద్భుత బంతికి ఓపెనర్ రచిన్ రెండో ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ రుతురాజ్ (17) సైతం నిరాశపరుస్తూ పేసర్ యష్‌కు దొరికిపోయాడు. అటు ఓపెనర్‌గా రహానె ఈసారి ఫామ్‌ను చాటుకున్నాడు. మూడో ఓవర్‌లో సిక్సర్ బాదిన తను ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించడంతో పవర్‌ప్లేలో జట్టు 51/2 స్కోరుతో నిలిచింది. అనంతరం పరుగులు మరీ నెమ్మదించగా వికెట్లు కూడా వేగంగా కోల్పోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా బరిలోకి దిగిన జడేజాతో కలిసి రహానె మూడో వికెట్‌కు 35 పరుగులు జోడించాక తొమ్మిదో ఓవర్‌లో వెనుదిరిగాడు. క్రునాల్ అతడిని బౌల్డ్ చేశాడు. కాసేపటికే చెన్నైకి గట్టి దెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే (3)ను పేసర్ స్టొయినిస్ అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే ఇంపాక్ట్ ప్లేయర్ రిజ్వీ (1)ని క్రునాల్ దెబ్బతీశాడు. దీంతో జట్టు 90/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో 34 బంతుల పాటు కనీసం ఫోర్ కూడా నమోదు కాలేదు. అతికష్టంగా 15వ ఓవర్‌లో స్కోరు వంద దాటింది. అటు 34 బంతుల్లో జడ్డూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే మొయిన్ అలీ 18వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో చెన్నై శిబిరంలో ఊపును తెచ్చాడు. ఆరో వికెట్‌కు 51 పరుగులు అందించాక తను అదే ఓవర్‌లో అవుట్ కావడంతో ఎంఎస్ ధోనీ బరిలోకి దిగాడు. వచ్చిందే తడవుగా.. 300+ స్ట్రయిక్ రేట్‌తో 19వ ఓవర్‌లో 4,6తో 15 రన్స్.. ఆఖరి ఓవర్‌లో 6,4,4తో 19 రన్స్ అందించడంతో స్కోరు 170 దాటింది.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (బి) క్రునాల్ 36, రచిన్ (బి) మొహిసిన్ 0, రుతురాజ్ (సి) రాహుల్ (బి) యశ్ 17, జడేజా (నాటౌట్) 57, దూబే (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 3, రిజ్వీ (స్టంప్డ్) రాహుల్ (బి) క్రునాల్ 1, మొయిన్ అలీ (సి) బదోని (బి) బిష్ణోయ్ 30, ధోనీ (నాటౌట్) 28, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-4, 2-33, 3-68, 4-87, 5-90, 6-141; **బౌలింగ్:** హెన్రీ 3-0-26-0, మొహిసిన్ 4-0-37-1, యశ్ ఠాకూర్ 4-0-45-1, క్రునాల్ పాండ్యా 3-0-16-2, బిష్ణోయ్ 4-0-44-1, స్టొయినిస్ 2-0-7-1.

లఖ్‌నవూ: డికాక్ (సి) ధోనీ (బి) ముస్తాఫిజుర్ 54, రాహుల్ (సి) జడేజా (బి) పతిరన 82, పూరన్ (నాటౌట్) 23, స్టొయినిస్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19 ఓవర్లలో 180/2; వికెట్ల పతనం:** 1-134, 2-161; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-26-0, తుషార్ దేశ్‌పాండే 4-0-42-0, ముస్తాఫిజుర్ 4-0-43-1, జడేజా 3-0-32-0, పతిరన 4-0-29-1, మొయిన్ అలీ 1-0-5-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	7	4	3	0	8	0.529
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
ముంబై	7	3	4	0	6	-0.133
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నన్నూ చుట్టేసింది ధోనీ మేనియా!

స్టెయిన్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ధోనీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక మహీకి ఇదే ఆఖరి ఐపీఎల్ అని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో చెన్నై జట్టు మ్యాచ్‌ల కోసం అభిమానులు స్టేడియాలకు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో మహీ మేనియా తననూ ఆవహించిందంటున్నాడు సఫారీ మాజీ పేసర్ డేల్ స్టెయిన్. 'ధోనీ మేనియా.. నాతోపాటు సౌతాఫ్రికానూ చుట్టుముట్టేసింది. నేను టీవీ ఎక్కువగా చూడను. కానీ ఐపీఎల్ అందునా మహీని చూడడం కోసం టీవీకి అతుక్కుపోతున్నా. అలా గంటలకొద్దీ ఆన్ చేసి ఉంచుతుండడంతో టీవీ పగిలిపోతుందని నా గర్ల్‌ఫ్రెండ్ పరిహాస మాడుతోంది' అని డేల్ సరదాగా చెప్పుకొచ్చాడు.

తెలుగు మూలాల ఇంగ్లండ్ క్రికెటర్ రామన్ సుబ్బా రో మృతి



న్యూఢిల్లీ: తెలుగు మూలాలున్న ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ రామన్ సుబ్బా రో (92) వృద్ధాప్య సమస్యలతో మరణించినట్టు ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. 1958లో ఇంగ్లండ్ తరఫున టెస్ట్ అరంగేట్రం చేసిన ఆయన 1961 వరకు 13 మ్యాచ్‌లు ఆడారు. 29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైన సుబ్బా రో 'ఫస్ట్‌క్లాస్'లో కేంబ్రిడ్జ్ వర్సిటీ, సర్రే, నార్తంప్టన్‌షైర్ జట్లకు ఆడారు. ఆటకు వీడ్కోలు పలికాక 1992-2001 మధ్య 41 టెస్టులు, 119 వన్డే మ్యాచ్‌లకు రెఫరీగా వ్యవహరించారు. ఇప్పటిదాకా..జీవించి ఉన్న పెద్ద వయస్సు ఇంగ్లండ్ క్రికెటర్‌గా ఆయన ఖ్యాతి గాంచారు. అతని తండ్రి పంగులూరి వెంకట సుబ్బారావు బాపట్లకు సమీపంలోని జమ్ములపాలెం నుంచి 1913లో ఉన్నత విద్యకోసం ఇంగ్లండ్ వెళ్లి స్థిరపడ్డారు. తల్లి ఇంగ్లండ్‌కు చెందిన డోరిస్ మిల్డ్రెడ్ పిన్నర్.

ఫైనల్లో యుకీ జోడీ

మ్యూనిచ్ (జర్మనీ): భారత టెన్నిస్ స్టార్ యుకీ భాంబ్రీ బవేరియన్ ఇంటర్నేషనల్ టోర్నీలో డబుల్స్‌లో ఫైనల్ చేరాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యుకీ/అల్బానో అల్బానో (ఫ్రాన్స్) ద్వయం 6-1, 6-7(5-7), 10-7తో ఆస్ట్రియా జంట అలెగ్జాండర్/లుకాస్‌పై నెగ్గింది.

ఛ్.. కొద్దిలో మిస్

జిమ్నాస్ట్ దీపకు చేజారిన పతకం

వరల్డ్‌కప్‌లో నాలుగోస్థానం



న్యూఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ మరోసారి అంతర్జాతీయ వేదికపై ఆకట్టుకునే ప్రదర్శన చేసింది కానీ.. త్రుటిలో పతకం చేజార్చుకుంది. దోహా వేదికగా జరిగిన ఎఫ్ఐజీ ఆపరేటస్ వరల్డ్‌కప్‌లో మహిళల వాల్ట్ ఈవెంట్‌లో దీప నాలుగోస్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫయింగ్ ఈవెంట్ అయిన ఈ టోర్నీలో దీప.. శుక్రవారం జరిగిన వాల్ట్ విభాగం ఫైనల్స్‌లో 13.333 స్కోరు చేసి కొద్దిలో కాంస్యాన్ని కోల్పోయింది. జార్జివా వాలెంటినా (బల్గేరియా) 13.466 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి కంచు పతకాన్ని దక్కించుకుంది. పనామా జిమ్నాస్ట్ నవాస్ కార్లా (13.850)కు స్వర్ణం, కొరియాకు చెందిన ఆన్ చాంగ్ ఓక్ (13.833)కు రజతం లభించాయి. భారత్‌కే చెందిన ప్రణతి నాయక్ క్వాలిఫయింగ్ రౌండ్‌లోనే వెనుదిరిగింది. గతంలో రెండుసార్లు మోకాలి ఆపరేషన్ కారణంగా ఫామ్ కోల్పోయిన 30ఏళ్ల దీప.. ఆమధ్య డోపింగ్ నిబంధనల ఉల్లంఘనతో దాదాపు రెండేళ్ల సస్పెన్షన్‌కు గురైంది. దీంతో ఇప్పటికీ ఒలింపిక్స్ బెర్త్ వేటలోనున్న దీపకు పారిస్ టిక్కెట్ అందుకునేందుకు వచ్చేనెల 16 నుంచి ఉజ్బెకిస్థాన్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ చివరి అవకాశం కానుంది.

ఒలింపిక్ ట్రయల్స్‌లో ఇషా టాప్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ట్రయల్స్ తొలి రోజు పోటీల్లో హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ టాప్‌లో నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ట్రయల్స్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో ఇషా 585 పాయింట్లు సాధించింది. సీనియర్లు సిమ్రన్‌ప్రీత్ కౌర్ (583), మనూ భాకర్ (582) తర్వాతి రెండు స్థానాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో భవేష్ (580) టాప్‌లో నిలవగా, విజయ్‌వీర్ సిద్ధు (579), అనీష్ (578) తర్వాతి స్థానాల్లో నిలిచారు. శనివారం ఫైనల్స్ జరుగుతాయి.

అగ్రస్థానానికి గుకేష్



టొరంటో: భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అగ్రస్థానానికి చేరుకోగా, తాజా ఫలితాలతో ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ టైటిల్ రేసు నుంచి దాదాపు దూరమయ్యారు. 12వ రౌండ్‌లో నిజత్ అబసోవ్(అజర్‌బైజాన్)పై గుకేష్ సంచలన విజయం సాధించాడు. నెపోమ్నియాచి (రష్యా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, ఫాబియానో (అమెరికా) చేతిలో విదిత్ ఓడాడు. మహిళల విభాగంలో అలెగ్జాండ్రా గోరియాచ్కినా (రష్యా)తో గేమ్‌ను హంపి డ్రా చేసుకోగా, అన్నా ముజిచుక్ (ఉక్రెయిన్)పై వైశాలి గెలిచింది. మొత్తం 12 రౌండ్లు ముగిసే సరికి గుకేష్ (7.5) టాప్‌లో, నకమురా (అమెరికా-7.5) రెండో స్థానంలో ఉన్నారు. మహిళల్లో టాన్ జాంగీ (చైనా) 8 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలవగా, హంపి 6 పాయింట్లతో 4వ, వైశాలి 5.5 పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతున్నారు.

రెజ్లర్లకు నిరాశ

బిష్కెక్ (కజకిస్థాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తొలిరోజు భారత రెజ్లర్లకు నిరాశే ఎదురైంది. శుక్రవారం ఇక్కడ జరిగిన 57 కిలోల విభాగంలో అమన్ సెహ్రావత్ సెమీస్‌లో ఓడిపోగా.. స్టార్ రెజ్లర్ దీపక్ పూనియా, సుజీత్ కల్కల్ వెయింగ్‌కు ఆలస్యంగా రావడంతో వారి ఎంట్రీని తిరస్కరించారు. కాగా మహిళల విభాగం పోటీలు శనివారం జరుగుతాయి.



పేరుకు అవి ఎనిమిది నియోజకవర్గాలు. కానీ, పందెపురాయుళ్లకు ఇప్పుడు అవే కాసులు కురిపిస్తున్నాయి. కీలకమైన ఈ నియోజకవర్గాలపై భారీగా బెట్టింగులు సాగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా చర్చలోకి వచ్చాయి. అవినీతికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఈ పోరును బెట్టింగ్‌రాజులు తమకు అనుకూలంగా మార్చుకుని, విశ్లేషణ చేపట్టి మరీ రూ.కోట్లలో పందేలు కాస్తున్నారు. గుడివాడ, గన్నవరం, పెనమలూరు, విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ, మచిలీపట్నం అభ్యర్థుల గెలుపోటములపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతంగా కాగా, పందెపురాయుళ్లకు మాత్రం పైసావసూల్ నియోజకవర్గాలుగా మారాయి.

- (విజయవాడ, ఆంధ్రజ్యోతి)

కాసుకో..!



పందెపురాయుళ్లకు హాట్‌సీట్లుగా ఆ ఎనిమిది నియోజకవర్గాలు

- ఎన్టీఆర్‌లో విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ, మైలవరం
- కృష్ణాలో గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, పెనమలూరు
- గెలుపోటములు, మెజారిటీలపై రూ.కోట్లలో పందేలు
- ఎవరి విజయం ఎంత అనే అంశంపై విశ్లేషణలు

ఆ నాలుగింట.. రూ.లక్షల్లో పందేలు

పెనమలూరు నియోజకవర్గం నుంచి మంత్రి జోగి రమేశ్ పోటీ చేస్తున్నారు. చంద్రబాబు ఇంటిపై దాడి, ప్రతిపక్ష నేతను బూతులు తిట్టడం వంటి ఘటనలతో ఈయనకు మంత్రి పదవి దక్కింది. అవినీతిలోనూ రాష్ట్రవ్యాప్త గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఈయన సిటింగ్ స్థానం పెడన నియోజకవర్గం. అక్కడ చేసిన అవినీతికి గెలుపు కష్టమని వైసీపీ అధిష్ఠానం పెనమలూరుకు మార్చింది. టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ బరిలో ఉన్నారు. ఇక వైసీపీ ప్రభుత్వంలో తొలి విడత మంత్రులుగా పనిచేసిన కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాసరావు, పేర్ని నాని పోటీచేసే స్థానాలపైనా ఉత్కంఠ నెలకొంది. వీరిలో పేర్ని నాని.. ఆయన తనయుడు కిట్టును రంగంలోకి దింపారు. కాగా, వెలంపల్లి శ్రీనివాసరావు.. జోగి బాటలోనే నడుస్తున్నారు. సిటింగ్ స్థానమైన విజయవాడ పశ్చిమ నుంచి కాకుండా సెంట్రల్ నుంచి బరిలోకి దిగుతున్నారు. కొడాలి నాని గుడివాడ నుంచి పోటీలో ఉన్నారు. పేర్ని కిట్టుపై టీడీపీ నుంచి కొల్లు రవీంద్ర, వెలంపల్లిపై బొండా ఉమ, కొడాలి నానీపై వెనిగండ్ల రాము పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చేయనంత ఖర్చును వైసీపీ అభ్యర్థులు పెనమలూరు, విజయవాడ సెంట్రల్, మచిలీపట్నం, గుడివాడల్లో ఖర్చు చేస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గాలు పందెపురాయుళ్లకూ హాట్ సీట్‌గా మారాయి. ఈ నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై రూ.లక్షల్లో పందేలు జరుగుతున్నాయి.

గన్నవరం, విజయవాడ తూర్పుపై రూ.కోట్లలో..

గన్నవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు పోటీలో ఉన్నారు. ఈయనపై వైసీపీ అభ్యర్థిగా వంశీ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వెంకట్రావు వైసీపీ అభ్యర్థిగా, వంశీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లోనూ ఈ సీటుపై జోరుగా పందేలు సాగాయి. ప్రస్తుతం వంశీ వైసీపీ పంచన చేరారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించేలా మాట్లాడారు. ఈ పరిణామాలు వంశీని రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిలో పడేలా చేశాయి. ఇక విజయవాడ తూర్పు నుంచి వైసీపీ అభ్యర్థిగా దేవినేని నెహ్రూ తనయుడు అవినాష్ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో అవినాష్ గుడివాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ సమయంలోనూ గుడివాడ సీటుపై జోరుగా పందేలు నడిచాయి. ఈసారి పార్టీ మారి వైసీపీలో చేరిన అవినాష్ విజయవాడ తూర్పు నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్ పోటీకి దిగుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలపై రూ.కోట్లలో పందేలు కాస్తున్నారు.

మైలవరంపై చర్చ

మైలవరం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈయన ప్రత్యర్థిగా వైసీపీ నుంచి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని జడ్పీటీసీ సభ్యుడు సర్నాల తిరుపతిరావు పోటీ చేస్తున్నారు. అయితే, ఈ సీటును వైసీపీ పెద్దలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఇక్కడ గెలుపు ఎవరిదనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. విజయవాడ పశ్చిమలోనూ సేమ్ ఇదే సీన్. ఇక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్త సుజనా చౌదరి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తుంటే, ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ నుంచి షేక్ ఆసిఫ్ ఉన్నారు. ఈ స్థానాలపైనా ఆసక్తికర చర్చ నడుస్తోంది.

విశ్లేషించి.. బెట్టింగ్‌లు పెట్టి..

గుడివాడ నుంచి వరుసగా నాలుగు సార్లు గెలుపొందిన కొడాలి నానీకి ఈసారి ఓటమి ఖాయమని విశ్లేషకుల అంచనా. అదే జరిగితే రాజకీయాల్లోనూ, వయసులోనూ తనకన్నా చిన్నవాడైన వెనిగండ్ల రాము చేతిలో నాని ఓడినట్లవుతుంది. గన్నవరంలోనూ సేమ్ సీన్. ఇక్కడ హ్యాట్రిక్ కొట్టాలని తహతహలాడుతున్న వంశీ, చిరకాల ప్రత్యర్థిపై విజయం సాధించాలన్న కసితో వెంకట్రావు హోరాహోరీగా పోరాడుతున్నారు. విజయవాడ తూర్పులో గద్దె రామ్మోహన్ గెలిస్తే హ్యాట్రిక్ కొడతారు. అవినాష్ విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ అంశాలన్నీ పందెపురాయుళ్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో ఆయా స్థానాలపై కోట్లాది రూపాయల పందేలు నడుస్తున్నాయి. మెజారిటీపైనా జోరుగా పందేలు సాగుతున్నాయి.

కెనాల్‌రోడ్డులో కేశినేని చిన్ని ర్యాలీ (ఇన్‌సెట్‌లో) బుల్లెట్‌పై చిన్ని, బుద్దా వెంకన్న





నామినేషన్ల జాతర

రెండో రోజూ భారీగా నామినేషన్లు

- ఎన్టీఆర్ జిల్లాలో 18, కృష్ణాజిల్లాలో 8
- అట్టహాసంగా విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని నామినేషన్
- ర్యాలీలు, ప్రచారాలతో పండుగ వాతావరణం
- సీపీఎం, సీపీఐ నాయకులు సహా ఇతర పార్టీల వారు కూడా..

నామినేషన్ల జాతర రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. రెండు జిల్లాల్లో భారీగానే నామినేషన్లు పడ్డాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, ఇతర రాజకీయ పక్షాలతో పాటు స్వతంత్రులు, సోషలిస్టు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 18, కృష్ణాజిల్లాలో 8 దాఖలయ్యాయి. అభ్యర్థుల ర్యాలీలు, ప్రచారాలతో ఎన్నికల పండుగ వాతావరణం కనిపిస్తోంది.

- విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి 3 నామినేషన్లు పడగా, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 15 దాఖలయ్యాయి. టీడీపీ తరఫున అత్యధికంగా 6 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఒక ఎంపీ కాగా, 5 ఎమ్మెల్యే నామినేషన్లు. వైసీపీకి ఒకే ఒక్క అసెంబ్లీ నామినేషన్ దాఖలైంది. సీపీఎం తరఫున ఒకటి, సీపీఐ తరఫున ఒకటి దాఖలయ్యాయి.

విజయవాడ పార్లమెంట్‌కు 3

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ దాఖలు చేశారు. కేశినేని చిన్ని ఒక సెట్ నామినేషన్ వేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ)-అథవాలేకు చెందిన పేరం శివనాగేశ్వరరావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీకి చెందిన బి.శ్రీనివాసరావు

- మిగతా 8లో

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో శుక్రవారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ నామినేషన్ వేశారు. అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బోడె హేమచౌదరి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నాయకుడు వంగవీటి రాధా, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరయ్యారు. అవనిగడ్డ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా నాదెళ్ల గిరిధర్ నామినేషన్ వేశారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వడ్డాది గోవిందరావు, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా గుడివాడ బోసుబాబు నామినేషన్ వేశారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా బడుగు క్రాంతికుమార్ నామినేషన్ వేశారు. గన్నవరం, పెడన, మచిలీపట్నం, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నామినేషన్లేమీ పడలేదు.



బోడె ప్రసాద్ ర్యాలీలో పాల్గొన్న వైవీబీ, పంచుమర్తి అనురాధ, బాలశౌరి, రాధా, కొనకళ్ల



వైసీపీ నెత్తిన బండరాయి

గులకరాయి సానుభూతి అస్త్రం వైసీపీ నెత్తిన బండరాయిగా మారింది. కేవలం వడ్డెర కులాన్ని టార్గెట్‌గా చేసుకుని ఎన్నికల్లో సానుభూతి పొందాలన్న పన్నాగం చివరికి వైసీపీ మెడకే చుట్టుకుంది. ఒక కులానికి చెందిన మైనర్లయిన బాలురును అదుపులోకి తీసుకోవడం, పోలీసులు ఏ2గా చెబుతున్న వేముల దుర్గారావును ఇంతవరకు కుటుంబ సభ్యులకు చూపించకపోవడంతో వడ్డెర కులస్తులు పిడికిలి బిగించారు. ఎన్నికల ముందు మైలేజ్ కోసం తమ కులాన్ని దోషిగా చిత్రీకరించారని ఆగ్రహిస్తూ భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

గులకరాయి ఘటనలో వైసీపీపై వడ్డెర కులస్తుల ఆగ్రహం

- రాష్ట్రవ్యాప్తంగా ఏకతాటిపైకి వస్తున్న సంఘ నేతలు
- రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించే అవకాశం
- డీజీపీని, ఈసీని కలవడానికి సన్నాహాలు
- తగిన మూల్యం ఉంటుందని హెచ్చరిక

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 19 : సీఎం జగన్‌పై గులకరాయి దాడి ఘటనలో తమ కులస్తులను ఇరికించడంపై వడ్డెర కులస్తులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించనున్నారు. ముందుగా పార్టీలకు అతీతంగా వడ్డెర సంఘాల నేతలు ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు నగరంలోని నేతలతో పాటు రెండు జిల్లాల నేతలు రంగంలోకి దిగుతున్నారు. ఈ సమావేశం అనంతరం కార్యచరణ రూపొందించే అవకాశాలు ఉన్నాయి.

వేముల సతీష్‌తో ములాఖత్‌కు ఏర్పాట్లు

ఈ కేసులో ఏ1 నిందితుడిగా పేర్కొన్న వేముల సతీష్ ప్రస్తుతం 14 రోజుల రిమాండ్‌తో నగరంలోని సబ్‌జైల్లో ఉన్నాడు. కోడికత్తి కేసు న్యాయవాది అబ్దుల్ సలీం, సతీష్ తల్లిదండ్రులు శనివారం సతీష్‌తో ములాఖత్ అయ్యేందుకు సమాయత్తమయ్యారు. అయితే, సతీష్‌ను నగరంలోని సబ్‌జైలు నుంచి శుక్రవారం రాత్రే నెల్లూరులోని సబ్‌జైలుకు తరలించినట్లు తెలిసింది. దీంతో నెల్లూరు సబ్‌జైలులో కలిసేందుకు సిద్ధమవుతున్నారు. జరిగిన ఘటనపై సతీష్‌తో మాట్లాడి, అసలు విషయాన్ని అడిగి తెలుసుకుని తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

దుర్గారావును చూపించరెందుకు..?

మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్న వేముల దుర్గారావును కుటుంబ సభ్యులకు చూపించకపోవడంపై వడ్డెర సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకుని మూడు రోజులు అవుతున్నా ఇంతవరకు కోర్టుకు హాజరు పరచకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెర్చ్ వారెంట్‌లో కూడా అతని ఆచూకీ తెలియకపోవడంపై ఇటు కుటుంబ సభ్యుల్లో, అటు వడ్డెర సంఘం నేతల్లో ఆందోళన పెరిగింది.

డీజీపీ, ఈసీని కలవనున్న నేతలు

ముఖ్యమంత్రి జగన్‌పై గులకరాయి దాడి జరగటం, రెండు రోజుల వ్యవధిలోనే ఒకే కులానికి చెందిన 11 మందిని అదుపులోకి తీసుకోవడం, ఆపై ఇద్దరిని నిందితులుగా నిర్ధారించడం, ఒకరికి రిమాండ్ విధించడం, మరో వ్యక్తి ఆచూకీ చెప్పకపోవడంపై వడ్డెర సంఘం నేతలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర డీజీపీ, ఈసీని కలిసేందుకు వడ్డెర సంఘం నేతలు సిద్ధమయ్యారు. రెండు బృందాలుగా వెళ్లి డీజీపీని, ఈసీని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని సంఘం నేతలు తెలిపారు.

నిందలు మోపారు..



జగన్‌పై జరిగిన దాడి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపకుండానే ఏకపక్షంగా వడ్డెర కులస్తులపై నిందలు వేశారు. వైసీపీకి సానుభూతి కోసం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెరలను వాడుకోవడం అన్యాయం. వైసీపీ నాయకులు, పోలీసులు వడ్డెర కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారు. రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం.

- కుంచం వాసుకుమార్, వడ్డెర సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా యువజన కార్యనిర్వాహక కార్యదర్శి

కక్ష కట్టినట్టుగా..



గత ఎన్నికల్లో వేముల దుర్గారావు వైసీపీకి పనిచేశాడు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకపోడంతో టీడీపీ నాయకులతో సఖ్యతగా ఉంటున్నాడు. టీడీపీ బీసీలకు తగిన గుర్తింపు ఇస్తుందని భావించాడు. అతన్ని వెనుక వడ్డెరల బలం పెరుగుతూ వచ్చింది. ఇంతలో జగన్‌పై గులకరాయి దాడి జరగటం, దుర్గారావును అదుపులోకి తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేవలం వడ్డెరల బలం కూడగట్టుకుంటున్నాడనే కారణంతోనే కక్షకట్టి నింద మోపారు.

- వేముల బాజీ, రాష్ట్ర వడ్డెర సంఘం నగర యువజన ఉపాధ్యక్షుడు

బలహీన వర్గమనే..



రాష్ట్రంలో కూలీనాలి చేసుకుని ఏ పూటకాపూట పొట్ట పోసుకునే కుటుంబాలు వడ్డెరలవి. ఆర్థికంగా, రాజకీయంగా ఎలాంటి బలం లేని బలహీన వర్గం కావడం వల్లే మా కులస్తులపై నిందలు వేశారు. నిందలు వేసి సానుభూతి సంపాదించి ఆపై గెలవాలన్న వైసీపీ ఎత్తుగడ స్పష్టంగా తెలుస్తుంది. దీన్ని మేము కచ్చితంగా తిప్పికొడతాం.

- బండారు రాజు, రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా యువజన ప్రధాన కార్యదర్శి

బ్రహ్మాండనాయకికి బ్రహ్మోత్సవం

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చైత్రమాస వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేదీ వరకూ జరిగే ఉత్సవాలకు ఈవో కేఎస్ రామారావు అంకురార్పణ చేశారు. గంగా సమేత దుర్గామల్లేశ్వరుల ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా అలంకరించి, వెండి పల్లకీలో ఊరేగించారు.







నామినేషన్ కిక్కు

విజయవాడ పశ్చిమ వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ శుక్రవారం చేపట్టిన నామినేషన్ ర్యాలీలో మద్యం ఏరులై పారింది. ఈ ర్యాలీలో ఆయన వెంట నడిచిన యువకులు బహిరంగంగా రోడ్డుపైనే మద్యం బాటిళ్లతో కనిపించి భయభ్రాంతులకు గురిచేశారు. కొంతమంది పూటుగా మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనడం వివాదాస్పదంగా మారింది.



ఓటర్లను జాగృతం చేసే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్‌శర్మ, మదన్‌కుమార్, కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాస్వామ్యస్ఫూర్తితో ఓటేయండి

▸ ఓటర్లకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారుల పిలుపు

కృష్ణలంక, ఏప్రిల్ 19: ఓటు హక్కు ఉన్నవారంతా ప్రజాస్వామ్యస్ఫూర్తితో ఓటేయాలని ప్రజలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయపరిశీలకుడు వి.జస్టిన్, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తిరువూరు, మైలవరం ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట ఎన్నికల వ్యయ పరిశీలకుడు మదన్ కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఓటర్లను జాగృతం చేసే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. పట్టణ ప్రాంతాల ఓటర్లు మే 13న తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీసీపీలు అధిరాజ్‌సింగ్‌రాణా, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు యూపీఎస్సీ పరీక్షలు

▸ ఎన్టీఆర్ జిల్లాలో రాయనున్న 1,872 మంది

▸ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

▸ అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయండి

▸ అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశం

కృష్ణలంక, ఏప్రిల్ 19: ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈనెల 21వ తేదీన 1,872 మంది అభ్యర్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలు రాయనున్నారని, ఐదు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, లోటుపాట్లు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో వెన్యూ సూపర్‌వైజర్లు, లైజన్ కం ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్డీఏ), నావెల్ అకాడమీ(ఎన్ఏ) పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు రూటు అధికారులు, ఐదుగురు లైజన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షా పత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని, సకాలంలో అవి కేంద్రాలకు చేరుకునేలా రూటు అధికారులు చూడాలని ఆదేశించారు. పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ శాఖలు వారికి అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లైజన్ అధికారులు, పోలీసు, తపాలా, వైద్యఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్

పోస్టల్ బ్యాలెట్‌తో ఓటేద్దాం.. నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహిద్దాం

▸ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏపీ ఎన్జీవో నేత విద్యాసాగర్ పిలుపు

కృష్ణలంక, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుందామని, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించి, జిల్లా ఎన్నికల అధికారికి, జిల్లా యంత్రాంగానికి మంచి పేరు తీసుకువద్దామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు శుక్రవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సిబ్బందిగా నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఫాం-12 ఇచ్చారని, ఈ ఫాంను రిటర్నింగ్ అధికారికి నిర్దేశిత సమయంలోపు ఉద్యోగులు సమర్పించాలని ఆయన సూచించారు. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే సంఘం దృష్టికి తీసుకురావాలని, సంఘ నాయకత్వం దానిని అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్, ఫెసిలిటేషన్ సెంటర్ల కచ్చితమైన సమాచారాన్ని అధికారులు ఇవ్వాలన్నారు. గడువును మరికొన్నిరోజులు పొడిగించాలని ఆయన కోరారు. ఈసారి ఉద్యోగులకు చేతికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వరని, వాటిని మే 5, 6 తేదీల్లో రిటర్నింగ్ అధికారి నిర్దేశించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో అప్పటికప్పుడు జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వివిధ శాఖల ఉద్యోగుల ప్రతినిధులు, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, బి.వి.రమణ, ఎం.మధుసూదనరావు, ఎస్కే నజీరుద్దీన్, సీవీఆర్ ప్రసాద్, పి.శ్రీనివాసరావు, కె.శివశంకర్, కేవీ నారాయణరావు, సీహెచ్ రాధాకృష్ణ, డి.విశ్వనాథ్, మహిళా ఉద్యోగుల ప్రతినిధి కె.శివ లీల పాల్గొన్నారు.

దుర్గారావు ఎక్కడ?

▸ నెల్లూరు జైలుకు సతీష్ కుమార్

▸ ప్రస్తుతం విజయవాడ జైల్లో ఉన్న నిందితుడు

▸ దుర్గారావు ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఎదురు చూపులు

▸ పోలీస్ స్టేషన్‌లో నిందితులు లేరని అడ్వకేట్ కమిషనర్ నివేదిక

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): గులకరాయి కేసులో రెండో నిందితుడిగా ఉన్న వేముల దుర్గారావు ఎక్కడున్నాడు? పోలీసులు రహస్య ప్రదేశంలో అతడిని విచారిస్తున్నారా? దుర్గారావు నోటి నుంచి పెద్ద నేత పేరు చెప్పించాలనుకుంటున్నారా? తాజాగా ఉదయిస్తున్న ప్రశ్నలివి. ఈనెల 13న అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద సీఎం జగన్‌పై జరిగిన దాడి కేసులో వేముల సతీష్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. సతీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత వేముల దుర్గారావు ఎక్కడున్నాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. అతడి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని దుర్గారావు భార్య శాంతి రోదిస్తోంది. మరోపక్క తండ్రి మూడు రోజులుగా కానరాకపోవడంతో పిల్లలు కన్నీరు పెట్టుకుంటున్నారు. సతీష్‌ను కోర్టులో గురువారం హాజరుపర్చడంతో దుర్గారావును శుక్రవారం హాజరుపరుస్తారని భావించారు. ఇది జరగలేదు. దుర్గారావును రహస్య ప్రదేశంలో పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. శనివారం గానీ, సోమవారంగానీ దుర్గారావును కోర్టులో హాజరుపరిచే అవకాశముందని తెలుస్తోంది. రాయికేసులో పోలీసులు లింక్‌లు కలుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సతీష్‌కుమార్‌తో దుర్గారావు పేరు చెప్పించారని, ఇప్పుడు అతడితో పెద్ద నాయకుడి పేరు చెప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

నెల్లూరు జైలుకు సతీష్

సతీష్‌కుమార్‌ను నెల్లూరులోని జైలుకు తరలించబోతున్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్‌జడ్జి కోర్టు సతీష్‌కుమార్‌కు మే 2వరకు రిమాండ్ విధించి, నెల్లూరు జైలుకు తరలించాలని ఆదేశించారు. ప్రస్తుతానికి సతీష్ విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నాడు. ఇక్కడి నుంచి శుక్రవారం తరలిస్తారని ప్రచారం జరిగినా ఎస్కార్ట్ సమస్య కారణంగా తరలించలేదని సమాచారం. మైనర్ల కోసం న్యాయవాది అబ్దుల్ సలీం దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ నివేదికను అందజేసింది. సతీష్‌తో పాటు నలుగురు మైనర్లు, టీడీపీ కార్యకర్త వేముల దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. వాళ్ల ఆచూకీ తెలపాలని కోర్టులో సెర్చ్ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏర్పడిన అడ్వకేట్ కమిషనర్ అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. స్టేషన్‌లో ఎవరూ లేరని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. సతీష్‌ను కోర్టులో హాజరుపరచిన రోజే పోలీసులు మిగిలిన నిందితుల(మైనర్లు)ను ఇళ్లకు పంపేశారు. దుర్గారావును మాత్రం ఇంటికి పంపలేదు.

విజయోత్సవంలా..

▸ అట్టహాసంగా కేశినేని శివనాథ్(చిన్ని) నామినేషన్ ▸ భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

వన్‌టౌన్, ఏప్రిల్ 19 : బీజేపీ-జనసేన బలపరచిన విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం విజయోత్సవంలా.. ఉత్సాహపూరిత వాతావరణంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. తొలుత దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీగా వెళుతుండగా.. కేశినేని చిన్ని, జానకీలక్ష్మి దంపతులకు గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక వాహనంపై ర్యాలీగా బయలుదేరగా.. కేశినేని శివనాథ్ కుటుంబసభ్యులు, బుద్దా వెంకన్న, గద్దె రామ్మోహన్, ఆళ్ల గోపాలకృష్ణ, తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీజేపీ-జనసేన-టీడీపీ శ్రేణులు పార్టీ జెండాలతో ఆకర్షణీయంగా జన ప్రవాహంతో ర్యాలీ కొనసాగింది. పెద్ద ఎత్తున జనం పాల్గొనడంతో విజయం ముందే వచ్చేసిందన్న ఆనందోత్సాహాల్లో పార్టీశ్రేణులు ఉన్నారు. తొలుత బుద్దా వెంకన్న బైక్‌పై కేశినేని చిన్ని సందడి చేశారు. బందర్‌రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ సంతకం చేసి ప్రతిపాదన చేయగా నామినేషన్ పత్రాన్ని శివనాథ్ రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

ఏడు నియోజకవర్గాలు గెలిపిస్తా.. బాబుకు కానుకగా ఇస్తా

నామినేషన్ అనంతరం శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయనని, మాట నిలబెట్టేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని పార్లమెంట్ ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించి కానుకగా ఇస్తానని తెలిపారు. తనకు అండగా నిలబడిన కార్యకర్తలకు ఎప్పుడూ తోడుగా ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో, దేశంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. కుంటుపడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చంద్రబాబు నాయకత్వం కావాలని, మోదీ సహకారం ఉండాలని చెప్పారు. త్వరలో విజయవాడ పార్లమెంట్ నియోజవర్గానికి సంబంధించి స్థానిక మ్యానిఫెస్టో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, వివిధ విభాగాల నాయకులు షేక్ ఆశా, సొంగా సంజయ్ వర్మ, ఇత్తడి చార్లెస్, కరీముల్లా, చెన్నుపాటి శ్రీను, కాకు మల్లిఖార్జునయాదవ్, వెనిగండ్ల రాము, తిరువూరు టీడీపీ నాయకులు శావల దేవదత్, బీసీ నాయకురాలు నూకాలమ్మ, జనసేన సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీ, ఏడు నియోజకవర్గాలలోని బీజేపీ, జనసేన, టీడీపీ ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్‌లు, మహిళా నాయకురాళ్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బుద్దా వెంకన్న బుల్లెట్‌పై పార్టీశ్రేణుల కేరింతల మధ్య నామినేషన్ వేసేందుకు వెళుతున్న కేశినేని చిన్ని

ముందుగా గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శివనాథ్ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంజిసర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి ఆధ్వర్యంలో మహిళలు చిన్నికి హారతులు ఇచ్చి విజయ తిలకం దిద్దారు. హజరత్ సయ్యద్ షాహీ ఖాదిరి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కెనాల్‌రోడ్డులో వినాయకుడి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న బుల్లెట్ నడపగా కేశినేని శివనాథ్ కండువా గాలిలో ఊపుతూ ప్రజలకు అభివాదం చేశారు. పార్టీశ్రేణులు చిన్నికి గజమాలలతో స్వాగతం పలికారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్, పట్టాభిరామ్, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన సమన్వయకర్త అమ్మిశెట్టి వాసులు పాల్గొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం, యునైటెడ్ క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అప్పికట్ల జవహర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. నామినేషన్ దాఖలుకు ముహూర్తం దగ్గరపడటంతో విజయవాడ పాత బస్టాండ్ నుంచి జలీల్‌ఖాన్‌తో కారులో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నందిగామ అభ్యర్థిని తంగిరాల సౌమ్య శివనాథ్‌కు అభినందనలు తెలిపారు.

పెనమలూరులో బోడె ప్రసాద్..

పెనమలూరు : వచ్చే ఎన్నికల్లో పెనమలూరు అసెంబ్లీ సీటును అత్యధిక మెజారిటీతో గెలిచి అధినేత చంద్రబాబుకు కానుకగా ఇస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రెండు సెట్ల నామినేషన్ల పత్రాలను ఆయన నియోజకవర్గ కార్యాలయంలో ఆర్వో రాజుకు అందజేశారు. బోడె సతీమణి హేమ మరో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం బోడె ప్రసాద్ మాట్లాడుతూ, చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వనని స్పష్టం చేశారు. పార్టీల శ్రేణులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను బటన్ నొక్కానని పదేపదే అంటున్నాడని ప్రజలు కూడా టీడీపీ కూటమి గెలుపు కోసం బటన్ నొక్కడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు బోడెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో బందరు పార్లమెంటు అభ్యర్థి బాలశౌరి, కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, ముప్పా రాజా, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, షేక్ బుజ్జిలు ఉన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బోడె ప్రసాద్

సెంట్రల్‌లో బొండా ఉమా, సీహెచ్ బాబూరావు నామినేషన్లు

సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమా, సీపీఎం అభ్యర్థిగా సీహెచ్ బాబూరావు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు.

విజయవాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. సెంట్రల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అయిన వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు ఈ నామినేషన్ పత్రాన్ని ఆయన అందజేశారు. ఉమా వెంట ఆయన కుమారుడు సిద్ధార్థ ఉన్నారు.

ర్యాలీగా వెళ్లి..

వన్‌టౌన్: సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా ఇండియా కూటమి బలపరచిన చిగురుపాటి బాబూరావు అట్టహాసంగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పైపుల రోడ్డు నుంచి రెడ్ ఫ్లాగ్‌లు ధరించిన వలంటీర్లు సీపీఎం శ్రేణులతో కలిసి ధర్నాచౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఎంబీ భవన్‌కు వెళ్లి అక్కడి నుంచి వీఎంసీ కార్యాలయం లోని సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు వెళ్లి అక్కడ నామినేషన్ వేశారు. ర్యాలీలో సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు పరమేశ్వరరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రైతు సంఘాల సమాఖ్య కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, గురునాథం, నరసింహారావు పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేసిన బాబూ రావును చట్టసభలకు పంపిస్తే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.



ఆర్వో స్వప్నిల్ దినకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బొండా ఉమా



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న సీహెచ్ బాబూరావు, పి.మధు, నరహరశెట్టి నరసింహారావు



వసంత కృష్ణప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న మంత్రి జోగి రమేశ్ బంధువులు

టీడీపీలోకి జోగి రమేశ్ బంధువులు

ఇబ్రహీంపట్నంలో జోగి ఇంటి ముందే చేరికలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19: ఇబ్రహీంపట్నంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. మంత్రి జోగి రమేశ్ బంధువులు ఆయన ఇంటి ముందే సభాస్థలి ఏర్పాటుచేసి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. జోగి బంధువులు జోగి స్వామి, శ్రీను, జోగి బావమ్మర్దులు పామర్తి దుర్గాప్రసాద్, పామర్తి దుర్గారావు, పామర్తి వెంకటేశ్వరరావు, కిషోర్, వేములకొండ కోటేశ్వరరావు, రమేష్, కృష్ణ, పుట్టం ప్రభాకరావు, ఏ-1 రెసిడెన్సీకి చెందిన మహిళలు, అపార్ట్‌మెంట్‌వాసులు, మరో 45మందికి కండువాలు కప్పి టీడీపీలోకి వసంత ఆహ్వానించారు.

జోగి సోదరుడి పెత్తనం భరించలేకేనా?

జోగి రమేశ్ బంధువులు వైసీపీని వీడటం చర్చకు దారితీసింది. జోగి రమేశ్ తమ్ముడు జోగి రాము పెత్తనం భరించలేక..లేక మంత్రి హోదా ఉన్నా అయినవాళ్లకు కూడా ఏం చేయకపోవడంతో ఆయన బంధువులు పార్టీని వీడుతున్నారని పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. పెనమలూరులో ఉంటూ మైలవరం రాజకీయాల్లో పదేపదే వేలుపెట్టే మంత్రి జోగి.. సొంత బంధువులను ఆయన సామాజికవర్గాన్ని వైసీపీని వీడకుండా చూడలేకపోయాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎంత కసి లేకుంటే ఏకంగా జోగి ఇంటి ముందే వేదిక ఏర్పాటు చేసి ఆయన బావమరుదులు వైసీపీకి గుడ్‌బాయ్ చెప్పి ఉంటారని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పని చేయించుకునేందుకు వెళితే ఆయినోళ్లు, బయటివాళ్లు అని ఉండదని ఎంతో కొంత ముట్టచెప్పాలని బేరాలు పెడుతుంటాడని అందుకు ఆయన సామాజికవర్గం వారైనా, సొంత వారైనా మినహాయింపు లేదనేది నగ్న సత్యమని పలువురు అంటున్నారు. అన్న అండతో స్థానికంగా తమ్ముడు జోగి రాము ప్రతి విషయంలోనూ పెత్తనం చేయడం పరిపాటిగా మారిందని, పార్టీలో ఆయన పెత్తనం భరించలేక వైసీపీలో చాలా మంది ఇప్పటికే వసంత పంచన చేరారని ప్రచారం జరుగుతోంది. ఎన్టీటీపీఎస్ బూడిద చెరువులో లారీలు పెట్టే విషయంలో రాము పెత్తనం అధికంగానే ఉంటుందని తెలుస్తోంది.

నామినేషన్ల జాతర

(ఏడో పేజీ తరువాయి)

రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు 15

విజయవాడ పశ్చిమ నుంచి వైసీపీకి చెందిన షేక్ ఆసిఫ్ నామినేషన్ వేశారు. సీపీఐ తరపున జి.కోటేశ్వరరావు, ఎంసీపీఐ (యూ) తరపున ఖదీర్ భాషా షేక్, స్వతంత్ర అభ్యర్థిగా రత్నావత్ కిషోర్ నామినేషన్ వేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తరపున బొండా ఉమామహేశ్వరరావు నామినేషన్ వేశారు. సీపీఎం (మార్క్సిస్టు) తరపున చిగురుపాటి బాబూరావు, స్వతంత్ర అభ్యర్థిగా బొప్పన గాంధీ, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె.శివశంకర్ నామినేషన్లు వేశారు. విజయవాడ తూర్పులో మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్ తరపున ఆయన సతీమణి అనూరాధ, గద్దె కుమారుడు క్రాంతికుమార్ కూడా నామినేషన్లు వేశారు. మైలవరం అసెంబ్లీకి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా వేములపల్లి పృథ్వీ, వేల్పూరి కనకదుర్గాదేవి ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా కర్నాటి అప్పారావు నామినేషన్ వేశారు. నందిగామ, తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్లు పడలేదు.



వెదురుబీడెంలో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

బీసీలకు నిధులు, విధుల్లేని పదవులు!

▸ ఆత్మీయ సమావేశాల్లో వసంత కృష్ణప్రసాద్

మైలవరంరూరల్, ఏప్రిల్ 19 : టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు టీటీడీ ఛైర్మన్ పదవిని యాదవులకు ఇచ్చి గౌరవమిస్తే, వైసీపీ ప్రభుత్వం కుర్చీలు, బల్లల్లేని, విధుల్లేని, నిధులు లేని పనికిమాలిన కార్పొరేషన్లు పెట్టి పనికొచ్చే పదవి ఒక్కటీ ఇవ్వలేదని మైలవరం ఎన్డీయే కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెదురుబీడెం, చంద్రాల, గణపవరం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కూటమి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ అంటే బీసీలని అన్నారు. దశల వారీగా మద్యనిషేధం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఒక చేత్తో పేదలకు తాయిలాలు ఇచ్చి రెండో చేత్తో వారి బలహీనతతో డబ్బులు వెనక్కి లాక్కొంటున్నారని విమర్శించారు. ఉద్యోగాలకు జీతాలు, పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవన్నారు. రోజువారి వ్యవహారాలు నడపటానికి డబ్బులేదని, కేంద్రం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం లాక్కుందన్నారు. చదువుకున్న బిడ్డకు ఉద్యోగం వస్తే ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ఒక్కనెలలోనే కుటుంబానికి అందుతాయన్నారు. అభివృద్ధిని సీఎం జగన్మోహనరెడ్డి పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. తాతా పోతురాజు, వజ్రాల కుమారరెడ్డి, చల్లా సుబ్బారావు, ఇనుగంటి శోభన్‌బాబు, విజయబాబు, సీతారామయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

గులకరాయి గాయంపై వాపోతున్నారు.. చేసిన అరాచకాలు మర్చిపోయారా?

▸ జగన్‌కు దేవినేని ఉమా ప్రశ్న

గొల్లపూడి, ఏప్రిల్ 19: "ఐదేళ్లలో వైసీపీ చేసిన ఘోరాలెన్ని? తగిలిన గాయాలెన్ని? పోయిన ప్రాణాలెన్ని? గులకరాయి గాయంపై వాపోతున్న జగన్ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి?" అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గొల్లపూడిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "నడిరోడ్డుపై నరికివేతలు జరగలేదా? దళితుడిని చంపేసి శవాన్ని డోర్ డెలివరీ చేయలేదా? ప్రజా ప్రతినిధులపై పట్టపగలే కర్రలతో దాడులు చేయలేదా? ఇళ్లపై మూకలు పడి విధ్వంసాలు చేయలేదా? అవన్నీ మరిచిపోయారా? ఇన్ని అరాచకాలు చేసింది మీరు కాదా వీటిపై ఎప్పుడైనా స్పందించారా?" అని జగన్‌ను ఆయన నిలదీశారు. "చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన వారికి మంత్రి పదవి ఇచ్చారు. టీడీపీ జాతీయ కార్యాలయంపై దాడి చేస్తే చర్యలు లేవు. అంగళ్లలో జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న చంద్రబాబుపై దాడిచేసి రివర్స్‌లో తప్పుడు కేసులు పెట్టారు. గులకరాయి డ్రామా కేసుపై పెట్టిన శ్రద్ధ మిగిలిన వాటిపై ఎందుకు పెట్టలేదు." అని జగన్‌ను ఉమా నిలదీశారు. మద్య నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న జగన్‌కు ఈ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఐదేళ్లు గడిచినా మద్య నిషేధం ఊసే లేదన్నారు. ఐదేళ్లలో లక్ష కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఆయన ఆరోపించారు.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్, ఏప్రిల్ 19: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం చైత్ర మాస వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు శుక్రవారం మంగళ వాయిద్యాలు, పండితుల వేదఘోష, వేద మంత్రాల మధ్య వైదిక కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు, అర్చక సిబ్బందితో పాటు ఈవో కేఎస్ రామారావు పాల్గొని గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. పుణ్యాహవచనం, గణపతిపూజ, అఖండ దీపస్థాపన, కలశారాధన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామికి మంగళస్నానాలు చేయించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం ధ్వజారోహణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. వెండి పల్లకిపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. మహామండపం నుంచి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కోమలా విలాస్ సెంటర్, సామరంగం చౌక్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ల మీదుగా తిరిగి కొండపైకి ఊరేగింపు చేరుకుంది. ఈవో రామారావు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా 4 బంగారు గాజులు

గుడివాడ రాజేంద్రనగర్‌కు చెందిన కె.సింధూర కుటుంబ సభ్యులు 55 గ్రాముల బరువు గల 4 బంగారు గాజులను అమ్మవారికి అలంకరణ నిమిత్తం కానుకగా ఈవో రామారావుకు అందజేశారు.



గాజులు అందిస్తున్న దాతలు

దుర్గమ్మ సేవలో ఎన్నికల వ్యయపరిశీలకుడు

కనకదుర్గమ్మను ఎన్నికల అభ్యర్థుల వ్యయపరిశీలకుడు సౌరభ్ శర్మ దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.



గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి విగ్రహాలకు మంగళస్నానాలు చేయిస్తున్న అర్చకులు

దుర్గగుడిలో మౌలిక వసతులపై ఈవో పరిశీలన

దుర్గగుడిలో క్యూలలో భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, శానిటేషన్ వసతులపై ఈఈ రమాదేవితో కలిసి ఈవో రామారావు తనిఖీలు చేశారు. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడొద్దని భక్తులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని వసతులు మెరుగుపరచాలని సూచించారు. ప్రసాదాల కౌంటర్‌లో ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్ వెరిఫికేషన్ రిజిస్టర్ నిర్వహణను ఈవో రామారావు, ఏఈవో రమేష్‌బాబులు సరిచూశారు. ధర్మపథం వేదికపై రాయన శ్రీనివాసరావు బృందంతో ఆంధ్ర నాట్య ప్రదర్శన జరిగింది. నవ్య, శ్రావణి, తిలోత్తమ, లీలాలాస్య, హేమ, అపర్ణ, లక్ష్మిచైత్ర, మీనాక్షి, పి.ఉష, జశ్రిత, మధులిక ఆంధ్ర నాట్యంలో పాల్గొన్నారు. ఆద్యంతం ఆంధ్రనాట్యం ఆకట్టుకుంది. దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం దత్తత దేవాలయం సీతానగరంలోని శ్రీమద్వీరాంజనేయ సహిత కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతితో శ్రీరామనవమి ఉత్సవాలు ముగిశాయి. ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు.

రూలర్.. అయ్యదేవర

ఉమ్మడి ఆంధ్రా తొలి సభాపతి



వెలగలాజపురం: మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి నూతనంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ తొలి శాసన సభకు అయ్యదేవర కాళేశ్వరరావు తొలి సభాపతిగా ఎన్నికయ్యారు. విజయవాడ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఆయన జన్మస్థలం నేటి ఎన్టీఆర్ జిల్లా నందిగామ. లక్ష్మయ్య, వరలక్ష్మమ్మ దంపతులకు 1981లో జన్మించాడు. 1901లో బీఏ పాసై నోబుల్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. మద్రాసు విశ్వ విద్యాలయంలో బీఎల్ పరీక్ష పాసై విజయవాడలో న్యాయవాదిగా పనిచేశారు. జమిందారీ చట్టాల్లో పరిజ్ఞానం ఉన్న ఆయన పలువురు జమిందారులకు న్యాయవాదిగా పనిచేశారు. వేదాంతం, చరిత్ర రాజకీయ నేపథం వంటి అనేక రచనలు చేశారు. విజయవాడలో రామమోహన గ్రంథాల యం ఏర్పాటుకు సాయం చేశారు. విజయవాడ పురపాలక సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు రాష్ట్రంలో మద్రాసు శాసన సభ చీఫ్ విప్‌గా పనిచేశారు.

మద్రాసు రాష్ట్రంలో..

1939లో మద్రాసు శాసన సభకు కాంగ్రెస్ పార్టీ తరుపున విజయవాడ - బందరుకు ప్రాతినిధ్యం వహించాడు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి రాజగోపాలాచారి కార్యదర్శిగా పనిచేశాడు. 1946లో విజయవాడ నుంచి గెలిచిన ఆయన ప్రకాశం పంతులు పక్షంలో ఉన్నాడు.

మార్పులకు శ్రీకారం

బ్రిటీష్ ఇండియాలో మద్రాసు రాష్ట్రంలో ఉన్నపుడే మద్యపాన నిషేధ చట్టం, సేల్స్ టాక్స్, హరిజన దేవాలయ ప్రవేశ చట్టాల రూపకల్పనలో ఆయన పాల్గొన్నాడు.

సభాపతిగా

1956 నుంచి 1962 వరకు ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభకు సభాపతిగా ఉన్నారు. 1959 డిసెంబర్ 14న శాసనసభలో తెలుగుభాషలోనే మాట్లాడాలని రూలింగ్ ఇచ్చారు. 1961 ఆగస్టు 11న సభాపతి అనుమతి లేకుండా సభలో ఎవరైనా ఎలాంటి ప్రకటనలు, ప్రసంగాలు చేయకూడదని రూలింగ్ ఇచ్చారు. 1962లో తిరిగి శాసన సభకు ఎన్నికైనా

శభాష్.. ఓటరన్నా..!



బ్రిటీష్ ప్రభుత్వ దాస్యశృంఖలాల నుంచి బంధ విముక్తులైనా, స్వరాజ్యం సాధించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నా.. నేటికీ దేశం అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. మన రాజకీయ నేతలు ఎన్నికల్లో మన ఓటును నోటుతో కొనుగోలు చేసి అభివృద్ధి అనేది మన దరిని చేరకుండా చేస్తున్నారు. ఇలాంటి దుస్థితి మార్చాలని ఎంతోమంది ఎన్నో రకాలుగా పోరాడుతున్నారు. ఆ కోవకే ఈ ఇంటి యజమాని చేరుతున్నారు. పటమటలోని వాసవీనగర్‌లో ఓ ఇంటి యజమాని వచ్చే ఎన్నికల్లో నా ఓటు కొనగలిచే ధనవంతుడు ఈ రాష్ట్రంలోనే లేడంటూ ఇంటి ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఓటర్లను చైతన్యవంతుల్ని చేస్తున్నారు.

తూర్పున

- ఈ ఎన్నికల్లో గద్దె రామ్మోహన్ గెలిస్తే హ్యాట్రిక్
- టీడీపీ అభ్యర్థిగా నాలుగోసారి బరిలోకి
- 3 ఓటముల తర్వాత విజయం కోసం అవినాష్ పోరాటం
- వైసీపీ అభ్యర్థిగా మొదటిసారి బరిలోకి

యుద్ధమే..!

కాకలు తీరిన రాజకీయ ఉద్దండులు తలపడిన గడ్డ! పార్టీలు ఏవైనా ప్రజాభిమానం చూపి, పేదల పక్షం వహించే వారిని అక్కున చేర్చుకున్న నియోజకవర్గం. విలక్షణ, విజ్ఞత కలిగిన ఓటర్లకు పెట్టింది. పేరు విజయవాడ తూర్పు నియోజకవర్గం. నాటి ఉమ్మడి విజయవాడ నియోజకవర్గం నుంచి విడివడిన తర్వాత రెండు దఫాలు విజయవాడ దక్షిణ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండి తర్వాత విజయవాడ తూర్పుగా అవతరించింది. ప్రస్తుతం పదమూడో సారి ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరగబోతున్నాయి. గత రెండు ఎన్నికల్లో భారీ విజయాలను చవిచూసి, హ్యాట్రిక్ సాధించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున గద్దె రామ్మోహన్ బరిలో నిలవగా వైసీపీ తరపున మాజీ మంత్రి దేవినేని నెహ్రూ తనయుడు దేవినేని అవినాష్ మొదటిసారిగా తూర్పు బరిలో ప్రత్యర్థిగా తలపడుతున్నారు. రాజకీయ చైతన్యం కలిగిన తూర్పు నియోజకవర్గ ఓటర్లు ఈ దఫా ఎలాంటి తీర్పు ఇవ్వబోతున్నారన్నది ఆసక్తికరం.

\- ఆంధ్రజ్యోతి, విజయవాడ






- 1962లో ఆవిర్భావం, 2009లో మారిన నియోజకవర్గ చిత్రం
- పునర్విభజన తర్వాత 'టీడీపీ'కి కంచుకోట
- 12 ఎన్నికల్లో ప్రజాపక్షం వహించే వారికే పెద్దపీట

ఈసారీ ద్విముఖ పోరే..!

తూర్పులో ఈ దఫా ద్విముఖ పోటీ నెలకొంది. వరుసగా 2 సార్లు విజయకేతనం ఎగురవేసి హ్యాట్రిక్ దిశగా అడుగులు వేస్తున్న గద్దె రామ్మోహన్ ఈ సారి తెలుగుదేశం - జనసేన- బీజేపీ కూటమి తరఫున రంగంలో నిలవగా వైఎస్ఆర్‌సీపీ తరపున మొదటి సారి దేవినేని అవినాష్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్, వామపక్షాల అభ్యర్థి రంగంలో ఉన్నప్పటికీ గత ఎన్నికల మాదిరిగానే టీడీపీ కూటమి, వైసీపీ మధ్య ద్విముఖ పోటీయే తప్ప త్రిముఖ పోటీ లేదు. గద్దె రామ్మోహన్ పోటీ చేయటం ఇది నాలుగోసారి. 2009లో ఓటమి చెందినా 2014, 2019లో గెలుపొందారు. గత ఎన్నికల్లో జనసేన కూడా రంగంలో నిలిచింది. ఆ పార్టీ తరపున పోటీ చేసిన బత్తిన రాము గణనీయంగా 30వేల పైచిలుకు ఓట్లు సాధించారు. ఈసారి టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా గద్దె రామ్మోహన్ బరిలో ఉన్నారు. దీనికి తోడు గత ఎన్నికల్లో తన ప్రత్యర్థిగా వైసీపీ తరపున పోటీ చేసిన బొప్పన భవకుమార్ ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరి గద్దెకు మద్దతు ఇస్తున్నారు. గద్దె రామ్మోహన్ తన రాజకీయ ప్రస్థానాన్ని గన్నవరం నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. 1994లో స్వతంత్రంగా పోటీ చేసి గెలుపొంది టీడీపీలో చేరారు. 1999లో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2004లో కంకిపాడు నుంచి పోటీ చేసి దేవినేని నెహ్రూపై ఓడిపోయారు. 2009లో గద్దెతో పాటు ఉద్దండుడు దేవినేని నెహ్రూ తలపడ్డారు. ప్రజారాజ్యం పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే యలమంచిలి నాగేశ్వరరావు తనయుడు యలమంచిలి రవి చాపకింద నీరులా ఇద్దరినీ ఓడించారు. ఆ తరువాత 2014, 2019 ఎన్నికల బరిలో నిలిచి విజయదుందుభి మోగించారు. ఎన్నికల్లో గెలిస్తే ఆయన హ్యాట్రిక్ సాధిస్తారు. ఇకపోతే వైసీపీ తరపున దేవినేని అవినాష్ మొదటిసారిగా ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2014లో విజయవాడ పార్లమెంట్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో టీడీపీ తరపున గుడివాడ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తర్వాత వైసీపీలో చేరారు. ఈ సారి వైసీపీ తరఫున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన బత్తిన రాము వైసీపీలో చేరారు. ఆయనతో పాటు, రవి తనకు సహకరిస్తే గెలుపు సాధించగలమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మరి ఓటర్లు ఏం తీర్పును ఇస్తారో వేచి చూడాల్సిందే.



ఏ పార్టీకి ఎన్ని విజయాలు?

విజయవాడ తూర్పు నియోజకవర్గం 1962లో ఏర్పడింది. మొత్తం 12 సార్లు జరిగిన ఎన్నికల్లో చూస్తే 1962నుంచి 2019 వరకు చూస్తే కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 7సార్లు గెలుపొందింది. 3సార్లు టీడీపీ, ఒకదఫా బీజేపీ, మరో దఫా ప్రజారాజ్యం గెలుపొందింది. ఈ నియోజకవర్గం 2సార్లు భౌగోళిక మార్పులను సంతరించుకుంది. విజయవాడ సెంట్రల్ ఒకసారి, పెనమలూరు ప్రాంతం విడివడటం రెండోసారి జరిగింది. ఈ మార్పుల తరువాత విజయవాడ తూర్పు నియోజకవర్గం మాత్రం టీడీపీ కంచుకోటగా మారింది. 2009 లో తప్పిస్తే 2014, 2019లో టీడీపీ వరుస విజయాలను చవిచూసింది.

కాకలు తీరిన నేతలు తలపడిన నియోజకవర్గం :

తూర్పు నుంచి ఎందరో కాకలు తీరిన నేతలు తలపడ్డారు. నగరానికి చెందిన తొలితరం నేత చలసాని వెంకటరత్నం పోటీ చేసి ఓటమి చెందారు. నగరానికి చెందిన దేవినేని నెహ్రూ కూడా ఓటమి చెందారు. నగరానికి చెందిన టీవీఎస్ చలపతిరావు మొదటి ఎన్నికల్లో గెలుపొందారు. టీడీపీకి వెన్నుపోటు పొడిచిన నాదెండ్ల భాస్కరరావు 1978లో ఇక్కడి నుంచి పోటీ చేయగా 1985లో వంగవీటి మోహనరంగా పోటీ చేశారు. తర్వాత ఆయన సతీమణి వంగవీటి రత్నకుమారి రెండు దఫాలు గెలిచారు.ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు ఇక్కడి నుంచే గెలుపొందారు. అడుసుమిల్లి జయప్రకాష్, వై రాజగోపాలరావు, బీఎస్ జయరాజ్, వంగవీటి రాధాకృష్ణ, ఐలాపురం వెంకయ్య, కామేశ్వరి తూర్పు నుంచి పోటీ చేశారు.

తూర్పున నెలకొన్న సమస్యలు :

నియోజకవర్గంలో అతిపెద్ద సమస్య వరద ముంపునకు 'రక్షణ గోడ'తో పరిష్కారమైనా ఇంకా చాలా సమస్యలే ఉన్నాయి. ప్రధానంగా గుణదల ప్రాంతంలో కొండ ప్రాంతాలు ఎక్కువ. అక్కడ నివశిస్తున్న వారికి మౌలిక సదుపాయాలు లేవు. మెట్లు, రోడ్లు లేకపోవటం, మంచినీటి కష్టాలు ఎదుర్కోవటం ఇబ్బందిగా మారాయి. పటమట ప్రాంతంలో ఆక్రమణలు, ఉద్యానవనాలు ఏర్పాటు కాకపోవటం వంటివి ఉన్నాయి. ఆసియాలోనే రెండో అతిపెద్ద ఆటోనగర్ ఇక్కడే ఉండటం సమస్యాత్మకంగా మారింది. జనావాసాలు చుట్టూ విస్తరించటం వల్ల ఆటోనగర్‌ను తరలించాలన్న డిమాండ్ ప్రజల నుంచి బలంగా వస్తోంది. షెడ్లకు వచ్చే వాహనాల రాకపోకలతో జాతీయ రహదారులపై నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. భవిష్యత్తులో అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. సంఘాలు కూడా ఈ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయి. ఆటోనగర్ సమస్యకు అందరి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపకపోతే ఖచ్చితంగా భవిష్యత్తులోనైనా ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించే పరిస్థితులు వస్తాయి. పటమట, కష్టలంక ప్రాంతాల్లో ఆక్రమణలు స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారాయి. దోమల సమస్యతో పాటు, డ్రెయినేజీ సమస్యలను ప్రజలు ఏకరువు పెడుతున్నారు.

విజయవాడ తూర్పున విజేతలు వీరే :

సం..	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1967	టీవీఎస్ చలపతిరావు	కాంగ్రెస్	కె.రాజగోపాలరావు	సీపీఐ	8485
1972	డి.రామారావు	కాంగ్రెస్	చలసాని వెంకటరత్నం	సీపీఐ	7335
1978	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	బి.అప్పారావు	జనతా	3114
1983	ఎ.జయప్రకాశ్	టీడీపీ	కామేశ్వరి	కాంగ్రెస్	14876
1985	వీఎం రంగారావు	కాంగ్రెస్	వై.రాజగోపాలరావు	టీడీపీ	3130
1989	వంగవీటి రత్నకుమారి	కాంగ్రెస్	ఎన్.శివరామప్రసాద్	టీడీపీ	25328
1994	వంగవీటి రత్నకుమారి	కాంగ్రెస్	బీఎస్ జయరాజ్	టీడీపీ	16205
1999	కోట శ్రీనివాసరావు	బీజేపీ	ఐలపురం వెంకయ్య	కాంగ్రెస్	6076
2004	వంగవీటి రాధాకృష్ణ	కాంగ్రెస్	ఏలేశ్వరపు నాగకనక జగన్మోహన్‌రాజు	బీజేపీ	26711
2009	యలమంచిలి రవి	పీఆర్పీ	దేవినేని రాజశేఖర్ (నెహ్రూ)	కాంగ్రెస్	190
2014	గద్దె రామ్మోహనరావు	టీడీపీ	వంగవీటి రాధాకృష్ణ	వైసీపీ	15503
2019	గద్దె రామ్మోహనరావు	టీడీపీ	బొప్పన భవకుమార్	వైసీపీ	15164

ఆక్వాకు ఏదీ ఆసరా..!

- నిబంధనల పేరుతో కొందరికే విద్యుత్ సబ్సిడీ
- విద్యుత్ బిల్లులు చెల్లించలేక సాగును వదిలేస్తున్న రైతులు

రాష్ట్రంలో అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే ఆక్వా పరిశ్రమకు ప్రభుత్వ చేయూత అందకపోవటంతో రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ. 2కే పరిమితం చేయగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా దాదాపు 98వేల ఎకరాల్లో 70వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతూ ఉండేది. 2018లో రూ.2లుగా ఉన్న ఆక్వా విద్యుత్ బిల్లులను మరోసారి ఇంకా తగ్గిస్తూ రూ.1.50 లకు యూనిట్ విద్యుత్‌ను అందించేలా జీవో తెచ్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021 వరకు ఇదే విధానాన్ని కొనసాగించినా తరువాత ఆక్వా జోన్ వ్యవస్థను తీసుకు వచ్చి కొందరికే విద్యుత్ సబ్సిడీని పరిమితం చేయటంతో చిన్న, సన్నకారు రైతులు సబ్సిడీని పొందలేని పరిస్థితి నెలకొంది.

అవనిగడ్డ: రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం నూతన మత్స్య విధానం పేరుతో తీసుకువచ్చినఆక్వా జోన్ వ్యవస్థ ఆక్వా రైతులకు అప్పటివరకు అందుతున్న విద్యుత్ సబ్సిడీని దూరం చేసింది. గతంలో ఎలాంటి భూములైనా కేటగిరి 5 కింద విద్యుత్ సబ్సిడీ ఇస్తుండగా నూతన మత్స్య విధానంతో ఏడబ్ల్యుడీ భూములు, పోరంబోకు భూములు, అనాధీన భూములు, ఎసైన్‌మెంట్ భూముల్లో తవ్విన రొయ్యల చెరువులకు విద్యుత్ సబ్సిడీ అందకుండా పోయింది. తీరప్రాంత గ్రామాలను ఆక్వా జోన్లలో చేర్చకపోవటంతో వేలాది ఎకరాల్లోని రొయ్యల, చేపల చెరువులకు సబ్సిడీ అందకుండా పోయింది. ఉదాహరణకు నాగాయలంక మండలం కమ్మనమోల రెవెన్యూ పరిధిలో దాదాపు 3,500 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుఉతుండగా నూతన మత్స్య విధానంలో ఈ రెవెన్యూ పరిధిని నాన్ ఆక్వాజోన్‌లో పెట్టటంతో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఏటిమోగ రెవెన్యూ పరిధి ఆక్వా జోన్‌లో ఉండగా అక్కడి సాగయ్యే చెరువుల్లో అత్యధిక భాగం ఏడబ్ల్యుడీ భూములు, ఎసైన్‌మెంట్ భూములు కావటంతో ఉన్న 95 విద్యుత్ మీటర్లలో కేవలం 10 మీటర్లకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ అందుతోంది. దీనికి తోడు పదెకరాలలోపని నిబంధన పెట్టారు. దీంతో మరికొంతమంది రైతులు సబ్సిడీ పొందలేకపోతున్నారు. కృష్ణా జిల్లాలో ప్రధాన ఆక్వా పోకెట్ అయిన దివి ప్రాంతంలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో మొత్తం 1635 కేటగిరి-5 కింద విద్యుత్ మీటర్లు అందగా కేవలం 797 మీటర్లకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ అందుతోంది. దీంతో చాలామంది వనామీ సాగును వదిలి వేస్తున్నారు.





నాగాయలంక మండలంలో సాగవుతున్న రొయ్యల చెరువులు

సబ్సిడీక తప్పని ట్రూ అప్ చార్జీలు

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 98వేల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతుండగా మొత్తం 8031 విద్యుత్ మీటర్లు కేటగిరి-5 కింద నమోదయ్యాయి. వీటిలో కేవలం 4500 విద్యుత్ మీటర్లకు మాత్రమే సబ్సిడీ అందుతుండగా సబ్సిడీ అందే రైతులకు ట్రూ అప్ చార్జీలు మాత్రం తప్పటం లేదు. నాగాయలంక మండలానికి చెందిన ఓ రైతుకు రూ.50,031 కాగా అందులో సబ్సిడీ కింద రూ.13,500 మాత్రమే వచ్చాయి. పైగా ట్రూ అప్, సర్దుబాటు, ఇతర చార్జీలు కలుపుకొని మొత్తం 13,200 కట్ అవగా కేవలం రూ.300 మాత్రమేనని సబ్సిడీ అందిందని సదరు రైతు వాపోతున్నాడు. జిల్లావ్యాప్తంగా ఇదే ప్రధాన సమస్యని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అందరికీ సబ్సిడీ: కూటమి హామీ

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆక్వా పరిశ్రమకున్న స్థానాన్ని దృష్టిలో పెట్టుకుని తాము అధికారంలోకి వస్తే గతంలో మాదిరి ఆక్వా చెరువులన్నింటికీ సబ్సిడీపై విద్యుత్‌ను అందిస్తామని ఇటీవల మచిలీపట్నంలో జరిగిన బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించటమే కాక మ్యానిఫెస్టోలోనూ పొందుపరుస్తామని ప్రకటించారు. నెల్లూరు మొదలు శ్రీకాకుళం వరకు ఉన్న తీరం వెంబడి పెద్ద ఎత్తున సాగుతున్న ఆక్వా పరిశ్రమకు గతంలో అందే సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తగ్గించిందో అర్థం కావటం లేదని మత్స్య, విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆక్వా జోన్‌లో లేదని సబ్సిడీ ఎత్తివేశారు.
విశ్వనాథపల్లి భిక్షం, సంగమేశ్వరం



నాగాయలంక మండలం కమ్మనమోల రెవెన్యూ పరిధిలోని కమ్మనమోల, సంగమేశ్వరం, నాలి గ్రామాలు అనాదిగా రొయ్యల సాగుపైనే ఆధారపడ్డాయి. ఈ ప్రాంతాన్ని నాన్ ఆక్వాజోన్‌గా పెట్టటంతో నాలుగేళ్లుగా ఈ మూడు గ్రామాలకు విద్యుత్ సబ్సిడీ అందట్లేదు. ఈ ప్రాంతంలోని రైతులంతా రెండుమూడు ఎకరాల లోపు వారే. ముగ్గురు, నలుగురు కలిపి ఒక్కో మీటరు పెట్టించుకొని సాగు చేసుకుంటుంటే సబ్సిడీ ఎత్తివేయటంతో ఒక్కో మీటరు పైనా నెలకు రమారమి రూ. 15,000లకు పైగా భారం పడుతోంది.

బిల్లులు భారమై వనామీ సాగు వదిలేశా
● ముప్పరాజు శ్రీనివాసరావు, ఆక్వా రైతు, నాగాయలంక



వనామీ సాగుకు ఎక్కువ సమయం పాటు ఏరియేటర్లను ఆడించాల్సి ఉండటంతో నెలకు తాను సాగు చేసే 8 ఎకరాలకు గాను దాదాపు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. బిల్లులు భారమై రెండేళ్లుగా వనామీ సాగును వదిలేసి టైగర్ రొయ్యల సాగును మొదలు పెట్టా.ఇప్పుడు నెలకు రూ.12,000తో పనైపోతుంది. ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా మళ్లీ పాత విధానాన్ని ప్రవేశపెడితే తనలాంటి చిన్న రైతులకు ఉపయోగం ఉంటుంది.



హోమియో మందుల పంపిణీ



వన్‌టౌన్: వడదెబ్బ తగులకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో పశ్చిమలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వడదెబ్బ తగుల కుండా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎండలో తిరిగేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు కల్మాబేగం, బి.పవన్‌కుమార్, ఎం.సాంబశివరావు, జె.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.15

చిన్ని నామినేషన్‌కు

భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 19: బీజేపీ, జనసేన పార్టీ బలపర్చిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం 23వ డివిజన్ టీడీపీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో



చిన్ని నామినేషన్ కార్యక్రమానికి కృష్ణలంక నుంచి టీడీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

పాత బస్టాండ్ సెంటర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో 500 మంది కార్యకర్తలు కేశినేని చిన్నికి స్వాగతం పలికారు. గజమాలతో, పూల కిరీటం, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కృష్ణలంక: కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ కార్యక్రమానికి కృష్ణలంక నుంచి టీడీపీ నాయకులు బైక్‌లు, ఆటోల్లో వెళ్లారు. టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కొర్రా అప్పన్న, మండల మల్లేష్ యాదవ్, పోదూరి పవన్‌కుమార్, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్‌బాబు, పోతిరెడ్డి రమణ, బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు, డొక్కుసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణలంక 20వ డివిజన్ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృష్ణలంక ఎం హోటల్ నుంచి వందలాదిగా తరలివెళ్లారు. బైక్‌లపై, ఆటోల్లో కృష్ణలంక పురవీధుల్లో ర్యాలీగా తరలివెళ్లారు. టీడీపీ, జనసేన నాయకులు మోటేపల్లి చిన్నా, చింతా వెంకటేశ్వరరావు, పి.లక్ష్మి, జి.జయ, చిన్నతల్లి, వాసా పల్లపురాజు, చల్లా గణేష్ పాల్గొన్నారు.

రాణిగారితోట: రాణిగారితోట నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, తెలుగు తమ్ముళ్లు ర్యాలీగా వెళ్లారు.

చిట్టినగర్: విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ నామినేషన్‌కు పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ్ ఆధ్వర్యంలో 48వ డివిజన్ టీడీపీ తెలుగు యువత నాయకులు అంజనేయవాగు నుంచి పెద్ద సంఖ్యలో ర్యాలీకి తరలి వెళ్లారు. ర్యాలీలో సుగురుపల్లి వాసు, బాలాజీ, గౌరిరెడ్డి, కె. నాగరాజు. తమ్మిన వెంకటేష్, దినేష్, జానీ, బంకా నాని, మహేష్, సాయికృష పాల్గొన్నారు.


భవానీపురం: కేశినేని శివనాథ్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి 41వ డివిజన్ జనసేన అధ్యక్షుడు కూరాకుల సురేష్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరావు, 44వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో వందల సంఖ్యల్లో ర్యాలీగా తరలివెళ్లారు. జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ కూడా శివనాథ్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరయ్యారు.

చిన్ని విజయాన్ని కాంక్షిస్తూ పాస్టర్ల ప్రార్థనలు

గవర్నర్‌పేట: టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ ర్యాలీలో యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అప్పికట్ల జవహర్ ఆధ్వర్యంలో వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ చేరుకోగానే ఆయన విజయాన్ని కాంక్షిస్తూ బెతేస్థ ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ పాస్టర్ కాటూరి మోజేస్, జీసెస్ కాల్స్ ఆర్పీఎం చర్చి ఫాదర్స్ పాస్టర్ సతీష్, పాస్టర్ ఏసురత్నం, పాస్టర్ జాన్‌కుమార్, పాస్టర్ జక్రయ్య ప్రార్థనలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్‌డిఏ అభ్యర్థులందరూ గెలుపు అందుకోవాలని ప్రార్థించారు. అనంతరం కాటూరి మోజేష్ జపమాలను, అప్పికట్ల జవహర్ 24 గంటలు ప్రార్థనల్లో ఉంచిన ఏసుక్రీస్త ప్రతిమను శివనాథ్‌కు బహూకరించారు. ప్రార్థనలు అనంతరం కేశినేని చిన్ని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



టీడీపీలో చేరిన ముఠా కార్మికులు

విద్యాధరపురం, ఏప్రిల్ 19: భవానీపురంలోని 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్నసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం 20 మంది ముఠా కార్మికులు టీడీపీలో చేరారు. వారందరిని చిన్నసుబ్బయ్య సాదరంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం బీజేపీ-జనసేన-టీడీపీ కార్యకర్తలతో కలిసి కేశినేని చిన్ని నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు.



పాతశివాలయంలో కల్యాణ పుష్పయాగ మహోత్సవం ప్రారంభం



ఉత్సవ మూర్తులకు వధూవరులుగా అలంకరణ

వన్‌టౌన్, ఏప్రిల్ 19: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠాపన, అఖండదీప ప్రతిష్ఠాపన, సర్వదేవతాహ్వానం, ధ్వజారోహణ, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు, స్నపన కార్యక్రమం అనంతరం స్వామివారి, అమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ సుమంతశర్మ, రాచకొండ నాగరాజుశర్మ, అభిషేక పురోహితుడు కొత్తపల్లి సాయి కృష్ణశర్మల ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరు సురేష్ బాబు పర్యవేక్షించారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో ఘనంగా అచీవర్స్ డే

లబ్బీపేట, ఏప్రిల్19: సివిల్ సర్వీస్ ఎగ్జామ్‌లో రైటింగ్ పార్ట్ చాలా ముఖ్యమైనదని ప్రిలిమినరీస్ దగ్గర నుంచి మెయిన్స్ వరకు నిరంతరం శ్రమిస్తే గమ్యం చేరుకోగలుగుతారని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వి. మణి చైతన్య అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సివిల్ సర్వీస్ ఎగ్జామ్‌లో అచీవ్ అవడానికి ఎంతో కష్టపడి శ్రమించానని, 9 గంటలు చదివితేనే సివిల్స్ పాస్ అవగలమని అందుకు డిగ్రీ స్థాయి నుంచి ఇంగ్లీషు, తెలుగు న్యూస్ పేపర్, మ్యాగ్జైన్స్ పఠనం ముఖ్యమని వివరించారు. విద్యార్థులకు పట్టుదల, కృషి ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణ ఎంపికల్లో, పలు పోటీల్లో అచీవ్ అయిన విద్యార్థినులను అభినందించి వారికి సర్టిఫికెట్లు, షీల్డ్ అందజేశారు. కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వి. మణి చైతన్య

బోరుబావిలో పడిన యువకుడు

● అగ్నిమాపక సిబ్బంది సాయంతో సురక్షితంగా బయటకు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 19 : బొమ్ములూరులోని బోరుబావిలో యువకుడు పడిపోయిన ఘటన గురువారం రాత్రి జరిగింది. బొమ్ములూరుకు చెందిన కత్తుల పవన్ సబ్‌స్టేషన్ దగ్గరలోనే ఉన్న పొలంలోని 160 అడుగుల లోతుగల బోరుబావిలో పడిపో యాడు. పడిపోయిన వ్యక్తి అరుపులకు దగ్గరలోని రైతులు బావి వద్దకు వచ్చి ఎవరో పడిపోయారని పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో తాళ్లతో లాగి పవన్‌ను బయటకు తీసుకువచ్చారు. సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి వచ్చి వ్యక్తి ప్రాణాలను కాపాడిన ఫైర్ ఆఫీసర్ రామ్మోహనరావు, ఎస్సై జనార్దన్‌లను స్థానికులు అభినందించారు. అర్ధరాత్రి పూట ఆప్రదేశానికి పవన్ ఎందుకు వచ్చాడు, నూతిలో ఎందు కు దిగాల్సి వచ్చిందనే కోణంలో రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కొంత కాలంగా బోరుబావుల వద్ద విద్యుత్ తీగలు చోరీ జరుగుతుండటం, రైతుల ఫిర్యాదు మేరకు తీగల చోరీ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజుగూడెం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

రాజుగూడెం(తిరువూరు), ఏప్రిల్ 19: వావిలాల శివారు రాజుగూడెం పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ఎం.సుహాసిని శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించడంతో పాటు వైద్యశాలలో బాలింతలను పరామర్శించారు. తల్లిపాలు బిడ్డలకు పట్టవల్సిన ఆవశ్యతను వివరించారు. అనంతరం టీకాలు నిల్వఉంచిన ఫ్రిజ్‌లను పరిశీలించారు. వేసవిలో సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బాధితులకు సకాలంలో సేవలు అందించాలన్నారు. వైద్యులు వి.చలపతిరావు, శ్రావ్య, పూర్ణిమ, పీహెచ్‌ఎన్, ఎంపీహెచ్‌ఈవో, ఎంసీహెచ్‌ఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలకు అండగా ఉంటాం

ఎమ్మార్పీఎస్ రూపొందించిన కరపత్రాల ఆవిష్కరణలో గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 19 : మాదిగల సంక్షేమానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారని, గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మాదిగలకు అన్ని రంగాల్లోనూ అధిక ప్రాధాన్యతను ఇచ్చి వారి సంక్షేమానికి కృషి చేశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాష్ట్రంలో జనసేన, బీజేపీ, టీడీపీ ప్రభుత్వం, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ తూర్పు కార్యాలయంలో గద్దె రామ్మోహన్‌ను శుక్రవారం ఏపీఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు కలిశారు. టీడీపీ గెలుపునకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తయారుచేసిన కరపత్రాలను గద్దె రామ్మోహన్ చేతులమీదుగా ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గద్దెను 50వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఎంపీగా కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలిపార. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ, రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించిన చంద్రబాబు నాయకుడిని ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి, మాదిగల సంక్షేమానికి వచ్చే ఎన్నికల్లో మాదిగలంతా గద్దె రామ్మోహన్ అండగా ఉండాలన్నారు. దయాకర్, కొడవటి దయాకర్, పెరికమళ్ల డేవిడ్ రాజు, కాకర్ల శ్యామ్యేల్‌లు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గద్దె, పేరుపోగు వెంకటేశ్వరరావు

9వ డివిజన్‌లో గద్దె ఎన్నికల ప్రచారం

గద్దె రామ్మోహన్ శుక్రవారం 9వ డివిజన్ పటమటలంక రామాలయం వద్ద తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ ఒక డ్రామాల పార్టీగా మారిందని, కోడికత్తి కేసులో ఒక దళిత బిడ్డను ఐదేళ్ల జైల్లో పెట్టి జగన్‌మోహన్ రెడ్డి రాజకీయంగా లబ్ధిపొందారన్నారు. చెన్నుపాటి గాంధీ, కాంతిశ్రీ, పోతంశెట్టి నాగేశ్వరరావు, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుని బాబీ, ప్రదీప్‌లు పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో గద్దె అనురాధ ప్రచారం .. జగన్ అసమర్థ పాలనకు టిడ్కో ఇళ్లే సాక్ష్యమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఆరోపించారు. 13వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామోహ్మాన్ ,ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమ్మిల నాగరాజేశ్వరి, కుమ్మరి సాంబశివరావు, పేరేపి ఈశ్వర్, వేములపల్లి శ్రీను, ముమ్మనేని మానసలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములులో పాల్ హరిస్ జయంతి వేడుకలు

వన్‌టౌన్, ఏప్రిల్ 19: పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ అనుబంధంగా ఉన్న రోటరాక్ట్ క్లబ్‌లో శుక్రవారం రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు పాల్ హరిస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పోలియో మహమ్మారిని ఈ భూమి నుంచి తరిమికొట్టేందుకు రోటరీ చేస్తున్న సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, డాక్టర్ ఏ.రమాదేవి, రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ కె.సాకేత్, సెక్రటరీ ఉమామహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ ఆశ్రిత్, సార్జెంట్ మనోజ్, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, రోటరాక్ట్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాల్ హరిస్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సభ్యులు

నాసా ప్రాజెక్టుల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

చిట్టినగర్, ఏప్రిల్ 19: నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా), నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి బహుమతులు గెలుపొందారని చిట్టినగర్ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సునీత అన్నారు. శుక్రవారం స్కూల్ ఆవరణలో అభినందన సభ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాసా నిర్వహించిన ప్రాజెక్టులలో స్పేస్ కాలనీ అనే ప్రాజెక్టుకు తమ విద్యార్థులకు రెండో బహుమతి వచ్చిందన్నారు. ఈజీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐ రాజేష్, కో-ఆర్డినేటర్ సురేష్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, ఏప్రిల్ 19: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం సీతారామపురం సబ్ స్టేషన్ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలో శనివారం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దుర్గాఅగ్రహారం కాలువగట్టు, కొత్తవంతెన రోడ్డు, జనతా ప్రెస్ రోడ్, కాట్రగడ్డ వారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, జగడం వారి వీధి, వేమూరి వారి వీధి, ఏలూరు రోడ్డు, ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్, వీధిరాజు మేడ ఏరియా, గోపరాజు రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పశ్చిమ వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ నామినేషన్ దాఖలు

వన్‌టౌన్, ఏప్రిల్ 19 : పశ్చిమ వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పంజా సెంటర్ నుంచి భవానీపురంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శ్రీనివాస్ (నాని). ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మేయర్ భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వైసీపీ కార్పొరేటర్లు, వైసీపీ నాయకుడు పోతిన మహేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


గన్నవరం, ఏప్రిల్ 19 : క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని కళాశాల జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ అన్నారు. మండలంలోని సూరంపల్లి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) శుక్రవారం 2024 స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి కూడా 100 మీటర్లు పరుగు పందెం, జావెలిన్ త్రో, షాట్‌పుట్, టెన్నికాయిట్, క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శివ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి తేలప్రోలు రంగమ్మ తిరునాళ్ల

ఉంగుటూరు, ఏప్రిల్ 19 : తేలప్రోలులో కొలువైవున్న రంగమ్మ పేరంటాలు మహోత్సవాలు (తిరునాళ్ల) ఈ నెల 23 నుంచి 26వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వారసులైన జక్కా సోదరులు తెలిపారు. రైతుల ఇలవేల్పుగా కొలిచే రంగమ్మ పేరంటాలు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, మహిమగల తల్లిగా ప్రసిద్ధి పొందిం దన్నారు. తిరునాళ్లకు వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జక్కా చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్, రమేష్ తెలిపారు.













డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి రాధా

సంక్షేమం మాటున దోపిడీ

- ప్రతి కుటుంబానికీ సంక్షేమం లెక్కలు చెప్తున్నారు
- నీ కుటుంబానికి దోచిపెట్టిన లెక్కలూ చెప్పండి: వంగవీటి రాధా

కే గంగవరం, ఏప్రిల్ 19: జగన్ ప్రభుత్వం సంక్షేమం మాటున దోపిడీకి పాల్పడిందని వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధా అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలో శుక్రవారం రాత్రి జనసేన ఏర్పాటు చేసిన జనసేన-టీడీపీ-బీజేపీ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి ఎంత ఇచ్చారో లెక్కలు చెప్తూ పత్రాలు పంచుతున్నారు. మరి మీ కుటుంబానికి ఎంత దోచి పెట్టారో కూడా లెక్కలు చెప్తే బాగుంటుంది' అని జగన్‌ని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో జగన్ ముఖ్యమా? జనం ముఖ్యమో తెల్చుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ గెలుపు బాధ్యతను జనసైనికులు తీసుకోవాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌పై సందిగ్ధత తొలగించండి

- సీఈవో మీనాకు ఉద్యోగ సంఘాల వినతి

అమరావతి (ఆంధ్రజ్యోతి), విజయవాడ (వన్‌టౌన్), ఏప్రిల్ 19: పోస్టల్ బ్యాలెట్ జారీ ప్రక్రియలో అధికారుల మధ్య ఉన్న సందిగ్ధతను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదరరావు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఎన్నికల సిబ్బందికి మే మొదటి వారంలో ఏదో ఒక పనిదినం స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటించి, వారి ఓటు ఉన్న నియోజకవర్గాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని సీఈవోను కోరినట్లు పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఎన్నికల నిబంధనల ప్రకారం వీలైనంత త్వరగా సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ముందు రోజు మధ్యాహ్నానికి చేరేలా పంపాలని, అలాగే ఎన్నికల నిర్వహణకు సరిపడా నిధులు విడుదల చేసి, సిబ్బందిపై ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరామని వివరించారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిపై రాజకీయ పార్టీలు చేస్తున్న నిరాధారమైన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేసిన తర్వాతే చర్యలు చేపట్టాలన్నారు. బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు రెండేళ్లుగా చెల్లించాల్సిన గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. ఈసీ అంచనాల ప్రకారం దాదాపు రూ.700 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, వాటిని జిల్లా ఎన్నికల అధికారుల ద్వారా సంబంధిత నియోజకవర్గ స్థాయిలో ఆర్‌వో, ఏఆర్‌వోలకు ఎన్నికల నిర్వహణకు చేరేలా చూడాలని సీఈవో మీనాను కోరామని బొప్పరాజు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంచాలి: యూటీఎఫ్

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల గడువును 22 నుంచి 25 వరకు పొడిగించాలని యూటీఎఫ్ తరఫున మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవోని కలసి, ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

వైసీపీ అనుకూల సీఐలను బదిలీ చేయాలి

- సీఈవోకు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి, వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కొందరు పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరును టీడీపీ నేత వర్ల రామయ్య శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనా దృష్టికి తీసుకెళ్లారు. ప్రకాశం జిల్లా సీఐ లక్ష్మణ్ వైసీపీ పాటలకు డ్యాన్సులు వేస్తున్నాడని, ఎమ్మెల్యే కొడుకుకు కూడా సెల్యూట్ చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఒంగోలు సీఐ భక్తవత్సలరెడ్డిపై కూడా ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డికి అనుకూలమైన సీఐ గంగిరెడ్డిని బదిలీ చేయాలని కోరారు. వీరు ఎన్నికల విధుల్లోనే ఉండటానికి వీల్లేదన్నారు. నగరి నియోజకవర్గంలో మంత్రి రోజాకు అనుకూలంగా ఇద్దరు రైల్వే ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పొన్నూరులో టీడీపీ అభ్యర్థి నరేంద్రకు వ్యతిరేకంగా సాక్షిలో రాసిన కథనాన్ని పెయిడ్ ఆర్టికల్‌గా పరిగణించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో లోపాలు సరిజేయాలన్నారు. విజయవాడలో సీఎంపై రాయి దాడి కేసులో నిందితుడు సతీశ్‌కు వర్తించకపోయినా 307 సెక్షన్ పెట్టారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. కొత్తగా ఓటు హక్కు పొందిన విట్, ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు ఓటు వేసేందుకు మే 13న నిర్వహించే పరీక్షలను వాయిదా వేయాలని కోరినట్లు తెలిపారు.

సీఎం వ్యాఖ్యలపై జనసేన ఫిర్యాదు

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై భీమవరంలో సీఎం జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆపార్టీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పవన్ వ్యక్తిగత జీవితం గురించి జగన్ మాట్లాడారని ఫిర్యాదు చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మారెడ్డి శివశంకర్ కలిసి, జగన్ వ్యాఖ్యలు ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


అభ్యర్థుల కేసుల వివరాలు ఇవ్వట్లేదేం?

- రాష్ట్ర పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు
- కోర్టును ఆశ్రయించే పరిస్థితి ఎందుకు కల్పిస్తున్నారని నిలదీత
- నాదెండ్ల కేసుల వివరాలు నేటిలోగా ఇస్తామన్న హోంశాఖ

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కేసుల వివరాలు ఇవ్వకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కోర్టును ఆశ్రయించే పరిస్థితులు ఎందుకు కల్పిస్తున్నారని రాష్ట్ర పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్లలో తనపై నమోదైన కేసుల వివరాలు అందజేసేలా హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీలను ఆదేశించాలని కోరుతూ జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. పిటిషనర్‌కు శనివారం లోగా కేసుల వివరాలు అందజేస్తామని హోంశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి కోర్టుకు తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

రూ.8.73 కోట్ల బంగారం, వెండి సీజ్

ధవళేశ్వరం, ఏప్రిల్ 19: తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజ్ చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి ఫ్లైయింగ్ స్క్వాడ్, పోలీసులు మినీ కంటైనర్‌ను తనిఖీ చేసి రూ.8.15కోట్ల విలువైన 1.764కేజీల బంగారు ఆభరణాలు, రూ.58.72లక్షలు విలువైన 71.473 కేజీల వెండి ఆభరణాలను గుర్తించారు. దీనిపై ధవళేశ్వరం సీఐ జి.వినయ్‌మోహన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కేవీఎస్ అప్పారావు, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ గోపాలరావు బృందం, ఐటీ, జీఎస్టీ అధికారులు హుటాహుటిన చెక్‌పోస్టు వద్దకు చేరుకుని కంటైనర్‌లోని వెండి, బంగారు ఆభరణాలు సీజ్‌చేసి జిల్లా ట్రెజరీలో భద్రపరిచారు. డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ విచారణ అనంతరం అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. పట్టుకున్న సొత్తు ప్రైవేటు జ్యూయలరీ షాపులకు చెందినదిగా తెలిసింది.



కంటైనర్‌లోని ఆభరణాలను పరిశీలిస్తున్న అధికారులు

సీఎంవోలో సర్వాంతర్యామి

(మొదటి పేజీ తరువాయి)



మాటే శాసనం. అందరూ పాటించాల్సిందే. ఆయన చెబితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయినా చేయాల్సిందే. ఇక ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు అయితే జీ హుజూర్ అనాల్సిందే. ఎవరిమీద కేసులు పెట్టాలన్నా, ఎత్తివేయాలన్నా ఆయన చలువే. ఎన్నికల వేళ కూడా ఆయన దబాయింపు సెక్షన్ నడుస్తోంది. తాజాగా ఆయన లీలలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. గత ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పేషీలో పనిచేస్తున్న సతీష్‌చంద్ర రాజకీయ నాయకులతో ఫోన్‌లో మాట్లాడుతున్నారని, ఆయన్ను పేషీ నుంచి తప్పించాలని జగన్ అండ్ కో ఢిల్లీకి వెళ్లి మరీ గగ్గోలు పెట్టారు. ఇప్పుడు ధనుంజయ్‌రెడ్డి అంతకు వెయ్యిరెట్లు కథ నడుపుతున్నారు.

సీఎంవోలో నలుగురున్నా..

ముఖ్యమంత్రి కార్యాలయంలో నలుగురు ఐఏఎస్‌లు పనిచేస్తున్నారు. పూనమ్ మాలకొండయ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నారు. ధనుంజయ్‌రెడ్డి, ముత్యాలరాజు కార్యదర్శి హోదాలో పనిచేస్తున్నారు. భరత్‌గుప్తా అదనపు కార్యదర్శిగా ఉన్నారు. సీఎంవో సెక్రటరీ అలాట్‌మెంట్ ఆర్డర్ ప్రకారం ప్రతీ కార్యదర్శికి కొన్ని కీలకమైన సబ్జెక్టులు కేటాయించారు. ముత్యాలరాజు ప్రజాప్రతినిధుల విన్నపాలు, రెవెన్యూ (భూములు, రిజిస్ట్రేషన్), విపత్తు విభాగం చూస్తున్నారు. ఆ శాఖలకు సంబంధించి ముఖ్యమంత్రికి వచ్చే విన్నపాలు ఆయనే పరిశీలిస్తుంటారు. ఆయా శాఖలకు సీఎం ఇచ్చే ఆదేశాలు, ఫైళ్లు ముత్యాలరాజు ద్వారానే వెళ్తాయి. అలాగే, ఆయా శాఖలు సీఎం ఆమోదం కోసం పంపించే ఫైళ్లు ఆయన ద్వారానే వెళ్తాయి. ఇదే అలాట్‌మెంట్ ఆర్డర్ సారాంశం. జగన్‌కు, ఆయన ఆత్మగా ఉన్న ధనుంజయ్‌రెడ్డికి ఇవేవీ పట్టవు. రెవెన్యూలో వేలుపెడుతుంటారు.

ఎన్నికల కోడ్ వచ్చినా...

ధనుంజయ్ రెడ్డి జగన్ ఆత్మ కావడంతో ఆయన తమ పనులు చేస్తున్నా ఇతర కార్యదర్శులు మిన్నకుండిపోతున్నారు. ఏదైనా తేడా జరిగితే 'నాకు సంబంధం లేదు' అని సైలెంట్ అవుతున్నారు. ధనుంజయ్‌రెడ్డి కోరినా సంబంధిత ఫైళ్లు పంపించడానికి వీల్లేదని సీఎస్, స్పెషల్ సీఎస్‌లు, కార్యదర్శులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన ఏది చెబితే అది చేయాల్సిందే. 'ఫైలు మీకెలా పంపిస్తాం' అని ఎవరూ ప్రశ్నించలేరు. ఒకవేళ ప్రశ్నిస్తే తమ పోస్టు ఉండదన్న భయంతో సీనియర్ అధికారులు సైతం ఆయనకు ఎదురు వెళ్లేందుకు జంకుతారు. తన కార్యాలయంలోని అధికారులు ఎవరి పని వారు చేస్తున్నారా? లేదా ఇతరుల పనుల్లో తలదూరుస్తున్నారా? అని సీఎం జగన్ తెలుసుకోరు. అంతా తన ఆత్మ ధనుంజయ్ చూసుకుంటున్నారన్నది ఆయన ధీమా. ఎన్నికల కోడ్ రావడానికి ముందు ఇలాంటివి జరగొచ్చు. కానీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ధనుంజయ్‌రెడ్డి తీరు మారలేదు.

కీలక విషయాల్లో జోక్యం

సీఎంవోలో ముత్యాలరాజు చేయాల్సిన పనిని కూడా ధనుంజయ్‌రెడ్డి చేస్తున్నారు. అన్ని పనులు కాకున్నా.. అత్యంత కీలకమైన కొన్ని విషయాల్లో సర్వం తానై కథ నడుపుతున్నారు. డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వే అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌లు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌లపై నమోదైన ఏసీబీ, విజిలెన్స్ కేసుల వ్యవహారాల్లో ధనుంజయ్‌రెడ్డి వేలు పెట్టారు. ప్రజాప్రతినిధుల నుంచి ముఖ్యమంత్రికి విన్నపాలు వచ్చాయని, సంబంధిత ఫైళ్లు పంపించాలంటూ లేఖలు రాశారు. ఇక తెరవెనుక.. సంబంధిత ఫైళ్లు నేరుగా ధనుంజయ్‌రెడ్డి ఈ-ఆఫీసు లాగిన్‌కే పంపించాలంటూ ఆయా శాఖల ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు వెళ్తున్నాయి. బ్యాక్ ఎండ్‌లో ఆయన పేషీలోని అధికారి నుంచి సందేశాలు వెళ్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ ఒకవేళ ఫలానా ఫైలు తెప్పించాలని చెప్పినా.. సంబంధిత సబ్జెక్టు చూసే కార్యదర్శికి ధనుంజయ్‌రెడ్డి సమాచారం ఇచ్చి పనయ్యేలా చూడాలి. అంతేకానీ.. అన్ని విషయాల్లో ఆయనే తలదూర్చి ఫైలు పంపించాలని ఆయా ప్రభుత్వ శాఖలకు లేఖలు రాయాలని కాదు. కానీ ధనుంజయ్‌రెడ్డి అదే పని పదేపదే చేస్తున్నారు. ఇందులో ఆయనకున్న వ్యక్తిగత శ్రద్ధ ఏమిటి? ఇతర కార్యదర్శులను పని చేయనివ్వకుండా తనే అల్లుకుపోవడం వెనుక ఉన్న మర్మం ఏమిటి? సహజంగా తలెత్తుతున్న ప్రశ్నలివి.

నెత్తిన రూపాయి పెడితే ఐదు పైసలకు చెల్లదు

- ఎస్టీ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై మాజీ ఎంపీ మేకపాటి దురుసు వ్యాఖ్య
- పదేపదే ఆమె కులం ప్రస్తావన



మర్రిపాడు, ఏప్రిల్ 19 : నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో వైసీపీని వీడి టీడీపీలోకి భారీగా నేతలు చేరుతున్నారు. వారిని ఉద్దేశించి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి శ్రుతిమించి, అవమానకరంగా మాట్లాడారు. రెండురోజుల క్రితం ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరపు వెంకటరమణమ్మ వైసీపీని వీడి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమెను ఉద్దేశించి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.... పదేపదే ఆమె కులం పేరు ఉచ్చరించారు. "వలంటీర్‌గా ఉన్న ఎస్టీల అమ్మాయిని దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ చేశారు. ఆ అమ్మాయి పార్టీ మారినంత మాత్రాన ఒరిగిందేముంది? నెత్తిన రూపాయి పెడితే ఐదుపైసలకు కూడా అమ్ముడుపోదు" అంటూ దురుసుగా వ్యాఖ్యానించారు.

మేం మాట్లాడుతుంటే వైసీపీకి దడదడ

(మొదటి పేజీ తరువాయి)

పులివెందులలో తన ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య కేసుపై తెలంగాణలోని నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణ నడుస్తోందని.. అయితే దానిపై బయట మాట్లాడకూడదని ఇక్కడి కడప కోర్టు ఆర్డర్ ఇచ్చిందని అన్నారు. 'జగన్, అవినాశ్‌లపై ఫలానావారు మాట్లాడొద్దు.. ఇప్పటికే సోషల్ మీడియాలో ఉంటే వాటిని తొలగించేలా ఆదేశాలివ్వాలని వైసీపీ వారు పిటిషన్ వేశారు. వారు అడిగింది ఒకటి, కోర్టు ఆర్డర్ ఇచ్చింది మరొకటి. దీనిపై లాయర్లతో చర్చించి హైకోర్టుకు వెళ్లాలో, సుప్రీంకోర్టుకు వెళ్లాలో నిర్ణయించుకుంటాం. పై కోర్టులో ఈ ఆర్డర్ తప్పకుండా వీగిపోతుందని, మాకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది' అని తెలిపారు. వివేకా హత్య కేసు ఐదేళ్లుగా ప్రజల్లో ఉందని.. ఇప్పుడా విషయం మాట్లాడకూడదని అనడం ఎలా సమంజసం అవుతుందో చెప్పాలని అన్నారు. ఇటువంటి ఉత్తర్వులు తీసుకొచ్చి తనను బెదిరించాలని చూస్తున్నారని.. భయపడేది లేదని స్పష్టం చేశారు. పులివెందుల ప్రజలు, కడప ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రజల అండతో పోరాడతామన్నారు. 'రాష్ట్రంలో మళ్లీ తమదే ప్రభుత్వమని వైసీపీ భావిస్తోంది. ఈ తరుణంలో అక్కాచెల్లెళ్లు రంగంలోకి దిగి సీన్ మార్చేస్తున్నారని ఆ పార్టీ నేతల గుండెల్లో దడ పుడుతోంది. మేం మాట్లాడుతున్న మాటలకు, ప్రజలకు వివరిస్తున్న విషయాలకు వారి గుండె దడదడా కొట్టుకుంటోంది. వివేకా హత్య కేసును సీబీఐ విచారణ చేసింది. చార్జిషీటు కూడా ఫైల్ చేసింది. ఇది పబ్లిక్ డొమైన్‌లో ఉంది. గత ఐదేళ్లలో దీని గురించి చాలా మంది మాట్లాడారు. ఎవరైతే కేసు పెట్టారో వారు, వారి మద్దతుదారులు కూడా చాలా రకాలుగా మాట్లాడారు. నిందలు వేశారు. ఐదేళ్లుగా ఎక్కువ మాట్లాడకూడదని నేను చాలా ప్రయత్నించాను. గత కొద్దికాలంగానే మాట్లాడుతూ వస్తున్నా. నేను మాట్లాడడం మొదలుపెట్టగానే వాళ్లు భయపడ్డారు. మేం ఇలాగే మాట్లాడుతూ పోతే ఎలక్షన్‌లో కచ్చితంగా ఓడిపోతామని భయపడి కోర్టుకు వెళ్లినట్లుగా అనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు.

అడిగింది వివేకా కేసులో.. ఉత్తర్వులేమో అన్ని కేసుల్లో!

- కడప జిల్లా కోర్టు ఆదేశాలపై విపక్షాలు, న్యాయవాద వర్గాల విస్మయం

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ప్రతిపక్షాలు, న్యాయవాద వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. పిటిషనర్లు కేవలం వివేక హత్య కేసు గురించి మాత్రమే మాట్లాడకుండా ఆదేశాలివ్వాలని కోరితే జిల్లా కోర్టు ఏకంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించీ మాట్లాడరాదని మధ్యంతర ఉత్తర్వులివ్వడం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రతిపక్షాలు తమ సొంత పార్టీ ఎజెండాపై దృష్టి సారించాలని.. ఇతర పార్టీల వైఫల్యాల పై మాట్లాడాలంటూ జిల్లా కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొనడాన్ని తప్పుబడుతున్నాయి. పిటిషనర్లు కోరినదానికి మించి కోర్టు ఉత్తర్వులిచ్చిందన్న అభిప్రాయం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్రను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని, ఆ వివరాలను ప్రజలకు తెలిసేలా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో ప్రచారం చేయాలని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని, అందుకు భిన్నంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి కోర్టు పరిధిలో ఉన్న కేసుల గురించి మాట్లాడవద్దని ఆదేశాలివ్వడం సరికాదని అంటున్నాయి. పిటిషనర్ సురేశ్‌బాబుకు వ్యాజ్యం దాఖలు చేసే అర్హతే లేదని, జిల్లా వైసీపీ అధ్యక్షుడి హోదాలో ఆయన వేసిన పిటిషన్‌పై ఇలాంటి విస్తృత ఆదేశాలివ్వడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. వివేకా హత్య కేసుకు సంబంధించి గత ఐదేళ్లుగా దర్యాప్తు సాగుతోంది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు చేరింది. కేసు దర్యాప్తు సక్రమంగా సాగడం లేదని, దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారనే కారణంతో కేసు విచారణను ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి మారుస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని ప్రతిపక్షాలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికే సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అప్రూవర్‌గా మారి మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. చార్జిషీటు, వాంగ్మూలంలో ఇచ్చిన సమాచారం, ప్రజాబాహుళ్యంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న వివరాలనే రాజకీయ పార్టీలు ప్రస్తావిస్తున్నాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం మార్గదర్శకాలు ఇచ్చింది. అభ్యర్థి పూర్తి వివరాలు తెలిసి ఉన్నప్పుడే ఓటరు సరైన నిర్ణయాన్ని తీసుకోగలుగుతారని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు.. తమ ప్రత్యర్థుల పూర్వచరిత్ర, నేర చరిత్ర గురించి ఓటర్లకు వివరించడం సర్వసాధారణమని రాజకీయపార్టీలు చెబుతున్నాయి. అయితే కడప జిల్లా కోర్టు.. కోర్టుల పరిధిలో ఉన్న కేసుల గురించి ప్రస్తావించవద్దని ఆదేశాలివ్వడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని అంటున్నాయి. ఈ నేపథ్యంలో కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టులో సవాల్ చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.



కోడికత్తి డ్రామాలానే గులకరాయి డ్రామా!

- రాయి దాడి ఘటనపై టీడీపీ, వడ్డెర సంఘ నేతల సమావేశం

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నాడు ఆడిన కోడికత్తి డ్రామాలాగే.. నేడు గులకరాయి నాటకానికి తెరలేపి వేముల సతీష్, వేముల దుర్గారావులను అక్రమ కేసులో ఇరికించారని రాష్ట్ర టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో వడ్డెర సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ జగన్‌పై జరిగిన గులకరాయి డ్రామాలో.. అక్రమ అరెస్టులతో ఆ బిడ్డల తల్లిదండ్రులు విలపిస్తున్నారన్నారు. బీసీ బిడ్డలపై వెల్లంపల్లి పెట్టిన కేసు వడ్డెరలను అవమానించడమేనని మండిపడ్డారు. ఏదో జరిగిపోయినట్లు పోలీసులు పరుగులు పెట్టించి సతీష్‌ను తీసుకెళ్లడం పెద్ద డ్రామా లాగా ఉందన్నారు. చీకట్లో వచ్చిన గులకరాయి అది ముఖ్యమంత్రి జగన్‌కు తగిలి అక్కడి నుంచి వెల్లంపల్లికి తగిలి గాల్లో ఎగిరిపోవడం కోడికత్తి డ్రామా 2 లా ఉందని, పోలీసులు రక్తికట్టిస్తున్న ఈ డ్రామాను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. పోలీసులు ఐదేళ్లుగా బీసీలు, దళితులపై ఎన్నో కేసులు పెట్టారని, తనలాంటి వారిని కూడా రాజమండ్రి జైలుకు పంపించారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల శవాల పునాదుల మీద జగన్ వ్యాపారం చేస్తున్నారని, వారిని అడ్డు పెట్టుకుని జగన్ అధికారం కోసం వారిని ఖూనీకోరులని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను అవమానిస్తున్న జగన్‌కు గుణపాఠం చెబుతామన్నారు. రెక్కాడితే డొక్కాడని, చేతివృత్తులపై ఆధారపడే శ్రామికులు వడ్డెరులని, దుర్మార్గంగా రాయి విసిరారని వడ్డెర కులస్తుల్ని ఇరికించి, బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేయడం దారుణమని రాష్ట్ర వడ్డెర సేవాసంఘం అధ్యక్షుడు మల్లెల ఈశ్వరరావు అన్నారు. పసిబిడ్డలతో కోర్టు దగ్గర దుర్గారావు భార్య విలపిస్తుంటే తనకు దుఃఖం ఆగలేదన్నారు. వెంటనే దుర్గారావును విడిచి పెట్టాలని, లేకుంటే వడ్డెరలంతా ఏకమై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

గులకరాయి డ్రామా జగన్నాటకమే

- జగన్ మీడియా సృష్టికి పోలీసులు ఆజ్యం: వర్ల రామయ్య

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గులకరాయి డ్రామా అసలు హత్యాయత్నం కాదని, అంతా జగన్నాటకమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ మీడియా సృష్టికి పోలీసులు ఆజ్యం పోసి దాన్ని సంచలనాత్మక కేసుగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. అమాయకుడైన వడ్డెర బిడ్డను రిమాండ్‌కు పంపించారన్నారు. అప్పీలు చేసుకోవాలని అతని తల్లిదండ్రులకు సూచించామని చెప్పారు. చిన్న చిన్న కేసులు పట్టుకుంటేే ముద్దాయిలను ప్రెస్ ముందు ప్రవేశపెట్టే పోలీసులు ఇంతటి సంచలనాత్మకు కేసును ఎందుకని ప్రెస్ ముందుకు తీసుకురాలేదన్నారు.

టార్గెట్ బొండా..?

- బెజవాడలో టీడీపీ కార్యాలయం వద్ద హైడ్రామా
- గులకరాయి ఘటనలో అరెస్ట్ చేస్తారని ప్రచారం
- మొదట ఉమా ఇంటి వద్దకు వెళ్లిన పోలీసులు
- దీంతో పార్టీ కార్యాలయానికి చేరుకున్న బొండా
- అక్కడికి కూడా భారీగా వెళ్లిన పోలీసులు
- కార్యాలయం వద్దకు వచ్చిన కార్యకర్తలు.. ఉద్రిక్తత
- ఆఫీసు వెనుక నుంచి వెళ్లిపోయిన ఉమా



విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గులకరాయి దాడి ఘటనలో మలుపులు తిరుగుతున్న దర్యాప్తు ఇప్పుడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా మహేశ్వరరావు వైపు వెళ్తుందా? కేసులో ఆయనను నిందితుడిగా చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అంటే.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అందుకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. విజయవాడ మొగల్రాజపురంలోని బొండా ఉమా ఇంటి వద్ద, అజిత్‌సింగ్ నగర్‌లో పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి హైడ్రామా నడిచింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా పోలీసులు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు వచ్చిన సమాచారం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బొండా ఉమా ఇంటి వద్దకు శుక్రవారం ఉదయం ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లారు. భద్రత నిమిత్తం తమను పంపారని ఆయనకు చెప్పారు. మధ్యాహ్నానికి ఆ సంఖ్య నాలుగుకు చేరింది. దీంతో బొండా ఉమాకు అనుమానం వచ్చింది. తర్వాత కారులో ఇంటి నుంచి అజిత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కాసేపటికి టాస్క్‌ఫోర్స్ అధికారులు, లా అండ్ ఆర్డర్ అధికారులు పార్టీ కార్యాలయానికి సమీపంలో వేచి ఉన్నారు. తర్వాత పోలీసు సిబ్బంది చేరుకున్నారు. దీంతో బొండా ఉమాను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. పోలీసుల రాకను గమనించిన నేతలు అన్ని డివిజన్లలో ఉన్న కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. 20 డివిజన్లలో ఉన్న కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వెల్లంపల్లి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రాత్రి వరకు బొండా ఉమా పార్టీ కార్యాలయంలోనే ఉండి నేతలతో సమావేశమయ్యారు. జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. పార్టీ కార్యాలయం వద్ద సుమారు రెండున్నర గంటల పాటు హైడ్రామా నడిచింది. కార్యకర్తలు వెళ్లిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా వారు అక్కడి నుంచి కదల్లేదు. పోలీసులు ఏ క్షణాన అయినా లోపలకు ప్రవేశించి అరెస్టు చేస్తారన్న అనుమానంతో బొండా ఉమా అక్కడి నుంచి తప్పించుకున్నారు. పార్టీ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించి, వెనుక వైపు నుంచి వెళ్లిపోయారు. కాగా, రాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌ను పోలీసులు ఏ1గా చూపించారు. ఏ2గా టీడీపీ కార్యకర్త వేముల దుర్గారావును చూపించినట్టు లీకులు వచ్చాయి. తాజాగా జరుగుతున్న పరిణామాలతో ఏ2 ఎవరన్న ప్రశ్న తలెత్తుతోంది. కోర్టులో సతీష్‌ను ప్రవేశపెట్టినప్పుడు పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఏ2 ఎవరన్నది స్పష్టం చేయలేదు. ఏ2 ప్రేరేపించడంతో సతీష్ దాడి చేశాడని పేర్కొన్నారు. బయటకు వచ్చిన లీకుల ప్రకారం ఏ2 స్థానంలో దుర్గారావు ఉంటాడా, ప్రస్తుత పరిణామాలతో బొండా ఉమా ఉంటారా అన్న అనుమానాలు వస్తున్నాయి.

ఏపీ మంత్రి సిబ్బంది బెదిరింపులకు మహిళ బలి!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వంలోని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సిబ్బంది తీవ్ర బెదిరింపులు హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన ఓ నిరుపేద మహిళ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సత్యాల వెంకటరమణ (38)కు భార్య సూర్యకుమారి (35), కుమారుడు (14), కుమార్తె ఉన్నారు. ఈ కుటుంబం ఫిలింనగర్ దీన్‌దయాళ్ కాలనీలో ఉంటోంది. వెంకటరమణ అడ్డా కూలీ. సూర్యకుమారి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. ఈనెల 17న ఉదయం ఎప్పటిలాగే వెంకటరమణ, సూర్యకుమారి పనులకు వెళ్లారు. వీరి కుమారుడు సమీపంలోని గుడికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న స్కూటీని తీసుకొని రోడ్డు మీదకొచ్చాడు. ఫిలింనగర్ హకీంబాబా దర్గా సమీపంలో మంత్రి బుగ్గనకు చెందిన బీఎండబ్ల్యూ కారు వెళుతోంది. ఆ కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బాలుడు ద్విచక్రవాహనాన్ని అదుపు చేయలేక కారుకు తగిలించాడు. ఈ ఘటనలో కారుకు చిన్నగా గీతలు పడ్డాయి. ఆ సమయంలో కారులో మంత్రి కుటుంబసభ్యులు ఉన్నారు. వెంటనే దిగిన డ్రైవర్ చంద్రశేఖర్ బాలుడి నుంచి స్కూటీ తాళాలు లాక్కున్నాడు. ఫోన్ చేసి మహేశ్ అనే మరో డ్రైవర్‌ను అక్కడికి పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి బాలుడిని బెదిరించారు. కారు రిపేరుకు అయ్యే డబ్బు ఇస్తేనే బైక్ ఇస్తామని, లేదంటే పోలీస్ కేసు పెడతామని హెచ్చరించారు. తర్వాత స్కూటీతో పాటు బాలుడిని మంత్రి ఇంటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి బాలుడి తండ్రి వెంకటరమణకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్ తీయకపోవడంతో, ఓ కాగితంపై డ్రైవర్ మహేశ్ ఓ ఫోన్ నంబర్ రాసి, బాలుడి చేతిలో పెట్టి.. 'ఇంటికి వెళ్లి మీ నాన్నతో ఫోన్ చేయించు' అని గద్దించాడు. బాలుడు తండ్రి వద్దకు వెళ్లి డ్రైవర్ మహేశ్‌కు ఫోన్ చేయించాడు. వెంకటరమణతో ఫోన్‌లో మాట్లాడిన మహేశ్.. 'మీ అబ్బాయి బైక్‌తో కారును గుద్దాడు. రిపేరుకు రూ.20వేలు అవుతాయి. సాయంత్రం 4గంటల్లోగా ఇవ్వాలి. లేదంటే పోలీసు కేసు పెడతాం' అని హెచ్చరించారు. ఇదే విషయాన్ని వెంకటరమణ తన భార్య సూర్యకుమారికి ఫోన్ చేసి చెప్పాడు. తర్వాత.. వెంకటరమణ, వాయిదాల్లో చెల్లిస్తామని బైక్ ఇవ్వాలంటూ కోరినా మంత్రి సిబ్బంది అంగీకరించలేదు. పైగా.. 'టైమ్‌లోపు డబ్బులివ్వండి.. లేదంటే నీ కొడుకు సంగతి చూస్తాం. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని నీ మైనర్ కొడుకు జైలుకు పోతే బయటకు కూడా రాడు' అని డ్రైవర్లు బెదిరింపులకు దిగారు. దీంతో కంగారుపడిపోయిన బాలుడి తల్లిదండ్రులు.. రూ.20 వేలు సర్దడంపై తీవ్రంగా మథనపడ్డారు. కొద్దిసేపటికి వెంకటరమణకు ఓ ఇంటి సామాన్లు మార్చే పని రావడంతో సాయంగా ఉండేందుకు వెంట కుమారుడిని తీసుకెళ్లాడు. డ్యూటీ నుంచి ఇంటికొచ్చిన సూర్యకుమారి భర్తకు ఫోన్ చేసి, కొడుక్కి స్కూటీ ఎందుకిచ్చావు? రూ.20వేలు ఇప్పటికిప్పుడు ఎక్కడి నుంచొస్తాయి? అని రోదిస్తూ ప్రశ్నించింది. గడువులోపు డబ్బులు చెల్లించకపోతే ఒక్కగానొక్క కుమారుడికి ఎలాంటి ఆపద వస్తుందోనని మనస్తాపానికి గురైంది. కొద్దిసేపటికే ఇంట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కనీసం ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా కారుకు చిన్న గీతలు పడ్డాయనే కారణంతో మంత్రి సిబ్బంది తీవ్ర బెదిరింపులతో నానా యాగీ చేయడంతోనే మహిళ ప్రాణం బలైపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కారు వివరాలు గోప్యం

ఈ ఘటనకు సంబంధించి ఫిల్మ్‌నగర్ పోలీసులు ఏపీ మంత్రి డ్రైవర్లు చంద్రశేఖర్, మహేశ్‌ను అదుపులోకి తీసుకొని ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. బాలుడు నడిపిన స్కూటీని స్టేషన్‌లో ఉంచారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులు గోప్యత పాటిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కారును స్కూటీ ఢీకొన్న ఘటనకు సంబంధించి నిబంధనల ప్రకారం రెండు వాహనాలకు సంబంధించి వివరాలను ఎఫ్ఐఆర్‌లో పొందుపరాల్సి. అయితే పోలీసులు కేవలం స్కూటీ నంబరునే ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కారు నంబరు, ఆ వాహనం ఎవరి పేరు మీద ఉంది? అనే వివరాలను పేర్కొనలేదు. ఆ కారు.. ఏపీలోని కీలక మంత్రిది కావడంతోనే పోలీసులు గోప్యత పాటిస్తున్నారే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024

ప్రజా అజెండా

ఆంధ్రజ్యోతి

శనివారం ◇ 20-4-2024

జన కేతనం





కౌంట్ డౌన్ 23 రోజులు

ఎన్టీఆర్‌ను చూశా...
ఏఎన్నార్‌ను చూశా!
అమితాబ్‌ను చూశా..
కమల్‌హాసన్‌ను చూశా!
కానీ... నీలాంటి
నటుడిని మాత్రం
చూడలేదు!
ఇరగదీస్తున్నావ్!

...ఈ ఐదేళ్లలో ఈ డైలాగ్ కనీసం ఒక్కసారైనా గుర్తుకురాని వారు ఒక్కరంటే ఒక్కరూ ఉండరేమో!

అలవోకగా అబద్ధాలు... అబ్బురపరిచే డైలాగులు

ఇంతటి నటన రాజకీయాల్లో 'నభూతో'..

అధికారంలోకి వచ్చేందుకు ఎన్నెన్నో నాటకాలు

నాన్న మరణం, చిన్నాన్న హత్య.. అన్నీ అక్కరకొచ్చేవే

వైఎస్ మరణం వెనుక రిలయన్స్ ఉందని ఆరోపణ

అధికారంలోకి రాగానే రిలయన్స్ నత్వానీకి రాజ్యసభ

విశాఖలో కోడికత్తి డ్రామాతో సానుభూతి

వివేకా హత్యపై 'వివేకం' మించిన నటన

డీఎస్పీ ప్రమోషన్లపై పచ్చి బొంకులు

శషభిషలు లేకుండా జనం చెవిలో పూలు



రాజకీయ రంగమార్తాండ!

జీవించినంత సహజంగా నటించడం ...కళ!

ఏమాత్రం జంకు లేకుండా బొంకులాడటం ...మహా కళ!

అందరికీ తెలిసిన అబద్ధాన్నీ నిజమని నమ్మించేలా హావభావాలు పలికించడం ...అసాధారణ మహాకళ!

ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు! ముక్కుసూటి రాజకీయాలు చేసే వాళ్లకు అస్సలు సాధ్యం కాదు! కానీ... వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఈ కళలో ఆరితేరారని చెప్పక తప్పదు! అధికారంలోకి రావడమే ఆయన లక్ష్యం! అందుకోసం దేన్నయినా వాడుకుంటారు! నాన్న, చిన్నాన్న మరణాలూ ఆయనకు 'రాజకీయ వస్తువులే'! అబద్ధమని తెలిసీ... అదే అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెప్పడం జగన్ క్యాంపు ప్రత్యేకత! జనం చెవిలో ఎంచక్కా పూలు పెట్టడం ఒక అలవాటు! విపక్షంలో ఉండగా బురదజల్లుడు రాజకీయాలు చేసి, అబద్ధాల ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన జగన్... ఈ ఐదేళ్ల పాలనలో తన అసలు స్వరూపాన్ని తానే బయటపెట్టుకున్నారు. 'రాజకీయ రంగ మార్తాండ' అనిపించుకున్నారు! ఒకరిని ఒక్కసారి మోసం చేయవచ్చు! కానీ... అందరినీ అన్నిసార్లూ మోసం చేయలేరు!

- అమరావతి, ఆంధ్రజ్యోతి

అబ్బ ఛా... అనిపించే స్థాయిలో జగన్నాటకం

సైకలాజికల్ ప్రొజెక్షన్!

ఈ దేశంలోనే అత్యంత ధనికుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. ఇక.. 'సాక్షి' పేరుతో ఒక రోత మీడియానూ నడుపుతున్నారు. జగన్‌కు మద్దతుగా ఉండే కూలి, నీలి మీడియాకు కొదవే లేదు. అయినా సరే... 'నాకు అంగబలం లేదు, అర్థబలం లేదు. నాకు మీడియా లేదు. నేను పేద వాడిని.. ఒంటరి వాడిని'.. అని చెప్పుకోవడం సామాన్యుల వల్ల అయ్యే పని కాదు! ఐదేళ్లపాటు జగన్ సామాన్య జనాన్ని ఎవరినీ దగ్గరికి రానీయలేదు. నేతలు, ప్రజా ప్రతినిధులనూ దూరంగానే ఉంచారు. 'తన' వారికి మాత్రమే లోపలికి ఎంట్రీ. ఇతర వర్గాల నేతలు గడపకు అవతల నిలబడాల్సిందే. అయినా సరే... విపక్ష నేతలను 'పెత్తందార్లు'గా అభివర్ణించడం ఆయనకే చెల్లింది. ఇలా తన లక్షణాలను ఇతరులకు ఆపాదించడాన్ని 'సైకలాజికల్ ప్రొజెక్షన్' అంటారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. మాటి మాటికీ 'మీ బిడ్డ' అంటూ సెంటిమెంటు పండించడం... 'దేవుడినే నమ్ముకున్నా' అంటూనే చేయాల్సిన అరాచకాలన్నీ చేయడం జగన్‌కే చెల్లింది. తలపై ఎడమ చేయి వేయడం, నుదిటిపై ముద్దులు పెట్టడం, అరచేత్తో బుగ్గలు నిమరడం... ఇవన్నీ జగన్‌కు మాత్రమే ప్రత్యేకం. ఎన్నికల ముందు మాత్రమే ఈ 'ప్రేమ' పెల్లుబుకుతుంది.

ఈ ఐదేళ్లు జనాన్ని పరదాలకు, బారికేడ్లకు ఆవల పెట్టిన జగన్... ఇప్పుడు మళ్లీ తన మార్కు ముద్దులు మొదలు పెట్టడం నటన కాక మరేమిటి?

సౌమ్యులు, ఆర్థికంగా అంతంత మాత్రం..


బుట్టా రేణుకను పరిచయం చేస్తున్న సీఎం జగన్

ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో, జనం నవ్వుకుంటారేమో అనే శషభిషలు జగన్‌కు ఏ కోశానా లేవు. మంచి నీళ్లు తాగినంత సింపుల్‌గా అబద్ధాలు చెప్పేస్తారు. తాజా ఎన్నికల ప్రచారంలో... అభ్యర్థులను పరిచయం చేస్తూ ఆయన ఇస్తున్న 'సర్టిఫికెట్లు' చూసి జనం ఘొల్లున నవ్వుకుంటున్నారు. కోట్లకు పడగలెత్తిన బుట్టా రేణుక ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అనడం... మాట కటువుకానీ అంబటి రాంబాబుకు మంచి గుణాలున్నాయని చెప్పడం... కొడాలి నాని, వల్లభనేని వంశీ తదితరులు సౌమ్యులు, మంచివారని చెప్పడం జగన్‌కు మాత్రమే చెల్లింది.

ఔరా... ఇంతటి నటనా కౌశలం ఇంకెవరికైనా ఉంటుందా!

'నాన్నను చంపించిన' వాళ్లకు పదవులా?


సీఎం జగన్‌తో పరిమళ్ నత్వానీ

తన అవసరం తీరడమే ముఖ్యం! దీనికోసం దేన్నైనా వాడుకుంటారు! చివరికి... తండ్రి మరణాన్ని కూడా! 2009లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి దుర్మరణం పాలయ్యారు. విచారణలో ఈ విషయం స్పష్టంగా తేలింది. తండ్రి స్థానంలో తాను ముఖ్యమంత్రి అయ్యేందుకు జగన్ శతవిధాలా ప్రయత్నించారు. కానీ... సోనియాగాంధీ అందుకు ససేమిరా అన్నారు. 'ఇక కాంగ్రెస్‌లో ఉంటే నా కల నెరవేరదు' అని అనుకున్నాకే తండ్రి మరణంలో ఆయనకు 'కుట్ర'లు కనిపించాయి. దీని వెనుక 'రిలయన్స్' హస్తముందని ఆరోపించారు. పనిలో పనిగా చంద్రబాబుపైనా ఆరోపణలు గుప్పించారు. రాజీనామాలు చేసి ఉప ఎన్నికలకు పోయినప్పుడూ తండ్రి మరణాన్ని వాడుకున్నారు. 2014 ఎన్నికల సమయంలోనూ అదే పాట పాడారు. 2019లో అధికారంలోకి రాగానే.. 'సారు మారిపోయారు'. ముకేశ్ అంబానీకి జగన్ మిత్రుడైపోయారు. విశాఖ పెట్టుబడుల సదస్సునకు ముఖేశ్ అంబానీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. తాడేపల్లి నివాసానికి ముఖేశ్ అంబానీని పిలిచి భోజనం పెట్టారు. వ్యాపార స్నేహాన్ని రాజకీయ మిత్రత్వంగా మలచుకున్నారు. రిలయన్స్ సంస్థల వైస్ ప్రెసిడెంట్ పరిమళ్ నత్వానీకి రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టారు.

ఇదీ జగన్ తీరు! 'విలువల నాయకుడు' అని జగన్ అభిమానులు గొప్పలు చెప్పుకోవడమే కానీ, అవి నిజంగా ఉన్నాయా?

ఆనాటి ముచ్చట

రూ.18 వేలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా!

- ప్రస్తుతం పింఛనుతో బతుకుతున్నా
- మాజీ ఎమ్మెల్యే సుక్క పగడాలమ్మ

ఒకసారి సర్పంచ్ అయితేనే, తరతరాలకు సరిపడే సంపదను కూడబెట్టుకుంటున్న రోజులివి. అలాంటిది ఎమ్మెల్యేగా పనిచేసిన సుక్క పగడాలమ్మ మాత్రం పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా, విలువలు కలిగిన రాజకీయం చేసిన సంతృప్తి ఆమె మోముపై కనిపిస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే.. 1972-1978 మధ్య కాలంలో పాతపట్నం నియోజకవర్గం ఎస్సీ మహిళకు కేటాయించారు. ఇందిరా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత లక్ష్మణదాసుకు మెళియాపుట్టి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన పగడాలమ్మ కుటుంబంతో పరిచయం ఉంది. దాసు కారణంగానే ఆనాడు తనకు పోటీ చేసే అవకాశం లభించిందని పగడాలమ్మ తెలిపారు. ప్రధాని ఇందిరాగాంధీతో కూడా ఆయన పరిచయం చేయించారని.. అప్పట్లో ఆమెతో దిగిన ఫొటోను చూపించారు.


నాడు ఇందిరా గాంధీతో దిగిన ఫొటోను చూపిస్తున్న పగడాలమ్మ

జలగం 10 వేలు, నీలం 2 వేలు

పాతపట్నం నుంచి పోటీచేసిన ఆమె 7,560 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అప్పట్లో ఎమ్మెల్యే నెల జీతం రూ.350 మాత్రమేనట! ఇప్పుడంటే ఎన్నికల్లో ఖర్చు పోటాపోటీగా పెడుతున్నారు. నియోజకవర్గానికి రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే అప్పట్లో తనకు ఎన్నికల ఖర్చు రూ.18వేలు అయినట్లు పగడాలమ్మ చెబుతారు. అందులో జలగం వెంగళరావు రూ.10 వేలు ఇవ్వగా.. నీలం సంజీవరెడ్డి రూ.2 వేలు ఇచ్చారట! మిగతా డబ్బుల కోసం భూమి కొంత అమ్మి ఎన్నికల్లో పోటీ చేశారట! అసెంబ్లీ సమావేశాలకు వెళ్తే రోజుకు రూ.80 వరకు ఇచ్చేవారని పగడాలమ్మ తెలిపారు. ప్రస్తుతం ఆమె బతుకు భారంగా ఉంది. మాజీ ఎమ్మెల్యేలకు పదేళ్ల క్రితం వరకు పింఛను చాలా స్వల్పంగా ఉండేది. ఒకానొక సమయంలో బతుకు భారమై ఉపాధి పనులకు వెళ్లిన రోజులు ఉన్నాయని ఆమె తెలిపారు. తను ఉంటున్న ఇల్లు తితలీ తుఫాన్ సమయంలో పడిపోవడంతో ముక్తాపురంలోనే కుమార్తె వద్ద ఉంటున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం తనకు వస్తున్న రూ.30 వేలు పింఛనుతో కొంత గౌరవంగానే బతుకుతున్నానని తెలిపారు.

ఇప్పటి రాజకీయాలు చూస్తే భయమేస్తోంది..

"ఇప్పటి రాజకీయాలు చూస్తే భయమేస్తోంది. ఎన్నికల్లో పోటీ డబ్బుతో ముడిపడిపోయింది. ప్రత్యక్ష రాజకీయాల్లో లేకున్నా టీవీల్లో వార్తలు చూసి... అప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు పోల్చుకుంటే చాలాతేడా కనిపిస్తోంది. అప్పట్లో సమస్యలను వెతుక్కుంటూ జనం దగ్గరకు వెళ్లే వాళ్లం. జనం తరఫున అధికారులతో మాట్లాడి వారి ఇబ్బందులు తొలగించేందుకు ప్రయత్నించే వాళ్లం. చాలాసార్లు నా భర్త తన సైకిల్‌పై కూర్చోబెట్టుకుని నన్ను గ్రామాలకు తీసుకెళ్లారు" అని పగడాలమ్మ తెలిపారు.

- మెళియాపుట్టి

కులాల మధ్య చిచ్చు పెట్టి...

కులాల మధ్య చిచ్చు పెట్టడం... ప్రత్యేకంగా, ఒక సామాజిక వర్గంపై ఉద్దేశపూర్వకంగా ద్వేషం పెంచడం! విపక్షంలో ఉండగా జగన్ అమలు చేసిన అజెండా ఇది! దీనికోసం పచ్చి అబద్ధాలు చెప్పేందుకూ వెనుకాడలేదు. టీడీపీ హయాంలో పోలీసు శాఖ 36 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు ఇచ్చింది. 'ఇందులో 33 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే' అని వైసీపీ అగ్రనేతలు పదేపదే ప్రచారం చేశారు. 'కాదు మొర్రో...' అని స్వయంగా పోలీసు శాఖే వివరణ ఇచ్చినా అదే అబద్ధాన్ని చెబుతూ వచ్చారు. చివరికి... 'ఇది అబద్ధం' అని జగన్ సర్కారే స్వయంగా అంగీకరించింది. ఆ 36 మందిలో మొత్తంగా 12 మంది మాత్రమే ఓసీలు...ఇందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు నలుగురు మాత్రమే. మిగిలిన 24 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారులని హోంమంత్రి అసెంబ్లీలోనే ప్రకటన చేశారు. అందులోనూ అత్యధికంగా దళితులు ఏడుగురు ఉన్నారు.

..ఇదీ అసలు నిజం!

డేటా చోరీ... ఎవరిది?

2019 ఎన్నికల ముందు వైసీపీ 'డేటా చోరీ' పేరుతో నానా రచ్చ చేసింది. ప్రజల సమాచారం మొత్తాన్నీ చంద్రబాబు సర్కారు ప్రైవేటుకు అప్పగించేసిందని గోల పెట్టింది. పథకాల అమలు, అర్హులందరికీ న్యాయం చేసేందుకు తీసుకున్న చర్యలపై విషం చిమ్మింది. కానీ... అధికారంలోకి వచ్చాక జగన్ చేసిందేమిటి? వలంటీర్ల ద్వారా ప్రతి ఇల్లు... ఇంట్లోని ప్రతి వ్యక్తి సమగ్ర సమాచారాన్ని తీసేసుకుని తన రాజకీయ అవసరాలకు వాడుకుంటోంది. చంద్రబాబు సర్కారు చేసింది తప్పయితే జగన్ చేసిందేమిటి? టీడీపీ హయాంలో నిజంగానే డేటా చోరీ జరిగి ఉంటే... తాను అధికారంలోకి వచ్చాక కేసు ఎందుకు పెట్టలేదు?

..ఏమీ లేకుండానే ఇసుక విధానం, మద్యం పాలసీ, అమరావతిలో 'ఇన్‌సైడర్' ట్రేడింగ్ అంటూ కేసులు పెట్టారు కదా.. చాలా జరిగిందంటున్న డేటా చోరీని మాత్రం ఎందుకు వదిలేసినట్లు?

'కోడికత్తి' డ్రామా...

లేనిది ఉన్నట్టు... ఉన్నది లేనట్టు కనికట్టు చేయడంలో జగన్ శిబిరం పీహెచ్‌డీ చేసేసింది. 'కోడికత్తి' అన్నింటినీ మించిన హైలెట్! ఎన్నికల ముందు విశాఖ విమానాశ్రయమే ఈ నాటకానికి వేదికగా మారింది. 'కోడికత్తి' శ్రీను పక్కా జగన్ అభిమాని అని, జగన్ కోసం ఏ మాత్రం ప్రమాదకరం కాని రీతిలో భుజంపై చిన్నగా గుచ్చాడని గంటలోనే తేలిపోయింది. కోడికత్తిని పలుమార్లు స్టెరిలైజ్ చేసి చిన్నగా భుజానికే గుచ్చానని, ఏమీ కాదులే అన్నా అని జగన్‌కు అక్కడే చెప్పానని శ్రీనివాస్ వివరించాడు. వైసీపీ నేతలు కొడుతుంటే 'అన్నా నీకు సానుభూతి రావాలనే చేశా.. చంపే ఉద్దేశం ఉంటే హోటల్ కిచెన్‌లో కూరగాయలు కోసే పెద్ద కత్తే తెచ్చేవాడిని.. కొట్టొద్దని చెప్పన్నా' అని తాను అనడంతో తనపై దాడి చేస్తున్న వైసీపీ నేతల్ని జగన్ వారించారని చెప్పాడు. జగన్ భుజానికి అయిన గాయం రెండు మిల్లీమీటర్లకంటే తక్కువే. నవ్వుకుంటూ అక్కడి నుంచి విమానం ఎక్కిన జగన్... హైదరాబాద్‌లో అస్మదీయ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అక్కడికి వెళ్లాక ఆ గాయం మరింత పెద్దదైంది. సానుభూతి డ్రామా మరింత రక్తి కట్టింది. చివరికి జగన్‌కు అధికారం దక్కింది. హైదరాబాద్‌లో కుట్లు వేసిన డాక్టర్‌కు ఆ తర్వాత ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, ఆరోగ్యశ్రీ ట్రస్టు వైస్ చైర్మన్ పదవులు లభించాయి. అమాయకపు ఆలోచనలు చేసిన జగన్ వీరాభిమాని కోడికత్తి శ్రీను మాత్రం ఐదేళ్లు జైలులో మగ్గాడు. దర్యాప్తునకు జగన్ ఏమాత్రం సహకరించలేదు. 'కుట్ర లేదు' అని స్వయానా ఎన్ఐఏ తేల్చినా సరే... 'కుట్రకోణంలో మరింత లోతుగా దర్యాప్తు చేయాలి' అంటూ జగన్ ఇప్పటికీ పిటిషన్లు వేస్తుండటం గమనార్హం.

..ఇది కదా జగన్ మార్క్ రాజకీయ రసవత్తర డ్రామా అంటే!

హూ కిల్డ్ బాబాయ్?



నాన్న మరణం... చిన్నాన్న హత్య! జగన్‌కు.. కాదేదీ రాజకీయానికి అనర్హం! 2019 ఎన్నికల ముందు వివేకా దారుణ హత్య జరిగింది. ముందు గుండెపోటు కథ అల్లారు. 'గొడ్డలి వేటు'ను దాచాలని చూశారు. అది సాధ్యంకాకపోవడంతో... వెంటనే చంద్రబాబుపైకి తిప్పేశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ రోత పత్రికలో రాతలు రాయించారు. వివేకా హత్య జరిగిన రోజు 'చిన్నాన్న... చిన్నాన్న... చిన్నాన్న' అంటూ జగన్ చెప్పిన మాటలు, ఆయన ప్రదర్శించిన హావభావాల గురించి ఏమని వర్ణించగలం! "మా అబ్బ(రాజారెడ్డి)ను చంపింది చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే. అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తా అని చంద్రబాబు హెచ్చరించిన రెండు రోజుల్లోనే మా నాన్న చనిపోయారు. హెలికాప్టర్ ప్రమాదంపై ఇప్పటికీ మాకు అనుమానాలున్నాయి.. విశాఖ విమానాశ్రయంలో నాపై కత్తులతో దాడి చేసి చంపాలని కుట్ర చేసింది చంద్రబాబు సీఎంగా ఉండగానే! ఇప్పుడు మా చిన్నాన్న హత్యకు గురైంది కూడా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే" అంటూ జగన్ చక్కటి డైలాగులు చెప్పారు. ఈ సీన్‌లో 'వివేకం' సినిమాలో నటులు కూడా దిగదుడుపే! వివేకా హత్యపై సీబీఐ దర్యాప్తు కావాలన్న జగన్... తాను అధికారంలోకి రాగానే అదేం అక్కర్లేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ రంగంలోకి దిగడంతో ఒక్కొక్కరి పాత్ర బయటపడింది. అన్ని ఆధారాలూ లభించినా సరే... నిందితులైన వైఎస్ భాస్కర్ రెడ్డి, అవినాశ్ రెడ్డి తదితరులను జగన్ కాపాడుకుంటూ వస్తున్నారు. చివరికి... వివేకాను ఆయన కూతురు సునీతా రెడ్డే చంపించారనేంత నీచమైన రాతలు రాశారు.

ఇది... జగన్ మార్కు అరాచకం. 2019లో 'హూ కిల్డ్ బాబాయ్' అనే నినాదం నుంచి.. జగన్‌ను, అవినాశ్‌ను ఓడించాలంటూ వివేకా కుమార్తె సునీత పిలుపునిచ్చే స్థాయికి వెళ్లింది.

నోట్ దిస్ పాయింట్!



అత్యధిక ఓటర్లు కలిగిన జిల్లా: కర్నూలు

20,14,749

అత్యల్ప ఓటర్లు కలిగిన జిల్లా: అల్లూరి సీతారామరాజు

7,61,255

అత్యధిక ఓటర్లు కలిగిన అసెంబ్లీ నియోజకవర్గం: భీమిలి

3,52,782

అత్యల్ప ఓటర్లు కలిగిన అసెంబ్లీ నియోజకవర్గం: పెడన

1,65,882



చింటూ: కాస్త గొడ్డలి ఇస్తావా!
చిన్నూ: గొడ్డలి చూసినప్పుడల్లా... వివేకా గుర్తుకొస్తున్నాడ్రా! అందుకే అది వాడటం మానేశా!
చింటూ: పోనీ... కత్తి ఇవ్వు!
చిన్నూ: అది ఉందికానీ, కత్తి అంటేనే కోడికత్తి గుర్తుకొస్తోంది కదరా! పాపం శీను!
చింటూ: ఏదేదో మాట్లాడుతున్నావ్... ఆరోగ్యం బాగానే ఉందా!
చిన్నూ: మీ అన్నియ్య రాగానే మందు మానేశా కదరా! బాగానే ఉంటోంది.



ఆర్టీఐ సాక్షిగా బండారం బట్టబయలు
ఐదేళ్లలో 30 లక్షల ఇళ్ల నిర్మాణం ఒట్టిదే
కేంద్రం మంజూరు చేసినవి 23 లక్షల ఇళ్లు
సకాలంలో పూర్తిచేయక 5,28,658 ఇళ్లు రద్దు
ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కట్టినవి 5 లక్షలే
ఇంకా పునాదులు దాటనివి 11 లక్షల పైనే
వాస్తవాలు దాచి జగన్ పదే పదే అబద్ధాలు
ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని ప్రగల్భాలు
రాయితీ సొమ్ములో 90% కేంద్రానిదే
తన వాటా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
'ఉపాధి' నిధులు దారి మళ్లింపు


ఏలూరు అర్బన్ మండలం లక్ష్మీపురంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయిన జగనన్న ఇళ్ల పునాదులు



ఇవేనా ఇళ్లు?

ఇళ్ల నిర్మాణంపై జగన్ కట్టుకథలు

జగన్ గొప్పలు..

పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా ఇల్లు లేని పేదలకు 30 లక్షలకు పైగా పక్కా ఇళ్లు నిర్మిస్తాం. నా అక్క చెల్లెమ్మలకు ఒక ఆస్తిగా అందిస్తా. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల పేరుతో 15 వేలకు పైగా లే అవుట్లలో ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నాం.

ఇదీ వాస్తవం

ఈ ఐదేళ్లలో కేంద్రం రాష్ట్రంలోని పేదలకు దాదాపు 23 లక్షల ఇళ్లు మంజూరు చేసింది. అయితే జగన్ సర్కారు 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తిచేసింది. అంటే... నాలుగో వంతు కన్నా తక్కువన్నమాట. సమాచార హక్కు చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వమే ఈ విషయం వెల్లడించింది.

ఉత్తుత్తి ఆర్భాటం

ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటిని కూడా లబ్ధిదారులే ప్రభుత్వ సాయంతో పాటు అప్పోసప్పో చేసి సొంతంగా కట్టుకున్నారు. అయితే సామూహిక గృహ ప్రవేశాల పేరిట జగన్ ప్రభుత్వం ఉత్తుత్తి హడావుడి చేసింది.

సొమ్మొకరిది.. పేరొకరిది

పేదల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం 90% రాయితీ ఇస్తోంది. అయితే ఈ క్రెడిట్‌ను జగన్ సర్కారు తన ఖాతాలో వేసుకుంటోంది. పేదలకు తామే ఇళ్లు కట్టిస్తున్నట్టుగా బిల్డప్ ఇస్తోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం గురించి ముఖ్యమంత్రి జగన్ చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నాయి. ఇళ్ల నిర్మాణం మాత్రం పునాదులు దాటడం లేదు. జగన్ చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఎక్కడా పొంతన లేదు. పేదల ఇళ్ల నిర్మాణంపై ఆయన చెబుతున్న గొప్పలు కట్టుకథలేనని సమాచార హక్కు చట్టం సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వమే ఒప్పుకొంది. ఈ ఐదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలోని పేదలకు సుమారు 23 లక్షల ఇళ్లు మంజూరు చేయగా.. జగన్ సర్కారు 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగింది. మిగిలిన ఇళ్లన్నీ పురోగతిలో ఉన్నాయని చెబుతున్నారు. 11,45,262 ఇళ్లు ఇంకా పునాదులు కూడా దాటలేదు. అంటే.. పేదల ఇళ్ల నిర్మాణం తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇళ్ల లబ్ధిదారులకు ఇస్తున్న రాయితీ సొమ్ములో 90 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. మిగిలిన నిధులను ఇవ్వలేక జగన్ సర్కారు చేతులెత్తేస్తోంది. దీంతో పేదల ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఈ వాస్తవాలను దాచిపెడుతూ.. 30 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామంటూ జగన్ పేదలను మోసం చేస్తున్నారు.

ఆర్టీఐ కింద దరఖాస్తు

పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలని సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ ఆర్టీఐ కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంటే.. 2019 జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఈ ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద రాష్ట్రానికి మంజూరు చేసిన ఇళ్లు, వాటిలో రద్దు చేసినవి, మిగిలిన వాటిలో ఇప్పటివరకు పనులు మొదలు పెట్టినవి, పునాదుల స్థాయికి వచ్చినవి, పూర్తిగా నిర్మించి గృహ ప్రవేశాలు చేసిన ఇళ్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో ఇంటికి మంజూరు చేస్తున్న గ్రాంట్లు, రుణాలకు సంబంధించిన వివరాలను సంవత్సరాల వారీగా, జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇవ్వాలని కోరారు.

కేంద్రం ఆక్షేపణ

పీఎంఏవై అర్బన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో ఇంటికి రూ.1,80,000 రాయితీగా అందించాలి. ఇందులో కేంద్రం రూ.1,50,000 చొప్పున లబ్ధిదారులకు ఇస్తోంది. మిగిలిన రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయడం లేదు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం విడుదల చేస్తున్న నిధులనే ఇళ్ల లబ్ధిదారులకు లేబర్ చార్జీల కింద మంజూరు చేస్తోంది. అంటే.. మొత్తం రాయితీ భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందన్న మాట. జగన్ సర్కారు ఈ విషయాన్ని చెప్పకుండా మొత్తం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటూ పేదలకు తామే ఇళ్లు కట్టిస్తున్నట్టుగా బిల్డప్ ఇస్తోంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలోని కేంద్ర మంజూరీ, పర్యవేక్షణ కమిటీ (సీఎస్ఎంసీ) గత ఏడాది రాష్ట్రానికి వచ్చినప్పుడు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి జగన్ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. పీఎంఏవై అర్బన్ పథకం కింద రాష్ట్రానికి మొత్తం 21 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేస్తే, వాటిలో నాలుగో వంతే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని, జాతీయ భవనాల కోడ్ నిబంధనల ప్రకారం నిర్మించడం లేదని, కేంద్ర నిధులను కూడా సక్రమంగా ఖర్చు చేయడం లేదని ఆక్షేపించింది.

హౌసింగ్ కార్పొరేషన్ ఏమంటోందంటే!

- 2019-20 నుంచి 2023-24 వరకు కేంద్రం పీఎంఏవై (అర్బన్) కింద 21,03,060, గ్రామీణ్ కింద 1,79,060 ఇళ్లు.. మొత్తం 22,82,120 ఇళ్లు మంజూరు చేసింది.
- అర్బన్ ఇళ్లలో 5,43,162, గ్రామీణ్ ఇళ్లలో 18,515 మాత్రమే జగన్ ప్రభుత్వం పూర్తిచేసింది.
- సకాలంలో ఇళ్లు పూర్తి చేయలేకపోవడంతో 5,28,658 ఇళ్లను కేంద్రం రద్దు చేసింది.
- మరో 15 లక్షలకు పైగా ఇళ్ల పనులు మొదలై పురోగతిలో ఉన్నాయి. వీటిలో 11,45,262 ఇళ్లు పునాదుల దశ దాటలేదు.

రాష్ట్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం ఇళ్ల నిర్మాణం

సంవత్సరం	కేంద్రం మంజూరు చేసిన పీఎంఏవై(అర్బన్) ఇళ్లు	ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు
2019-2020	7,53,527	14,029
2020-2021	6,22,953	5,418
2021-2022	4,57,209	30,923
2022-2023	2,22,354	3,13,437
2023-2024	47,017	1,79,355
మొత్తం	21,03,060	5,43,162

గ్రామీణ ఇళ్లకు గ్రహణం

కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద రాష్ట్రంలో 1,79,060 మంది పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటి వరకు 18,515 ఇళ్లను మాత్రమే రాష్ట్రం పూర్తి చేయగలిగింది. మిగిలిన 1,60,545 ఇళ్లకు గ్రహణం పట్టింది. గ్రామీణ్ పథకం కింద మంజూరు చేసిన ఇళ్లకు ఒక్కో దానికి రూ.1,20,000 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. కేంద్రం రూ.72 వేలు, రాష్ట్రం రూ.48 వేలు సబ్సిడీ ఇవ్వాలి. అయితే ఈ మొత్తం సరిపోదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు కూడా రూ.1,80,000 ఇస్తామని ప్రకటించింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.1,08,000 భరించాలి. అయితే జగన్ సర్కారు రాయితీ అందించక ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా పక్కనబెట్టేసింది.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో ఇళ్ల నిర్మాణానికి పునాదులు కూడా పడని జగనన్న లే అవుట్‌లోని ఒక భాగం




బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది
- అబ్రహాం లింకన్

ది లీడర్



ఆదర్శ నేత ఎన్జీరంగా

ఆరు దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా.. గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన రాజకీయ యోధుడు ఆచార్య ఎన్జీ రంగా! ఆయన ఎన్నికల నోటిఫికేషన్‌ను యుద్ధ భేరితో పోల్చే వారు. గెలుపు ఓటములు ఎలా ఉన్నా... ఎన్నికల్లో పోటీని ఒక యుద్ధంలా చేయాలని చెప్పేవారు. అయితే... అది పూర్తిగా ధర్మయుద్ధమే. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులపై ఎటువంటి వ్యక్తిగత విమర్శలు చేసే వారు కాదు. తన ప్రచార సభల్లో స్వాతంత్రోద్యమం గురించి, జాతీయ రాజకీయాల గురించి మాత్రమే ప్రస్తావించేవారు. తనను ఎవరైనా విమర్శించినా వివరణ ఇచ్చే వారు తప్ప ప్రతి విమర్శ చేసే వారు కాదు. 'ఆయనకు కనపడదు...వినపడదు' అని ప్రత్యర్థులు ఒకసారి ఎద్దేవా చేయగా... "నాకు వినపడని మాట మాత్రం వాస్తవమే. స్వాతంత్రోద్యమంలో ఒక పర్యాయం పోలీసులు చేసిన లాఠీచార్జీలో చెవిపై గాయం కావటంతో వినికిడి లోపం ఏర్పడింది" అని ఎన్జీ రంగా వివరణ ఇచ్చారు. ఆరు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఆచార్య రంగా ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు హంగూ ఆర్భాటాలు లేకుండా ఒకే ఒక్క వాహనంలో వెళ్లేవారు. ఏ ఎన్నికలోనూ ఒక్క రూపాయి ఖర్చు పెట్టిన దాఖలాలు కూడా లేవు. ఏవైనా చిన్నపాటి సభలు, సమావేశాలు జరిగినా అయ్యే కొద్దిపాటి ఖర్చు కూడా స్థానికులే సొంతంగా పెట్టుకునే వారు. ఓట్ల కొనుగోలు అంటే ఏంటో కూడా ఎన్జీ రంగాకు తెలియదట!

గుంటూరు - ఆంధ్రజ్యోతి



బాపట్లలో ఏర్పాటు చేసిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

110 దాటేస్తాం!

చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు

రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఇదే.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది
దేశమంతా మోదీ నాయకత్వాన్ని కోరుకుంటోంది: కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతోందని కేంద్ర సమాచార, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. జగన్ పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 110కి పైగా సీట్లలో విజయం సాధిస్తుందని చెప్పారు. జూన్ నెలలో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలోని తన నివాసంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. వివిధ అంశాలపై ఆయన ఏం చెప్పారంటే..

అయ్యో ఆంధ్ర...

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేయడానికి అనేక వనరులు ఉన్నాయి. కానీ, గడచిన ఐదేళ్లలో ఆ దిశగా పాలన సాగలేదు. ప్రపంచ దేశాలతో వాణిజ్యానికి అనుకూలమైన ఓడరేవులు రాష్ట్రంలో ఉన్నాయి. దేశంలో రాజధాని కూడా లేని ఏకైక ప్రాంతం ఆంధ్రప్రదేశ్ మాత్రమే! ఇది బాధాకరం.

బలంగా కూటమి..

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి బీజేపీ బరిలో నిలవడం మూడు పార్టీలకు కలిసి వచ్చే అంశం. ఈ కూటమి ఎంతో బలంగా ఉంది. ఈసారి అసెంబ్లీతోపాటు అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుస్తాం. బీజేపీ పోటీ చేస్తున్న ఆరు లోక్‌సభ స్థానాల్లోనూ విజయం సాధిస్తాం. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగింది.

కవితదే కీలక పాత్ర..

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ నిజమైతే కఠిన చర్యలు ఉంటాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేసీఆర్ కుమార్తె కవితదే కీలక పాత్ర. ఈ స్కాంలో అరెస్టు కావడంతో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ ముసుగు తొలగిపోయింది.

మోదీ పవర్‌ఫుల్..

ప్రధాని మోదీ ప్రపంచంలోనే శక్తిమంతుడైన నేతగా ఎదిగారు. ఒకప్పుడు ప్రతి చిన్న దానికీ ప్రపంచ దేశాల వైపు భారత్ చూడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ప్రపంచ దేశాలే ఏ సహాయం కావాలన్నా భారత్ వైపు చూస్తున్నాయి. జీ 20 సదస్సుకు ఆతిథ్యం ఇచ్చి.. అన్ని దేశాలనూ ఆకట్టుకున్నాం. ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు వంటి ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. సోషల్, డిజిటల్, ఫిజికల్ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశాన్ని పాకిస్థాన్, చైనా వంటి దేశాలకు అప్పగించినట్లేనని దేశమంతా గ్రహించింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈసారి అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే 30 సీట్లలో విజయం సాధిస్తాం. దేశమంతా మోదీ నాయకత్వాన్ని కోరుకుంటోంది. అందుకే 'మోదీ కా గ్యారెంటీ' పేరుతో మేనిఫెస్టో తీసుకొచ్చాం. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ భద్రత కోసం దేశ నాయకుడిగా మోదీ ఉండాలి.



ఎర్రెర్రని.. బెజవాడ!

ఎరుపంటే ఎందరికో భయం భయం.. పసిపిల్లలు వారి కంటే నయం నయం అన్నాడో మహాకవి. అలాంటి ఎరుపంటే వీరికెంత మక్కువ! వారి దుస్తులు ఎరుపు. తలకు పెట్టుకున్న టోపీలు.. పట్టుకున్న జెండాలు.. ఎగరేసిన బెలూన్లు.. నీడనిచ్చే గొడుగులు అన్నీ ఎరుపే. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 'ఇండియా' కూటమి అభ్యర్థి జి.కోటేశ్వరరావు (సీపీఐ) శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీతో బెజవాడ ఎరుపెక్కింది.

పసుపేగా.. శుభ సూచకం!

పసుపు శుభాలకు సూచిక. ఏ శుభకార్యం తలపెట్టినా.. పసుపు పూయాల్సిందే. అందుకే ఆనాడు ఎన్టీఆర్... తెలుగుదేశం పార్టీ రంగుగా పసుపును ఎంచుకున్నారు. ఆనాటి నుంచి పసుపు పార్టీ అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. శుక్రవారం విజయనగరం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు నామినేషన్ దాఖలు కార్యక్రమంలోనూ పసుపు రంగు అంతటా కమ్మేసింది. పసుపు పొగను విరజిమ్ముతూ... పసుపు బెలూన్లు ఎగరేస్తూ తెలుగు తమ్ముళ్లు సందడి చేశారు.



రెండో రోజూ అదే జోరు!

పలువురు కీలక నేతల నామినేషన్లు

- లోక్‌సభకు 53 మంది అభ్యర్థులు
- అసెంబ్లీకి 314 మంది 413 నామినేషన్లు



నామినేషన్ దాఖలు కేంద్రానికి కేవలం 50 మీటర్ల దూరంలో పదుల సంఖ్యలో అనుచరులతో వస్తున్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వంలో రెండో రోజూ జోరు కనిపించింది. 25 పార్లమెంటు స్థానాలకు 53 అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, 175 అసెంబ్లీ స్థానాలకు 314 మంది అభ్యర్థులు 413 సెట్ల నామినేషన్లు సమర్పించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోగా.. మిగిలిన నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ సజావుగానే సాగింది. గుంటూరు ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య మంగళగిరి అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య నామినేషన్ వేశారు. బాపట్ల ఎంపీ స్థానానికి టీడీపీ తరఫున తెన్నేటి కృష్ణప్రసాద్, వైసీపీ తరఫున నందిగం సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు. తాడేపల్లిగూడెంలో జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. కడప ఎంపీ స్థానానికి వైఎస్ అవినాశ్‌రెడ్డి నామినేషన్ వేశారు. అయితే, ఆయన కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. ఆర్వో ఆఫీస్‌కు నలుగురితో రావాల్సి ఉండగా పదుల సంఖ్యలో అనుచరులను తీసుకువచ్చి హల్చల్ సృష్టించారు. శ్రీకాకుళం జిల్లా పలాస అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష నామినేషన్ వేశారు. టెక్కలి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కిల్లి కృపారాణి, వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, నర్సీపట్నానికి టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు నామినేషన్ వేశారు. నెల్లూరు ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎలాంటి హంగామా లేకుండానే నామినేషన్ సమర్పించారు.



తంబళ్లపల్లె నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

తంబళ్లపల్లెలో తీవ్ర ఉద్రిక్తత

- పోలీసులపై రాళ్లు విసిరిన గుర్తుతెలియని వ్యక్తి
- ట్రైనీ డీఎస్పీకి గాయం.. టీడీపీ కార్యకర్తలకు కూడా
- పోలీసుల లాఠీచార్జి.. కొద్దిసేపు అదుపు తప్పిన పరిస్థితి

ములకలచెరువు/తంబళ్లపల్లె, ఏప్రిల్ 19: అన్నమయ్య జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లె లోని నామినేషన్ కేంద్ర వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చారు. ఆయన వెంట అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. నామినేషన్ దాఖలు చేసేందుకు జయచంద్రారెడ్డి పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటుకుని ముందుకు వచ్చారు. ఆయన వెంట వచ్చిన వారు కూడా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఓ రాయిని విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన పోలీసులు లాఠీచార్జి ప్రారంభించారు. దీంతో మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌కు రాయి తగిలి గాయమైంది. వెనుకనుంచి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో ముందున్న పలువురు టీడీపీ కార్యకర్తలు కూడా గాయపడ్డారు. కొంతసేపటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. వైసీపీ అభ్యర్థి గురువారం నామినేషన్ వేసినప్పుడు గుర్తుకురాని నిబంధనలు జయచంద్రారెడ్డి దాఖలు చేసినప్పుడు గుర్తుకు వచ్చాయా.. వారికైతే ఒకరూలు.. మాకైతే మరో రూలా? అంటూ పలువురు టీడీపీ శ్రేణులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థి నామినేషన్ సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలను నామినేషన్ కేంద్రం ముందు వరకు అనుమతించారని, తమను మాత్రం 300 మీటర్ల దూరం బ్యారికేడ్లు పెట్టి అడ్డుకున్నారని ఆరోపించారు.



తండ్రి కూడా జగన్‌ను భరించలేక.. ఈయన ఉంటే తన పదవి పోతుందని బెంగళూరుకు తరిమేశాడు. తండ్రికి, తల్లికి భారమైన వ్యక్తి.. భూమికీ, సమాజానికీ భారమే. - చంద్రబాబు

జగన్‌కు ఒక్క చాన్సే..

చివరి చాన్స్!

(మొదటి పేజీ తరువాయి)

రూ.5 లక్షల కోట్లు దోచుకున్నాడని.. దోపిడీ సొమ్మంతా విదేశీ బ్యాంకుల్లో దాచుకున్నాడని ఆరోపించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరు, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కణేకల్లులో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తూ లాభపడాలని చూస్తున్నాడన్నారు. 'గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామా ఆడాడు.. ఇప్పుడేమో గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయితో ఎవరైనా హత్య చేస్తారా..? జన్మనిచ్చిన తల్లికే భారమైన వ్యక్తి జన్మభూమికి భారం కాదా? తండ్రిలేని బిడ్డ అన్నాడు. ఒక్క చాన్స్ అన్నాడు. ముద్దులు పెట్టాడు. తల నిమిరాడు. అధికారంలోకి వచ్చాక పిడిగుద్దులు గుద్దాడు. ఈ ఐదేళ్ల పాలనలో మీలో ఎవరైనా బాగుపడ్డారా' అని ప్రశ్నించారు. అధికార మదంతో విర్రవీగుతున్నాడని.. అందుకే ఆయనకు 'జే గన్‌రెడ్డి'గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రాన్ని దోపిడీ చేసిన వ్యక్తిని ఇలా కాకపోతే మరెలా పిలుస్తారని ప్రశ్నించారు. ఆయన్ను గెలిపిస్తే.. ఢిల్లీకి వెళ్లి పైరవీలు చేసుకున్నాడని.. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశాడని.. అన్ని రంగాలను సర్వనాశనం చేశాడని విమర్శించారు. రూ.13 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దైన్య పరిస్థితి తీసుకొచ్చాడని దుయ్యబట్టారు. చివరకు ఆరోగ్యశ్రీ బిల్లులు కూడా చెల్లించలేక పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నాడని అన్నారు. జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి.. ఈ ఐదుగురు బాగుపడితే.. రాష్ట్రం బాగుపడినట్లా అని నిలదీశారు. మోసం చేయడంలో జగన్ దిట్టని.. అబద్ధాలు చెప్పడం ఆయనకు పుట్టుకతో వచ్చిన విద్యని విమర్శించారు. ఇక్కడ పులిని అని చెప్పుకొనే జగన్.. ఢిల్లీలో పిల్లిగా మారాడని ఎద్దేవాచేశారు. ఆయన తమపై నోరు పారేసుకుంటున్నాడని, తాము బూతులు తిట్టాలంటే ఒక్క నిమిషం పట్టదని అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

రక్తం తాగే జలగ..

లీటర్ల కొద్దీ ప్రజల రక్తం తాగే జలగ జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. 2004లో జగన్ ఆస్తి ఎంత..? ఈ ఐదేళ్లలో దోచుకున్నదెంత? రూ.5 లక్షల కోట్లు దోచేసిన జలగ జగన్‌రెడ్డి. బటన్ నొక్కి ఇచ్చిందెంత..? బొక్కింది ఎంత...? సమాధానం చెప్పాలి. పెట్రోలు, డీజిల్, కరెంటు చార్జీలు, మద్యం, నిత్యావసర సరుకుల ధరలు, సిమెంట్, ఇసుక, స్టీల్.. ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెంచి జలగలా ప్రజల రక్తాన్ని తాగేశాడు.

నా ప్రశ్నలకు జవాబివ్వాలి..

జగన్ ఎప్పుడు మాట్లాడినా రాయలసీమ బిడ్డనంటాడు. నేనూ ఈ సీమ బిడ్డనే. గత ఎన్నికల్లో సీమలో 49 స్థానాల్లో వైసీపీని గెలిపించారు. అందుకు ఈ ప్రాంతానికి ఏమైనా చేశాడా? సీమ ద్రోహి. 2014 నుంచి 19 వరకు నేనేం చేశానో చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను. నువ్వేం చేశావో చర్చించేందుకు సిద్ధమా? సీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఐదేళ్లలో రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టాను. నువ్వు కేవలం రూ.2,500 కోట్లు ఖర్చుపెట్టావ్. తాగేందుకు నీరు లేక జనం.. పొలాలకు నీళ్లు రాక రైతులు విలవిలలాడుతున్నారు. అబద్ధాలు చెప్పడం... బొక్కడం.. దోచుకోవడమే ఆయన విధానం. భూరక్ష చట్టంతో మన భూములన్నీ ఆయన చేతుల్లోకి వెళ్లిపోతాయి. ఆస్తులన్నీ కొట్టేస్తాడు జాగ్రత్త!

ఏం చేశారని నిలదీయండి..

వైసీపీ దొంగలు ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. ఏం చేశారని నిలదీయండి. చొక్కా పట్టుకొని ఎందుకు పనిచేయలేదని ప్రశ్నించండి. రాష్ట్రం సర్వనాశనమైంది. జగన్ పరిపాలన విధ్వంసకరం. ప్రజా వేదికను కూల్చివేసి.. అమరావతిని నాశనం చేశాడు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా తరిమేశాడు. ఎంపీ రఘురామరాజును లాకప్‌లో పెట్టించి, ఆయన్ను కొట్టిన దృశ్యాలను వీడియోలో చూసి ఆనంద పడిన దుర్మార్గుడు. వివేకా హత్యపై కోర్టుకు వెళ్లి ఒక ఆర్డర్ తీసుకొచ్చారు. వాస్తవాలు బయటకు రాకుండా ఎవరూ మాట్లాకుండా చేస్తున్నారు.

భవనాలకు రంగులేస్తే చదువొస్తుందా?

స్కూల్ భవనాలకు వైసీపీ రంగులు వేసుకుంటే పిల్లలకు చదువు వస్తుందా? టీచర్లను నియమించాలి, చదువు చెప్పే వాతావరణాన్ని కల్పించాలి. స్కూళ్లు మూడు కిలో మీటర్లకుపైగా దూరంలో ఉంటే చిన్న పిల్లలు, ఆడ పిల్లలను బడికి పంపిస్తారా? జగన్ డీఎస్సీ పరీక్ష నిర్వహించలేదు. పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయలేదు. గ్రూప్-1, గ్రూప్-2 ఊసే లేదు. మేం అధికారంలోకి రాగానే మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. 25 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తాం. పరిశ్రమలు తీసుకొస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వర్క్‌ఫ్రం హోం ద్వారా అమెరికాలోని కంపెనీల్లో పనిచేసే విధంగా టెక్నాలజీని విస్తరిస్తాం. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాం. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. ఐదేళ్లలో ఒక్కో కుటుంబంపై రూ.10 లక్షల అప్పు తెచ్చాడు. జనం పేరుతో రూ.13 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చాడు. ఇది జగన్ కడతాడా..? ఆయన రోతపత్రిక కడుతుందా? ప్రభుత్వ ఆస్తులను కూడా తాకట్టుపెట్టి అప్పు తెచ్చిన దుర్మార్గుడు. ఈ ఎన్నికల్లో ఎన్డీయేదే అధికారం. నేను ఏ ప్రాంతానికి పోయినా.. నా జీవితంలో ఎన్నడూ చూడని స్పందన ప్రజాగళం సభలకు వస్తోంది. ఇది రాష్ట్రానికి శుభ సూచకం. మేం అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తాం... ఆదాయాన్ని పెంచుతాం.. ప్రజలకు పంచుతాం. టీడీపీతోనే ముస్లిం మైనారిటీలకు న్యాయం జరుగుతుంది. రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, విదేశీ విద్య తదితర పథకాలు అమలు చేసి, ఆ వర్గాలను ఆదుకున్నాం. గతంలోనూ ఎన్డీయేలో ఉన్నాం. ఒక్క ముస్లింకైనా అన్యాయం జరిగిందా?

వలంటీర్లకు న్యాయం చేస్తా..

వలంటీర్లు ఎవరూ రాజీనామా చేయొద్దు. రాజీనామా చేయాలని ఎవరైనా చెబితే.. చంద్రన్న వద్దని చెప్పాడని తిరగబడండి. వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే. వలంటీర్లందరికీ న్యాయం చేసే బాధ్యత నాది. రూ.5 వేలు కాదు.. రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తాం.



చంద్రబాబు తరపున భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా శుక్రవారం కుప్పంలో నిర్వహించిన ర్యాలీ

చంద్రబాబు తరపున భువనేశ్వరి నామినేషన్

- హిందూపురంలో బాలకృష్ణ నామినేషన్



బాబు తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న భువనేశ్వరి

కుప్పం, పుట్టపర్తి, ఏప్రిల్ 19: చిత్తూరు జిల్లా కుప్పం నుంచి 8వ సారి శాసనసభ్యుడిగా పోటీ చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అంతకుముందు కుప్పం పరిధిలోని లక్ష్మీపురం వరదరాజస్వామి ఆలయంలో పత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. మసీదు, చర్చిల్లో సైతం చంద్రబాబు ఘన విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చంద్రబాబు విజయాన్ని కోరుకుంటూ నామినేషన్‌కు అవసరమైన ఫీజు నిధులను పలువురు దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు భువనేశ్వరికి విరాళంగా అందించారు. విరాళాలు అందించిన వారితో పాటు అక్కడున్న అందరికీ భువనేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కుప్పం చెరువుకట్ట నుంచి భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి బయలుదేరారు. సరిగ్గా మధ్యాహ్నం 1.27గంటలకు నామినేషన్ కేంద్రానికి చేరుకున్న భువనేశ్వరి... ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నంతో కలసి చంద్రబాబు తరఫున రిటర్నింగ్ అధికారి జీ శ్రీనివాసులుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో టీడీపీ అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

కుప్పానికి 20 అంశాలతో ప్రత్యేక మేనిఫెస్టో: భువనేశ్వరి

టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కుప్పం నియోజకవర్గానికి 20 అంశాలతో కూడిన ప్రత్యేక మేనిఫెస్టోను ప్రకటించారు. 50% సబ్సిడీతో సీమ ఆవులు, కుప్పం యువతకు ఉద్యోగాలు లభించేలా పరిశ్రమల స్థాపన, టీడీపీ ప్రభుత్వంలో మంజూరై ఆగిపోయిన గృహాలకు బిల్లుల మంజూరు, అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు, ప్రతి పంచాయతీకి రూ.200కోట్లు, మున్సిపాలిటీకి రూ.100 కోట్లు, మున్సిపాలిటీ పరిధిలో పన్నుల తగ్గింపు, కుప్పం నియోజకవర్గానికి రూ.1,000కోట్ల అభివృద్ధి, పట్టుపరిశ్రమకు ప్రోత్సాహం, రైతులకు సబ్సిడీపై డ్రిప్పులు, కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణాలు, కార్గో విమానాశ్రయ నిర్మాణం, పూలు, కూరగాయలకు ధరలు, హంద్రీనీవా పూర్తి, రాతి పనివారికి 100 ఎకరాల్లో పరిశ్రమద్వారా ఉపాధి కల్పన, సామాజిక భవనాల నిర్మాణం, వంద పడకల ఆస్పత్రిని 200 పడకలకు పెంపు, ద్రవిడ యూనివర్సిటీ ప్రక్షాళన, పేదల ఆదాయం రెట్టింపు, ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మైనారిటీలకు ప్రత్యేక ప్యాకేజీలతో అభివృద్ధి వంటి అంశాలు ఈ మ్యానిఫెస్టోలో చోటు చేసుకున్నాయి.

తల లేని మొండెంలా ఏపీ

- ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోలేకపోయిన వైసీపీ: పురందేశ్వరి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19: 'ప్రజల విశ్వాసాన్ని జగన్ సర్కారు నిలుపుకోలేకపోయింది. నమ్మకం కోల్పోయిన వైసీపీకి ప్రజలు ఎందుకు ఓటు వేయాలి?' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధి గుర్తుకొచ్చేదని, ఇప్పుడు రాష్ట్రం తలలేని మొండెంలా తయారైందని చెప్పారు. కాగా, రాజమహేంద్రవరం లోక్‌సభ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. జేఎన్ రోడ్డులోని తన నివాసం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ కే మాధవీలతకు నామినేషన్ పత్రాలు అందజేశారు.



నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న రఘురామరాజు భార్య రమాదేవి

రఘురామ భార్య నామినేషన్

ఉండి, ఏప్రిల్ 19: పశ్చిమగోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు తరఫున సతీమణి రమాదేవి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి నామినేషను దాఖలు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పతి తరుపున సతి నామినేషన్

● గద్దె రామ్మోహన్ తరుపున అనురాధ నామినేషన్ దాఖలు


నామినేషన్ దాఖలు చేసి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి వెలుపలకు వస్తున్న గద్దె అనురాధ, క్రాంతికుమార్

పటమట, ఏప్రిల్ 19 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ తరపున ఆయన సతీమణి గద్దె అనురాధ ఒక సెట్ నామినేషన్‌ను శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజే శారు. గద్దె అనురాధ స్వతంత్రంగా టీడీపీ తరపున ఒక సెట్ నామినేషన్‌ను, గద్దె క్రాంతికుమార్ టీడీపీ తరపున నామినేషన్‌ను దాఖలు చేశారు. గద్దె అనురాధ, గద్దె క్రాంతికుమార్ కూడా ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మూడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, అబ్దుల్ ఖలీబ్, నందిపాటి దేవానంద్ పాల్గొన్నారు.

'ఇండియా' అభ్యర్థి కోటేశ్వరరావు నామినేషన్


ఆర్‌వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అభ్యర్థి కోటేశ్వరరావు

చిట్టినగర్, ఏప్రిల్ 19 : ఇండియా కూటమి బలపరిచిన పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి కోటేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కె.ఎల్.రావుపార్కు నుంచి ఇండియా కూటమి కార్యకర్తలు సీపీఐ కార్యకర్తలతో భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేసేందుకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై. వెంకటేశ్వరరావు. కాంగ్రెస్ నాయకులు నరహశెట్టి నరసింహరావు పాల్గొన్నారు.

బాక్సర్ పవన్‌కు బీఓఐ సత్కారం



విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో నిర్వహించిన మూడో డబ్ల్యూఏకేవో ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కిక్ బాక్సర్ ప్రత్తి పవన్ కుమార్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. విజయవాడలోని బ్యాంక్ జోనల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు, డిప్యూటీ జోనల్ మేనేజర్ జీవీ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

41 మందికి చేరిన పుల్లయ్య మాస్టారు బాధితులు

● నిందితులపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 19 : చిట్టీలు పేరుతో ప్రజలను మోసగించి పరారైన విశ్రాంత హెచ్ఎం తురకా పుల్లయ్య మాస్టారు, అతని కుమారుడు అశోక్‌రాజు బాధితుల సంఖ్య 41కి చేరింది. వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటి వరకు బాధితులకు నిందితులు దాదాపు రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు తెలిసింది. స్థానిక కెఎస్.టాకీస్ రోడ్డులో లక్ష్మీవేంకటేశ్వర చిట్‌ఫండ్స్ పేరుతో చిట్టీలు కట్టించుకుని పాడుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా చిట్ ఫండ్ నిర్వాహకులు పరారు కావడంతో నిందితులపై 34 మంది బాధితులు ఈ నెల 17న జంక్షన్ పీఎస్ ఫిర్యాదు చేశారు. ఎస్సై జనార్దన్ విచారణ చేపట్టారు. గురువారం రాత్రి మరికొంత మంది బాధితులు ఎస్సైకు ఫిర్యాదు చేశారు. దీంతో బాధితులు సంఖ్య 41కి చేరినట్టు ఎస్సై తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.35 లక్షల మోసంపై కేసు

పెనమలూరు, ఏప్రిల్ 19 : ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తాను రూ.35 లక్షలు మోసపోయానంటూ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకి వసంత్‌నగర్ కాలనీకి చెందిన మట్లపర్తి శ్రీకాంత్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తన బ్యాంకు ఎకౌంట్లలో సుమారు రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టారు. తనకు డబ్బు అవసరమై విత్‌డ్రా చేద్దామని అడగ్గా ఒకరోజునుంచి రెండు రోజుల పడుతుందని వారు తెలిపి అతని ఖాతాను బ్లాక్‌లో పెట్టారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన శ్రీకాంత్ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి బోడె ప్రసాద్‌ను గెలిపిద్దాం

● టీడీపీ నాయకుడు మొక్కపాటి


యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

పెనమలూరు, ఏప్రిల్ 19 : పెనమలూరు నియోజక అభివృద్ధికి టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ నేత మొక్కపాటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో పాల్గొని మాట్లాడారు. సైకో జగన్ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గం ముప్పై ఏళ్లు వెనక్కి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, రైతులు, మహిళలు, కూలి పనులకు వెళ్లేవారు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాలని కోరారు.

ఘనంగా పీబీ సిద్ధార్థ కళాశాల స్పోర్ట్స్ డే


క్రీడా ప్రోత్సాహకాలను అందుకున్న క్రీడాకారులు ముఖ్య అతిథులు

భవానీపురం, ఏప్రిల్ 19 : మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జూనియర్, డిగ్రీ కళాశాలల 49వ స్పోర్ట్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సిద్ధార్థ అకాడమీ ట్రెజరర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌లు ఎ.చినబాబు, పి.మార్కండేయులు సంవత్సరంలో డిగ్రీ కళాశాల నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించిన 15 మంది, యూనివర్సిటీ జట్టుకు 51 మంది, 44 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిల్లో వివిధ పోటీల్లో పతకాలతో సత్తాచాటారని నివేదించారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించిన 15 మంది క్రీడాకారులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.5.51 లక్షలు క్రీడాప్రోత్సహకాల పారితోషికాలను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ పోలినేని అంకమ్మ చౌదరి ప్రసంగిస్తూ క్రీడాకారులుగా రాణించాలంటే కఠోర శ్రమతోనే సాధ్యమన్నారు. పురుషుల విభాగంలో ఉత్తమ అథ్లెట్‌గా ఎస్.విజయ్‌మోహన్‌ను ఎంపిక చేయగా, మహిళా ఉత్తమ అథ్లెట్‌గా లక్ష్మీసాయి దుర్గలను ఎంపిక చేశారు. కళాశాల స్పోర్ట్స్‌డే విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది.

సైకో పాలనతో విసిగిన ప్రజలు : సౌమ్య


సౌమ్య ఆధ్వర్యంలో పలువురు చేరిక

నందిగామ, ఏప్రిల్ 19: సైకో పాలనతో విసిగిన ప్రజలు చంద్రబాబు పాలన కోరుతున్నారని కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు వేజెండ్ల గోపి, తురక తిరుపతిరావు, వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సౌమ్య వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధిని నాశనం చేయొద్దు

కంచికచర్ల రూరల్ : వైసీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధిని నాశనం చేయవద్దని కూటమి నాయకులు ఓటర్లను కోరారు. కంచికచర్ల 17వ వార్డులో కూటమి నేతలు శుక్రవారం కూటమి అభ్యర్థుల విజ యాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. వేమ వెంకట్రావ్, గుత్త ఓంకార్, గూడవల్లి గణేష్, తోట మల్లికార్జునరావు, నాయిని సతీష్ పాల్గొన్నారు.


గణపతిరావు రోడ్డు నుంచి చిన్ని నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరిన ఫతావుల్లా ఆధ్వర్యంలోని ముస్లిం శ్రేణులు

గణపతిరావు రోడ్డులో టెన్షన్!

● ఒకేసారి వైసీపీ, టీడీపీ శ్రేణుల ర్యాలీలు

● పోలీసులకు ముచ్చెమటలు


జనసేన వీరమహిళలతో కేశినేని చిన్ని ర్యాలీకి బయలుదేరి వెళ్లిన తిరుపతి అనూష

వన్‌టౌన్, ఏప్రిల్ 19 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ సందర్భంగా గణపతిరావు రోడ్డులో ఉద్రిక్తత నెలకొంది. వేసవి తాపం ఒకపక్క, వైసీపీ, టీడీపీ శ్రేణుల ర్యాలీ మరోపక్క కలిసి పోలీసులకు ముచ్చెమటలు పట్టించాయి. పంజా సెంటర్ వద్ద నుంచి గణపతిరావు రోడ్డు వైపునకు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆ పార్టీ వర్గాలు, ముస్లింలతో భారీ ర్యాలీ చేపట్టి అదే మార్గంలో వచ్చారు. మరోపక్క చిన్నికి మద్దతుగా మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది ముస్లింలు ఇస్లాంపేట నుంచి ర్యాలీగా బయలుదేరి అదే మార్గంలో వచ్చారు. పోలీసులు వారికి డైరెక్షన్ ఇవ్వడానికి నానా తంటాలు పడ్డారు. చివరకు కొద్ది సమయం పాటు ఆసిఫ్ ర్యాలీని ఆపి టీడీపీ ర్యాలీని వేరొక మార్గంలో తరలించారు. దీంతో ఉత్కంఠ వాతావరణానికి తెరపడింది.

ముస్లింల ర్యాలీ

కేశినేని చిన్ని నామినేషన్ కార్యక్రమానికి మహమ్మద్ ఫతావుల్లా గణపతిరావు రోడ్డులోని తన కార్యాలయం నుంచి వెయ్యి మంది ముస్లింలతో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆశా, 55వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు షేక్ జాహీద్‌లు నాయకత్వం వహించారు.

● కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ సందర్భంగా 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో వీర మహిళలు భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

తూర్పులో ప్రజలకు చేరువగా పోలింగ్ కేంద్రాలు

● ఫలించిన గద్దె రామ్మోహన్ కృషి


ఎన్నికల ప్రచారంలో గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 19 : విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలు ప్రజలకు ఎంతో దూరంగా నేషనల్ హైవే దాటుకుని వెళ్లి ఓట్లు వేయాల్సి ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు అవుతుంది. ఆ ప్రాంతాల ప్రజల కోరిక మేరకు గద్దె రామ్మోహన్ పోలింగ్ కేంద్రాల మార్పు కోసం నడుం బిగించారు. ఈ విషయమై గద్దె రామ్మోహన్ పలుసార్లు కలెక్టర్, ఎన్నికల అధికారులను కోరారు. దీనిపై వైసీపీ నాయకులు తప్పుడు సమాచారం ఇచ్చి పోలింగ్ కేంద్రాలను మార్పు చేయొద్దని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. గద్దె రామ్మోహన్ కోర్టును ఆశ్రయించి పోలింగ్ కేంద్రాల మార్పుపై ప్రజలకు అనుకూలంగా పోరాటం చేశారు. కోర్టు ఆదేశానుసారం 27, 28, 29, 30, 31, 32, 43, 60 పోలింగ్ కేంద్రాలు మారుస్తూ గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు.

● **మారిన పోలింగ్‌కేంద్రాలివే..**

గుణదలలోని సెయింట్ జోసెఫ్‌లో ఉన్న 27, 28, 29, 30, 31, 32 బూత్‌లలో గుణదల జీయోన్ స్కూల్‌లో 43వ బూత్, లయోలా కళాశాల ఉన్న 60వ బూత్‌లలోని సుమారు 6వేల మంది ఓటర్లు కరెన్సీనగర్, భారతీనగర్, కామినేని నగర్, నాగార్జుననగర్ నుంచి వెళ్లి ఓట్లు వేయాల్సిన పరిస్థితులున్నాయని, తాను ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలింగ్ బూత్‌లను మార్చాలని కోరానని తెలిపారు. 27, 28, 29 పోలింగ్ బూత్‌లను కరెన్సీ నగర్‌లోని చైతన్య స్కూల్‌కు 31, 43వ బూత్‌లను నాగార్జున నగర్‌లోని నందమూరి త్రివిక్రమరావు స్కూల్‌లోకి, 30, 32, 60వ బూత్‌లను దేవినేని బాజీ ప్రసాద్ స్కూల్‌కు మార్చినట్టు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు


ప్రసాదంపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురు నాయకులతో యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఏప్రిల్ 19 : గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలోకి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదంపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు చేరుకున్నారు. అనంతరం ఆయన రామవరప్పాడు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గతంలో టీడీపీకి ఓటు వేయనివారు సైతం నేడు రాష్ట్రంలో ఉన్న దుస్థిని చూసి టీడీపీ గెలుపుకోసం కృషి చేస్తున్నారని చెప్పారు. అసాంఘిక శక్తులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఒక్కసారి తనను అసెంబ్లీకి పంపిస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో గన్నవరం నియోజకవర్గ ప్రజలకు చూపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి వెంకటేశ్వరరావు, బొప్పన హరికృష్ణ, సర్నాల బాలాజీ, పరుచూరి నరేష్, మేడేపల్లి రమ, మండవ రమ్యకృష్ణ, కంచర్ల సూర్య, దండు సుబ్రహ్మణ్యరాజు, కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివనాగరాజు, పట్టపు చంటి, నబిగాని కొండ పాల్గొన్నారు. వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన వారిలో గన్నవరం మండలం బూతిమిల్లిపాడు సర్పంచ్ పేరం సుబ్బారావు, గెడ్డం రంగారావు, సత్తెనపల్లి అజయ్, సందేటి చిరంజీవి, పెండ్యాల వసంతరావు, కె.అశోక్, ఎస్.దినేష్, కాజా రామకృష్ణ, లంగితోటి కిరణ్ కుమార్, సత్తెనపల్లి రవీంద్ర, సత్తెనపల్లి లోకేష్, ఎస్.మధు, ఎస్.రాజబాబు, సవలం తాతబ్బాయి ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా వెనుక కార్పొరేటర్లు

● ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనంటున్న ప్రతిపక్ష నేతలు

రాణిగారితోట, ఏప్రిల్ 19 : కృష్ణలంక, రాణిగారితోటలలో వలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించిన విషయంలో స్థానిక కార్పొరేటర్లు ప్రధానపాత్ర వహించగా, ఇందుకు ముందుగా వారితో నిర్వహించిన సమావేశాలకు అనుమతి తీసుకోకపోవడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టేనని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. వలంటీర్లతో రాణిగారితోట 17వ డివిజన్‌లో ఒక ప్రవేటు పాఠశాలలో ఎటువంటి ముందస్తు అనుమతీ తీసుకోకుండా సమావేశం నిర్వహించడమే కాకుండా అక్కడే విందు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇతర పార్టీల నాయకులు ఏ కార్యక్రమం నిర్వహించాలని ఆలోచించినా అందుకు అనుమతి తప్పనిసరి అని, వెంటనే ఆ నాయకులను ఎన్నికల అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. కనీసం డివిజన్ పార్టీ కార్యాలయాలను తీయనీయకుండా చేస్తున్న అధికారులు 50 మందికిపైగా వలంటీర్లు, పార్టీల నాయకులతో సమావేశం, విందు గంటల తరబడి నిర్వహించినా ఎన్నికల అధికారులకు ఎందుకు సమాచారం లేదని, విషయం బయటికి వచ్చిన తరువాత చర్యలు ఎందుకు చర్యలు లేవని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో ఎటువంటి సమావేశాలూ నిర్వహించకూడదని తెలిసినా పాఠశాల నిర్వాహకులు ఏ విధంగా వలంటీర్ల సమావేశానికి అనుమతి ఇచ్చారని వారిపై చర్యలు తీసుకోవాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేసున్నారు. 21వ డివిజన్‌కు సంబంధించి కూడా వలంటీర్లతో అనుమతి లేకుండా సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. అక్కడ సమావేశం నిర్వహించిన విషయంపై కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

వివక్షరహితంగా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ

● ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్‌శర్మ, మదన్‌కుమార్


ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట ఎన్నికల వ్యయ

కృష్ణలంక, ఏప్రిల్ 19: ఎన్టీఆర్ జిల్లాలో ఈసీఐ మార్గదర్శకాలకు, అనుగుణంగా వివక్షరహితంగా ఎన్నికల వ్యయపర్యవేక్షణ చేయాలని అధికారులకు ఎన్ని కల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్‌శర్మ, మదన్‌కుమార్ సూచించారు. శుక్ర వారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధ్వర్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వి.జస్టిన్, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తిరువూరు, మైలవరం పరిశీలకుడు మదన్‌కుమార్, 16 విభాగాల నోడల్ అధికారులు హాజర య్యారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, సహాయ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, అకౌంటింగ్ బృందాలు వివక్షకు తావులేకుండా చూడాలని జస్టిన్ ఆదేశించారు. జిల్లాలో 16,99,350 మంది ఓటర్లు ఉన్నారని, అంతర్రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టులు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఎలక్షన్ సీజర్ మేనేజ్ మెంట్ సిస్టంను పటిష్ఠంగా అమలుచేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడించారు. ఇప్పటివరకు రూ.3.21 కోట్ల నగదుతో సహా మొత్తం రూ.6.45 కోట్ల సీజర్లు జరిగాయని ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్, ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, పోలీస్, సెబ్, ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యకలాపాలను కలెక్టర్ వివరించారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం సందర్శన

కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కలెక్టర్ ఢిల్లీరావుతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్‌శర్మ, మదన్‌కుమార్ సందర్శించారు. కంట్రోల్ రూంలోని సీ విజిల్స్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ టాక్స్, ఈఎస్ఎంఎస్ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా సెల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీసీపీలు అధిరాజ్‌సింగ్‌రాణా, కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో, తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్.భవానీశంకర్, కేఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో ఇ.కిరణ్మయి, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రసాదంపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : జ్ఞానేశ్వరి

గుణదల, ఏప్రిల్ 19 : మహిళా సంక్షేమం అనేది టీడీపీతోనే సాధ్యపడుతుందని గన్నవరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ప్రసాదంపాడు గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి యార్లగడ్డ గెలిచాక అమలు చేయనున్న అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గూడవల్లి నరసయ్య, ముక్కపాటి చలపతిరావు, పరుచూరి నరేష్, సర్నాల బాలాజి, ఉల్లాస శివ, విజ్జి రామారావు, లంకలపల్లి భూషణం తదితరులు పాల్గొన్నారు.

కాలేయంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ భావనారాయణ

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 19 : విజయవాడ రైల్వే డివిజన్ ఆసుపత్రిలో ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొత్త అవుట్ పేషెంట్ విభాగంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ఎస్.భావనారాయణ కాలేయ వ్యాధులు, జీవనశైలిలో మార్పులు, టీకాలు వేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. పలు అనుమానాలకు, సందేహాలకు ఆయన సమాధానమిచ్చారు. లివర్ సంబంధిత వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 120 మంది ఉద్యోగులకు ఫైబ్రో స్కాన్ పరీక్షలు, 131 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు.

గందరగోళంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

● పేరం శివనాగేశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గందరగోళంగా ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) జాతీయ కార్యదర్శి ఆ పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి పేరం నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు సుమారు రూ.15 లక్షల కోట్లు అప్పు చేశాయని విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక యువత, నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేసే తనను పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అప్రమత్తతో అగ్ని ప్రమాదాల నివారణ

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 19: అప్రమత్తతో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని అగ్నిమాపకాధికారి టి.శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రయివేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో మాక్ ఫైర్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదంలో గాయపడిన వారిని కాపాడటంపై మాక్ డ్రిల్ చేసి సిబ్బంది చూపించారు. వైద్యాధికారులకు, సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో బి.సంజయ్‌వర్మ, జి.రాజశేకర్, బి.శ్రీను, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, షేక్ సుభాని, జి.జీవన్, శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామీణాభివృద్ధి : శ్రీరాం తాతయ్య

వత్సవాయి, ఏప్రిల్ 19: గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధే తప్ప వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని జగ్గయ్యపేట ఎన్డీఏ అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. తాళ్లూరు, మాచినేనిపాలెం, కాకరవాయి, కంభంపాడుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబును సీఎం అయితేనే గ్రామాలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. ప్రజలు ఆయనకు అపూర్వ స్వాగతంతో పాటు నీరాజనాలు పలికారు. ఎండను సైతం లెక్కించకుండా పెద్ద ఎత్తున్న ప్రజలు ప్రచారంలో పాల్గొన్నారు.

సీబీఐ కేసులో శరత్ వాంగ్మూలానికి కోర్టు అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ నమోదు చేయనుంది. సౌత్ గ్రూపులో కీలక పాత్ర పోషించిన శరత్ వాంగ్మూలాన్ని తీసుకోవడానికి సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. సీఆర్పీసీ సెక్షన్ 164 కింద శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సీబీఐ పిటిషన్ వేసింది. వాంగ్మూలం నమోదుకు శరత్ చంద్రారెడ్డి సమ్మతిస్తారా? అని న్యాయమూర్తి కావేరి భవేజా ప్రశ్నించారు. వాంగ్మూలం ఇచ్చేందుకు శరత్ చంద్రారెడ్డి అంగీకరించారని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో ఆయన వాంగ్మూలం నమోదుకు న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. సమగ్రంగా వాంగ్మూలం ఇచ్చేందుకు శరత్ చంద్రారెడ్డి సిద్ధంగా ఉన్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

30న హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు


అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదులు సంఘం ఎన్నికలు ఈనెల 30న జరగనున్నాయి. ఈ నెల 20న నామినేషన్ల తుదిజాబితా ప్రచురిస్తారు. 30న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఈ మేరకు హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధానకార్యదర్శి వి.సాయికుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు వి.వేణుగోపాలరావు, పి.చిదంబరం, సి.రఘు పోటీపడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి కేఎం కృష్ణారెడ్డి, పీతా రామన్, ఎన్.రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి పదవికి డాక్టర్ శాస్త్రి, వంకాయలపాటి ప్రవీణ్, తాతా సింగయ్యగౌడ్, నన్నపనేని శ్రీహరి, సంయుక్త కార్యదర్శి పదవికి ఎన్.నిర్మల కుమార్, ఓరుగంటి ఉదయ్‌కుమార్, చేజర్ల వెంకటేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఎన్నికల అధికారిగా డి.కోదండరామిరెడ్డి వ్యవహరిస్తున్నారు.

రాజాం ప్రమాదంపై చంద్రబాబు సంతాపం

▸▸ వైసీపీ నిర్లక్ష్యంపై విమర్శ

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలో వైసీపీ ప్రచార రథం ఢీకొని భరద్వాజ్ అనే బాలుడు మృతి చెందడంపై టీడీపీ అధినేత చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. శుక్రవారం ఆయన దీనిపై ఎక్స్‌లో స్పందించారు. 'ఈ ఘటన అత్యంత విషాదకరం. సమయానికి 108 అంబులెన్స్ రాలేదు. దీనితో ఆ బాలుడిని సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లలేకపోయారు. కన్ను మిన్ను కానక ప్రచార రథాన్ని నడిపిన నిర్లక్ష్యం ఒకటైతే... అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ అందించలేని వైసీపీ పాలనా నిర్లక్ష్యం మరొకటి. ఈ రెండూ కలసి ఎంతో భవిష్యత్ ఉన్న పసివాడి జీవితాన్ని బలి తీసుకొన్నాయి. భరద్వాజ్ కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలుపుతున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు.

తన పాలనపై పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు


జనార్దన్ రచించిన మన చంద్రన్న అభివృద్ధి-సంక్షేమ విజనరీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రిగా పనిచేసిన 14 ఏళ్ల కాలానికి సంబంధించి ప్రచురించిన పుస్తకాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. చంద్రబాబు 74వ పుట్టిన రోజును పురస్కరించుకొని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దనరావు 'మన చంద్రన్న అభివృద్ధి సంక్షేమ విజనరీ' పేరుతో ఈ పుస్తకం రూపొందించారు. 1995 - 2004 మధ్య మొదటిసారి, 2014 - 19 మధ్య రెండోసారి మొత్తం పద్నాలుగేళ్లపాటు చంద్రబాబు సీఎంగా పనిచేసిన కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఆయా రంగాలవారీగా ప్రచురించారు. విమర్శకుల నోళ్లకు తాళం వేసేలా ఈ పుస్తకంలోని అంశాలు ఉన్నాయని జనార్దన్‌ను చంద్రబాబు అభినందించారు. పుస్తక రూపకల్పనలో పాలుపంచుకొన్న కాసరనేని రఘురాం, పూల విక్రమ్, విజయ్ భాస్కర్, డిజైనర్ కే శ్రీనివాస్, ఐకాన్స్ మధుసూదనరాజు తదితరులనూ చంద్రబాబు అభినందించారు.

శేషాచల అడవుల్లో కార్చిచ్చు

నాలుగు రోజుల్లో 500 హెక్టార్లు కాలి బూడిద

తిరుమల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో నాలుగురోజుల క్రితం మొదలైన మంటలు మరింతగా వ్యాపిస్తున్నాయి. మామండూరు సమీపంలోని అడవిలో మంగళవారం మొదలైన మంటలు క్రమంగా సానరాళ్ల బండ వైపు చేరుకోగా శుక్రవారం కాకులకొండ మీదుగా పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం, శ్రీగంధవనం వైపుగా వ్యాపించాయి. తిరుమల సమీపానికి మంటలు వస్తున్న క్రమంలో టీటీడీ వాటిని అదుపుచేసే ప్రయత్నం చేసింది. అయితే ఇప్పటికే దాదాపు 500 హెక్టార్ల అడవి కాలిపోయి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మంటలు భారీగా ఎగసిపడిన నేపథ్యంలో రెండు చిరుతలతో పాటు నాలుగు ఎలుగుబంట్లు అడవి నుంచి బయటికి పరుగులు తీస్తూ అటవీశాఖ సిబ్బంది కంటపడ్డాయి. మంటలు తిరుమల దిశగా రాకుండా అధికారులు ఫైర్‌లైన్స్‌ను మరింత విస్తరింపజేశారు.


కాలిపోయిన అడవి


ఎవరెస్ట్ దారిలో చంద్రబాబు చిత్రం జెండాను చూపుతున్న ఉపేంద్ర

బాబుపై 'ఎవరెస్ట్ శిఖర'మంత అభిమానం!

తుళ్లూరు, ఏప్రిల్ 19 : ప్రపంచంలోనే ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలి.. ఇదీ అనంతపురం జిల్లా గుత్తి నియోజకవర్గం పరిధిలోని ఇసురాళ్లపల్లికి చెందిన ఉపేంద్ర లక్ష్యం!. అందుకు తన వంతుగా తోడ్పాటు అందించారు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు, దళిత జేఏసీ నేత పులి చిన్నా. చంద్రబాబు నాయుడి పుట్టినరోజు శుభాకాంక్షలను వినూత్నంగా తెలపాలనుకున్నాడు. చంద్రబాబుతో తాను కలసి ఉన్న చిత్రంతో జెండా రూపొందించి ఉపేంద్రకు అందించాడు. దానిని ఎవరెస్ట్ మార్గ మధ్యన (నాగర్ శంగ్ 16674 అడుగులు ఎత్తు)లో ఉపేంద్ర ప్రదర్శించడం ద్వారా చిన్నా.. చంద్రబాబుపై తనకు ఎవరెస్ట్ శిఖరమంత అభిమానముందని చెప్పకనే చెప్పారు!. కాగా, గతంలో వరినారుతో పొలంలో టీడీపీ యువనేత లోకేశ్ చిత్రాన్ని రూపొందించి చిన్నా తనదైన అభిమానాన్ని చాటుకున్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి!

అణు కేంద్రాలకు, వైమానిక స్థావరానికి నిలయమైన ఇస్ఫాహన్ పట్టణంపై డ్రోన్లతో దాడి

▸▸ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ జన్మదినం రోజునే..


ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌లో నిరసన ప్రదర్శన

దుబాయి, ఏప్రిల్ 19: పశ్చిమాసియా సంక్షోభం మరో మలుపు తిరిగింది. ఇటీవల ఇరాన్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఆ దేశంపై శుక్రవారం ఉదయం ప్రతిదాడులు జరిపింది. ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేని (85) జన్మదినమైన ఏప్రిల్ 19వ తేదీని ఇం దుకు ఎంచుకోవటం గమనార్హం. ఇరాన్‌లో పలు అణుకేంద్రాలున్న ఇస్ఫాహన్ పట్టణంపై ఇజ్రాయెల్ డ్రోన్లతో ఈ దాడులు జరిపింది. వీటిని ఇరాన్ విజయవంతంగా తిప్పికొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇరాన్‌కు పెద్దగా నష్టం వాటిల్లలేదని సమాచారం. దాడిని ఇరాన్‌గానీ, ఇజ్రాయెల్‌గానీ ధ్రువీకరించలేదు. ఇరాన్ ఆర్మీ కమాండర్ జనరల్ అబ్దుల్ రహీమ్ మౌసవి మాత్రం.. శుక్రవారం ఉదయం ఇస్ఫాహన్ గగనతలంలో కొన్ని అనుమానిత వస్తువులు కనిపించగా వాటిని తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం చేసిందన్నారు. ఆ వస్తువుల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి సమయంలో సిరియా ప్రభుత్వ టీవీ చానల్‌లో సైన్యం జారీ చేసిన ఓ ప్రకటనను చదివి వినిపించారు. సిరియాకు దక్షిణాన ఓ ప్రాంతంలోని గగనతల రక్షణ వ్యవస్థపై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడిందని, ఈ ఘటనలో కొంత సామగ్రి ధ్వంసమైందని ఈ ప్రకటన పేర్కొంది. దాడికి గురైన ప్రాంతం ఇరాన్ అని వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సైన్యానికి చెందిన ఓ రాడార్ దెబ్బతిన్నదని బ్రిటన్‌లోని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్‌రైట్స్ సంస్థ తెలిపింది. దాడి జరిపినట్లుగా పేరు చెప్పేందుకు ఇష్టపడని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారని న్యూయార్క్‌టైమ్స్ పేర్కొంది.

వైమానిక, అణుకేంద్రాల స్థావరం

ఇస్ఫాహన్ పట్టణానికి సమీపంలో ఓ వైమానిక స్థావరంతోపాటు పలు అణుకేంద్రాలున్నాయి. అమెరికా నుంచి ఇరాన్ ఎఫ్-14 టామ్‌క్యాట్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసింది. వీటి స్థావరం ఇస్ఫాహన్‌లోనే ఉంది. చైనా సరఫరా చేసిన మూడు స్వల్పస్థాయి అణు రియాక్టర్లు ఈ పట్టణంలోనే ఉన్నాయి. ఇస్ఫాహన్ భూగర్భంలో నటాంజ్ అణుశుద్ధి కేం ద్రం ఉంది. ఇజ్రాయెల్ గతంలో పలుమార్లు ఈ కేంద్రంపై రహస్య దాడులు జరిపింది. తాజా ఘటన నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ చానల్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. అణుకేంద్రాలన్నీ సురక్షితంగా ఉన్నాయని పేర్కొంది. దీన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) కూడా ధ్రువీకరించింది. 2018లో ట్రంప్ హయాంలో అమెరికా.. 'ఇరాన్ అణు ఒప్పందం' నుంచి వైదొలిగాక ఇరాన్ తమ అణుశుద్ధీకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసిందని, ప్రస్తుతం ఆ దేశం వద్ద అణ్వాయుధాలు తయారుచేసేంత శుద్ధిచేసిన యురేనియం ఉం దని సమాచారం. ఇక ఇజ్రాయెల్ దాడిని ఇరాన్ అధికారికంగా గుర్తించకపోవడం, ఇజ్రాయెల్ దీనిపై బహిరంగ ప్రకటన చేయకపోవటంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశంలేదని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఇజ్రాయెల్‌పై ఇటీవల క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్‌పై మరిన్ని ఆం క్షలు విధిస్తామని జీ7దేశాలు హెచ్చరించాయి. ఇజ్రాయెల్, ఇరాన్ సంయమనం పాటించాలని జీ7పిలుపునిచ్చింది. కాగా ఈనెల 30వరకు ఇజ్రాయెల్ నగరం టెల్‌అవీవ్‌కు విమానాల రాకపోకలను ఎయిరిండియా నిలిపివేసింది.

సూర్యాపేట కాంగ్రెస్ నేత ఏపీలో కిడ్నాప్?

▸▸ రూ.20 లక్షల అప్పునకు సంబంధించి పంచాయితీ

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 19: సూర్యాపేట జిల్లాకు చెందిన ఎల్లయ్య అనే కాంగ్రెస్ నేత అనుమానాస్పద రీతిలో కనిపించకుండా పోయారు. రెండ్రోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడం, ఫోన్ స్విచాఫ్ రావడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రూ.20 లక్షల అప్పునకు సంబంధించి ఏపీలోని జగ్గయ్యపేటకు వెళ్లడంతో అక్కడే ఎవరైనా ఆయనకు హాని తలపెట్టి ఉంటారా? అని కంగారు పడుతున్నారు. ఎల్లయ్య కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ అనే మహిళ నుంచి జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి రూ.20 లక్షల దాకా అప్పు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వాలని ఆమె అడుగుతున్నా శ్రీనివాస్ ఎప్పటికప్పుడు దాటవేస్తూ వస్తున్నాడు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో పనిచేస్తున్న తన స్నేహితులైన నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకులకు అపర్ణ చెప్పుకొని బాధపడింది. తమ గ్రామానికి చెందిన వడ్డె ఎల్లయ్య అనే వ్యక్తి, శ్రీనివాస్ నుంచి డబ్బులు ఇప్పిస్తాడని.. కంగారుపడొద్దని ఆమెకు వారు చెప్పారు. అనంతరం వడ్డె ఎల్లయ్యను అపర్ణ కలిసింది. ఈ నెల 18న అపర్ణ హైదరాబాద్ నుంచి సూర్యాపేటకొచ్చింది. సూర్యాపేట నుంచి ఎల్లయ్య కారులో ఇద్దరూ జగ్గయ్యపేట బయలుదేరారు. దారిలో కోదాడలో ఉంటున్న తన స్నేహితుడు అంజయ్యను ఎల్లయ్య కారులో ఎక్కించుకున్నారు. కారులో ముగ్గురూ జగ్గయ్యపేటకు వెళ్లగానే అపర్ణ తనకు డబ్బులు ఇవ్వాల్సిన శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పిలిపించింది. అతడొచ్చి అపర్ణకు ఇవ్వాల్సిన డబ్బు ఇస్తానని, తనతో ఎల్లయ్య మాత్రమే రావాలని షరతు పెట్టాడు. దీంతో ఎల్లయ్య ఒక్కడే శ్రీనివాస్‌తో కలిసి ఆయన కారులో వెళ్లాడు. ఎంతసేపటికీ ఎల్లయ్య తిరిగి రాలేదు. కొద్దిసేపటికి ఎల్లయ్యకు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. తర్వాత అపర్ణ మూత్ర విసర్జన కోసం ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లి వస్తానని, అంజయ్యను అక్కడే ఉండాలని చెప్పి వెళ్లింది. తర్వాత ఆమె ఫోన్ కూడా స్విచాఫ్ అయింది. సాయంత్రమైనా ఎల్లయ్య, అపర్ణ రాకపోవడంతో అంజయ్య ఈ విషయాన్ని ఎల్లయ్య కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ విషయమై ఎల్లయ్య కుటుంబసభ్యుడు సతీశ్, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి పోలీసులు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజులు గడిచినా ఎల్లయ్య ఆచూకీ మాత్రం తెలియడం లేదు. తీవ్ర ఆందోళనకు గురవుతున్న ఎల్లయ్య కుటుంబసభ్యులు జరిగిన విషయాన్ని సూర్యాపేట పోలీసులకు కూడా తెలిపారు.

రైళ్లు... 9,111 అదనపు ట్రిప్పులు

▸▸ వేసవిలో రద్దీ నేపథ్యంలో అధికారుల నిర్ణయం


హైదరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆయా రైళ్లు 9,111 అదనపు ట్రిప్పులు తిరగనున్నట్లు అధికారులు తెలిపారు. 2023 వేసవిలో 6,369 ట్రిప్పులను నడిపించగా ఈ ఏడాది 2,742 ట్రిప్పులు అదనంగా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, ఏపీ, తెలంగాణ, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీసంఖ్యలో వెయిటింగ్ జాబితాలున్న మార్గాలను పరిగణలోనికి తీసుకొని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నవ్య | చిత్రజ్యోతి



జగపతిబాబు హిందీ చిత్రం

బాలీవుడ్ నటుడు ఆయుష్ శర్మ నటిస్తున్న హై ఓల్టేజ్ యాక్షన్ చిత్రం 'రుస్లాన్'. కరణ్ బి దర్శకత్వం వహించిన ఈ హిందీ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. సుశ్రీ మిశ్రా హీరోయిన్. నిర్మాత కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌కు రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జగపతిబాబు మాట్లాడుతూ 'ఇది నా రెండో హిందీ చిత్రం. చాలా రోజుల తర్వాత డిఫరెంట్ డైమన్షన్స్ ఉన్న పాత్ర చేశాను' అన్నారు. 'సుల్తాన్ సినిమాకు సహాయ దర్శకుడిగా చేశాను. నన్ను నటుడిగా లాంచ్ చేస్తే బాగుంటుందని రచయిత విజయేంద్రప్రసాద్ సలహా ఇచ్చారు. అలా నా జర్నీ మొదలైంది. రాధామోహన్ డేరింగ్ ప్రొడ్యూసర్. ఆయన బేనర్‌లో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు ఆయుష్ శర్మ.



ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజారవీంద్ర ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మాతలు. త్వరలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. హీరో శ్రీవిష్ణు ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. సమాజం నిలదీసే పరిస్థితులు ఎదురైనప్పుడు ఓ తండ్రి ఏం చేశాడు, తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు అనే కథాంశంతో రూపొందిందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రం రూపొందించామని నిర్మాతలు తెలిపారు. ఇదొక చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులూ ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు.



లచ్చిమక్క పెళ్లి పాట

రాకేశ్ వర్రె టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్‌రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మించారు. మే 3న విడుదలవుతోంది. తాజాగా చిత్రబృందం 'లచ్చిమక్క' అంటూ సాగే పెళ్లి పాటను విడుదల చేసింది. రాంబాబు గోసాల సాహిత్యానికి, గోపీ సుందర్ స్వరాలందించారు. మంగ్లీ ఆలపించారు. ప్రస్తుతం వస్తున్న సినిమాలకు పూర్తి భిన్నమైన చిత్రమిదని నిర్మాత తెలిపారు. వైశాలి రాజ్, రియా సుమన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వీఎస్ జ్ఞానశేఖర్

నవ్వుల సునామీ



'టిల్లు స్క్వేర్' చిత్రం సాధించిన ఘన విజయంతో మరింత ఉత్సాహం పొందిన సితార ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఇప్పుడు 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్'ను నిర్మించనుంది. గత ఏడాది అక్టోబర్‌లో విడుదలైన 'మ్యాడ్' చిత్రం సూపర్ హిట్ అయింది. ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన కల్యాణ్ శంకర్ ఈ సినిమాకు కూడా దర్శకత్వం వహించనున్నారు. 'మ్యాడ్'లో నటించి మెప్పించిన యువ కథానాయకులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఈ సీక్వెల్ కోసం మళ్లీ రంగంలోకి దిగారు. హీరోయిన్ల పేర్లు త్వరలో వెల్లడించనున్నారు. ఇటీవల 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. హీరో సిద్దు జొన్నలగడ్డ, దర్శకుడు కె.వి. అనుదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'మ్యాడ్ నెస్' ఇంకా పూర్తి కాలేదు అని తెలిపిన మేకర్స్ ఈసారి 'మ్యాడ్‌నెస్' రెట్టింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈసారి కథానాయికల త్రయం చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల సునామీ సృష్టించనుంది. సూర్యదేవర హారిక, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



మనమే ప్రపంచంలోకి...

శర్వానంద్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మనమే'. కృతీశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మనమే' ప్రపంచాన్ని పరిచయం చేస్తూ చిత్రబృందం శుక్రవారం టీజర్‌ను విడుదల చేసింది. శర్వానంద్, కృతీ, మాస్టర్ విక్రమ్ ఆదిత్య పాత్రలను కొత్తతరహాలో ఆవిష్కరించబోతున్నారని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విష్ణు శర్మ, జ్ఞానశేఖర్ వీఎస్

తరుణ్‌భాస్కర్ తాజా చిత్రం



దర్శకుడిగా విభిన్న చిత్రాలు రూపొందిస్తూ అప్పుడప్పుడు నటుడిగా కూడా తెరపై కనిపించడం తరుణ్ భాస్కర్‌కు ఓ సరదా. ఇప్పుడు ఆయన ఓ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌లో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈషా రెబ్బా హీరోయిన్. సంజీవ్ ఎ.ఆర్. దర్శకుడు. ప్రస్తుతం రాజమండ్రి, పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. శుక్రవారం హీరోయిన్ ఈషా పుట్టిన రోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేసింది యూనిట్. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి అక్టోబర్‌లో విడుదల చేయాలని నిర్మాతల ప్లానింగ్. బ్రహ్మాజీ, శివన్నారాయణ, సురభి ప్రభావతి, బిందు చంద్రమౌళి, గోపరాజు విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, మాటలు: నందకిశోర్ ఈమని, ఫొటోగ్రఫీ: దీప్ యెరగరా, నిర్మాతలు: సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, సాదిక్, ఆదిత్య పిట్టీ.

కథానాయికే రచయితగా...



అభినవ్ గోమటం హీరోగా నటించిన చిత్రం 'మై డియర్ దొంగ'. బీఎస్ సర్వాంగ కుమార్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి గోజల నిర్మించారు. ప్రముఖ ఓటీటీలో విడుదలవుతోంది. నటుడు ప్రియదర్శి చేతుల మీదుగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. అభినవ్ గోమటం మాట్లాడుతూ 'ఒక మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాతో కొత్త టాలెంట్ పరిచయమవుతోంది' అన్నారు. శాలినీ ఈ చిత్ర కథను అందించడంతో పాటు హీరోయిన్‌గానూ నటించారు అని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శాలిని మాట్లాడుతూ 'స్క్రిప్ట్‌ను, యాక్టింగ్‌ను నిర్మాతలు నమ్మారు. సినిమా రిలీజ్ అవ్వక ముందే సక్సెస్‌ను ఆస్వాదిస్తున్నా' అన్నారు.

పొట్టేల్ కోసం ఎదురుచూస్తున్నా



సందీప్‌రెడ్డి వంగా

"పొట్టేల్ చిత్రం టీజర్ అద్భుతంగా ఉంది. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి. ఈ చిత్రాన్ని విడుదలైన తొలిరోజే చూడాలనుకుంటున్నాను' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చెప్పారు. యువ చంద్ర కృష్ణ హీరోగా నటించిన చిత్రం 'పొట్టేల్'. అనన్య నాగళ్ల కథానాయిక. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. ఈసందర్భంగా యువ చంద్రకృష్ణ మాట్లాడుతూ "పొట్టేల్ మన మట్టి కథ. స్క్రీన్ ప్లే ప్రేక్షకులను అబ్బురపరుస్తుంది' అన్నారు. తన కెరీర్‌లో ఇది బెస్ట్ చిత్రం అవుతుందని అనన్య నాగళ్ల తెలిపారు. పొట్టేల్ సినిమా విషయంలో మేమంతా గర్వంగా ఫీలవుతున్నాం, ప్రేక్షకులను తనదైన భావోద్వేగ ప్రపంచంలోకి తీసుకెళుతుంది అని సాహిత్ అన్నారు. ఇది నా కెరీర్‌లో గొప్ప పాత్ర అవుతుందని అజయ్ అన్నారు. ఈ ప్రయత్నాన్ని ఆదరించాలని నిర్మాతలు ప్రేక్షకులను కోరారు.

కుటుంబమా? నాయకుడా?



నారా రోహిత్ కథానాయకుడిగా నేటి రాజకీయ పరిస్థితిని కళ్లకు కడుతూ తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రతినిధి 2'. మూర్తి దేవగుప్తా దర్శకత్వంలో కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు. దర్శకుడు సుకుమార్ చేతుల మీదుగా శుక్రవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. 'మీ కుటుంబం కంటే నాలుగు సంక్షేమ పథకాలు ఇచ్చిన రాజకీయ నాయకుడే మీకు ముఖ్యమా?' అంటూ ఓటర్లను చైతన్యవంతం చేసే జర్నలిస్ట్ పాత్రలో నారా రోహిత్ ఒదిగిపోయారు. ఈ చిత్రంలో సిరీ లెల్లా కథానాయిక. సచిన్ ఖేడ్కర్, జిషు సేన్ గుప్తా, తనికెళ్ల భరణి, ఇంద్రజ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: మహతి స్వరసాగర్, సినిమాటోగ్రాఫర్: నాని చమిడిశెట్టి.

యూ ట్యూబ్ నుంచి సినిమాకు...



ప్రైవేట్ ఆల్బమ్స్‌తో యూ ట్యూబ్‌లో బాగా పాపులర్ అయిన టోనీ కిక్, సునీత్ మారస్యార్, రామ్, బుల్లెట్ బండి లక్ష్మణ్ ఇప్పుడు చిత్ర రంగంలోకి ప్రవేశించారు. టోని, సునీతను హీరోహీరోయిన్లుగా, లక్ష్మణ్‌ను దర్శకుడిగా పరిచయ కర్నాటకకు చెందిన గిరీశ్‌కుమార్ నిర్మించే చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. టోనీ కిక్, సునీత మారస్యార్ పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు ప్రదీప్‌కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, రచయిత చిన్నికృష్ణ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'మాది కర్నాటక. రామ్, లక్ష్మణ్ చేసిన 'అల్లా హే అల్లా' వీడియో సాంగ్ నాకు బాగా నచ్చింది. ఆ టీమ్‌తో ఒక సినిమా చేయాలనుకున్నాను. దీని తర్వాత కూడా మంచి చిత్రాలు నిర్మిస్తాను' అన్నారు. దర్శకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ 'జానపద గీతాల ద్వారా ప్రేక్షకుల ఆదరణ పొందాం. సినిమాలోని ప్రతి పాట, మాట ఆడియన్స్‌ను అలరించేలా ఉంటుంది. యూ ట్యూబ్‌లో నన్ను ఆదరించినట్లే ఈ సినిమాను కూడా ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు.

కొత్త తేదీ ఖాయం



ప్రజాదరణ పొందిన హారర్, కామెడీ సిరీస్ 'అరణ్మనై'. దర్శకుడు సి.సుందర్ నటిస్తూ దర్శకత్వం వహించే ఈ సిరీస్‌లో నాలుగో భాగం 'బాక్' పేరుతో తెలుగులోకి వస్తోంది. తమన్నా, రాశీ ఖన్నా ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను మొదట ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అయితే ఎండల తీవ్రత కారణంగా 26న కాకుండా మే 3న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాయి. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కొవై సరళ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 20 ఏప్రిల్ 2024

వాట్సాప్ కొత్త ఫీచర్స్



వాట్సాప్ సరికొత్త ఫీచర్‌ని పరిచయం చేస్తోంది. ఇటీవలి కాంటాక్ట్‌లతో యూజర్లు సులువుగా కాంటాక్ట్ అయ్యేందుకు వీలుగా 'రీసెంట్ ఆన్‌లైన్ కాంటాక్ట్స్' ఫీచర్‌ను పరిచయం చేస్తోంది. బీటా టెస్టింగ్‌లో ఈ ఫీచర్ కనిపించింది. ఫలితంగా ప్రస్తుతం యాక్టివ్‌గా, ఆన్‌లైన్‌లో ఉన్న వారితో కాంటాక్ట్ కావడం మరింత

రీసెంట్ ఆన్‌లైన్ కాంటాక్ట్స్ లిస్ట్

ఈజీగా ఉంటుంది. బంధువులు, స్నేహితులతో మరింత బాగా సంభాషించుకునేందుకు ఈ ఫీచర్ తోడ్పడుతుందని 'వబీటాఇన్ఫో' పేర్కొంది. ఆన్‌లైన్‌లో ఉన్న అన్ని కాంటాక్ట్‌లతో సమగ్ర జాబితా ఏదీ కనిపించదు. ఇటీవలి కాలంలో యాక్టివ్‌గా ఉన్న వాటితో క్యురేటెడ్ లిస్ట్ మాత్రమే కనిపిస్తుంది. తద్వారా వెంటనే కమ్యూనికేట్ అయ్యేందుకు ఎవరు అందుబాటులో ఉన్నారో చెబుతుంది. టైమ్లీ కమ్యూనికేషన్ అంతకుమించి ఆప్టిమైజేషన్ లక్ష్యంతో ఈ ఫీచర్‌ను వాట్సాప్ రూపొందిస్తోంది. తద్వారా కమ్యూనికేషన్ ఎక్స్‌పీరియెన్స్ మెరుగ్గా ఉండేలా చూడనుంది. అలాగే వాట్సాప్‌ను అనుచిత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడాన్ని నిరోధించాలని పూనుకుంది. ఈ ఏడాది ఒక్క ఫిబ్రవరి నెలలోనే మన దేశంలో 76 లక్షల మేర వాట్సాప్ అకౌంట్లను నిషేధించింది. రెగ్యులేటరీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ఈ చర్య తీసుకుంది.



టెస్టింగ్‌లో 'ప్రైవేట్ మెన్షన్'

వాట్సాప్ తాజాగా 'ప్రైవేట్ మెన్షన్' ఫీచర్‌ను పరీక్షిస్తోంది. దీంతో వాట్సాప్ పరిధిలోనే ప్రత్యేకించి కొన్ని కాంటాక్టులతో స్టేటస్ అప్డేట్స్‌ను పంచుకోవచ్చు. పర్సనలైజ్డ్ ఇంటరాక్షన్స్‌ను పెంచుకోవచ్చు. స్టేటస్ అప్డేట్స్‌లోనే స్పెసిఫిక్ కాంటాక్ట్‌లను ట్యాగ్ చేసే వెసులుబాటు దీంతో లభిస్తుందని 'డబ్ల్యుఎబీటాఇన్ఫో' పేర్కొంది. ఇది ప్రైవసీని మెయింటైన్ చేస్తుంది. మెన్షన్ చేసిన కాంటాక్ట్‌లకు మాత్రమే అప్డేట్ కనిపిస్తుంది. అంతేకాకుండా మ్యూటింగ్ సదుపాయం కూడా ఉంది. అంటే మ్యూట్ చేసిన కాంటాక్టుల నుంచి నోటిఫికేషన్లు రావు. ముఖ్యంగా వాట్సాప్ పరిధిలోనే ఉంటూ ప్రైవసీకి భంగం కలుగకుండా చూసుకోవచ్చు. ముఖ్యమైన అప్డేట్స్ అవసరమైన అటెన్షన్ పొందే వీలుకలుగుతుంది. యూజర్ ఇంటరాక్షన్స్ మెరుగవుతాయి. అందరిలో ఉంటూ మనకు అవసరమైన వాళ్లతో మాత్రమే అనుసంధానం కావడం అంటే ఇదే అని కూడా చెప్పుకోవచ్చు.

చాట్ ఫిల్టర్స్

చదవని మెసేజ్‌లను త్వరితగతిన కనుగునేందుకు వీలుగా వాట్సాప్ 'చాట్ ఫిల్టర్స్' ఉపయోగపడనున్నాయి. ఇందుకు అనుగుణంగా చాట్ లిస్ట్ టాప్‌లో మూడు వేర్వేరు ఫిల్టర్లు కనిపిస్తాయి. వాట్సాప్‌లో వచ్చే మెసేజ్‌లను ఆర్గనైజ్ చేసుకునేందుకు ఈ ఫిల్టర్లు ఉపయోగపడతాయి. చాట్‌లిస్ట్ యావత్తూ స్క్రోలింగ్ చేయకుండానే ముఖ్యమైన చాట్స్ యూజర్‌కు తెలుస్తాయి. గూగుల్‌కు చెందిన జీమెయిల్‌లో మూడు ఆప్షన్స్ ఉంటాయి. దాంతో మెసేజెస్ నేవిగేషన్ సులువుగా ఉంటుంది. 2020లోనే ఈ వెసులుబాటు జీమెయిల్‌లో అందుబాటులోకి వచ్చింది. సరిగ్గా అదేమాదిరిగా ఈ చాట్ ఫిల్టర్లు ఉపయోగపడనున్నాయి. ఆల్, అన్‌రీడ్, గ్రూప్ అని మూడు ఆప్షన్స్ చాట్‌లిస్ట్ టాప్‌లోనే కనిపిస్తాయి. ఆల్ అన్నది ఇక్కడ డిఫాల్ట్ వ్యూ. అన్‌రీడ్‌లో యూజర్ మార్క్ చేసినవి కావచ్చు లేదా ఓపెన్ చేయనివి కావచ్చు. గ్రూప్స్‌పై టాప్ చేస్తే అక్కడ కూడా గ్రూప్ చాట్స్, కమ్యూనిటీస్‌కు సంబంధించిన సబ్ గ్రూప్స్ ఉంటాయి. ఏవి ముఖ్యమైనవి, మరేవి చదవాలి, వేటికి సమాధానం ఇవ్వాలి అనే విషయంలో ఇకపై యూజర్‌కు ఇబ్బంది ఉండదు. దీని అప్డేట్ వాట్సాప్ బీటా ఫర్ ఆండ్రాయిడ్‌లో కనిపించింది. మంగళవారమే ప్రకటించిన ఈ అప్డేట్ త్వరలోనే యూజర్లు అందరికీ చేరువ కానుంది.

స్నాప్‌చాట్‌లో వాటర్‌మార్క్

స్నాప్‌చాట్ తాజాగా ఏఐ జనరేటెడ్ ఇమేజెస్ కోసం వాటర్‌మార్క్‌ని తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. తద్వారా దుర్వినియోగాన్ని అరికట్టడానికి తోడు పారదర్శకతను పెంచాలని భావిస్తున్నట్టు తెలిపింది. వాటర్‌మార్క్ ఫీచర్ స్ఫటికం మాదిరిగా స్నాప్ లోగో దానికి తోడు స్పార్కిల్ ఎమోజీతో దర్శనమిస్తుంది. ఏఐ ఇమేజ్ అయితే చాలు, ఇది ఆటోమేటిక్‌గా అప్లయ్ అవుతుంది. యాప్ లేదంటే కెమెరా రోల్‌లో సేవ్ అవుతుంది. అదే సమయంలో ఈ వాటర్‌మార్క్ తొలగింపు అంటే యూసేజ్ నిబంధనలను అతిక్రమించినట్టు లేదా ఉల్లంఘించినట్టు పరిగణిస్తారు. ఏఐ జనరేటెడ్ కంటెంట్ విషయంలో స్నాప్‌చాట్ కూడా మైక్రోసాఫ్ట్, మెటా తదితర దిగ్గజ టెక్ సంస్థలను ఫాలో అవుతోంది. పారదర్శకత, జవాబుదారీతనానికి పూచీపడుతోంది. ఆ క్రమంలో భాగంగా స్నాప్‌చాట్ ప్రస్తుతం సెల్ఫీ నిర్దేశిత 'డ్రీమ్స్' ఫీచర్‌ను పరిచయం చేసింది. దీంతో యూజర్లు తమ ఫొటోలకు ఏఐ జనరేటెడ్ ఎఫెక్ట్స్‌ను పొందవచ్చు.



గూగుల్ వాలెట్ ఇండియాలో ఆరంభం!



గూగుల్ వాలెట్ మొత్తానికి మన దేశంలోకి వచ్చి చేరిందని సమాచారం. ప్లేస్టోర్‌లో లిస్టింగ్ కానుంది. ఈ పరిణామం చోటుచేసుకుంటే మాత్రం డిజిటల్ పేమెంట్స్‌లో గణనీయమైన మార్పులను చూడగలుగుతాం. ఇండియన్ మార్కెట్‌కు అవసరమైన మార్పులు, చేర్పులతో ఇది మనదేశంలోకి వస్తున్నట్టు ఇటీవలి నివేదికలు కొన్ని సూచించాయి. దేశంలోని బ్యాంకులు, ఎయిర్‌లైన్స్ తదితరాలతో కలసి పనిచేయనుంది. ప్రస్తుతానికి ఇది అందుబాటులో లేనప్పటికీ యూజర్లు యాప్‌ను మాన్యువల్‌గా డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్ కార్డులతో లింక్ చేసుకోవచ్చు. కాంటాక్ట్‌లెస్ వ్యవహారాలను సజావుగా సాగించుకోవచ్చు. గూగుల్ పేకు తోడు మరికొన్ని అవసరాలను దీంతో కొనసాగించవచ్చని కూడా చెబుతున్నారు. 'టెక్‌క్రంచ్' దీన్ని మొదట గుర్తించింది. ఎస్‌బీఐ, ఎయిర్ ఇండియా, పీవీఆర్ ఐనాక్స్ కనిపించాయి. అయితే వాటిని గూగుల్ వెంటనే రీప్లేస్ చేసింది. ఈ నేపథ్యంలోనే నాలుగు స్క్రీన్‌షాట్స్ మాత్రం ఇండియన్ ఆడియెన్స్‌ను ఉద్దేశించి కనిపించాయి. ఇంటిగ్రేషన్ విషయంలో ఇంకా అనిశ్చితి ఉంది. నేరుగా ఇది డౌన్‌లోడ్ కావటం లేదు. ఆండ్రాయిడ్ డివైజుల్లోకి లేటెస్ట్ ఏపీకే ఫైల్స్‌ని సైడ్‌లోడింగ్ చేసుకోవాలి. తద్వారా ఈ వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సమాచారం. అలా బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులనూ అనుసంధానించుకోవచ్చు. ఎన్‌ఎఫ్‌సీ ఎనేబుల్డ్ స్మార్ట్‌ఫోన్స్‌లో కాంటాక్ట్‌లెస్ పేమెంట్స్‌కు అలాగే యూపీఐ ట్రాన్సాక్షన్స్‌కు సపోర్ట్ ఉంటుంది. మొత్తమ్మీద వ్యవహారం ఇంకా గందరగోళంలోనే ఉందని చెప్పవచ్చు.

గూగుల్ ప్లే
ఇక ఫింగర్‌ప్రింట్ వెరిఫికేషన్



ఆండ్రాయిడ్ యాప్స్‌నకు సంబంధించి గూగుల్ ప్లే స్టోర్ కొన్ని మార్పులు చేసింది. సాంప్రదాయకంగా వస్తున్న పాస్‌వర్డ్ స్థానే బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను పరిచయం చేసింది. యూజర్ వెసులుబాటు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ మార్పులు చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లు అతి త్వరలోనే ఈ మార్పును గమనించనున్నారు. ప్రస్తుతం దీన్ని పొందేందుకు ప్లేస్టోర్ సెట్టింగ్స్‌లోకి వెళ్ళాలి. పర్చేజ్ వెరిఫికేషన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఆప్షన్‌ను టోగెల్ చేయాలి. ఇందుకోసం గూగుల్ అకౌంట్ పాస్‌వర్డ్ అవసరమవుతుంది. అయితే రాబోయే అప్డేట్‌తో మాత్రం ఈ పని మరింత సూటిగా ఉంటుందని చెప్పవచ్చు. ఇది అందుబాటులోకి తెచ్చుకుంటే యూజర్లు ఇకపై ఫింగర్‌ప్రింట్ లేదంటే ఫేస్ రికగ్నిషన్‌తో ప్లే స్టోర్ నుంచి కొనుగోళ్ళు సాగించవచ్చు. 'యువర్ గూగుల్ ప్లే పర్చేజ్ వెరిఫికేషన్ సెట్టింగ్స్' పేరిట గూగుల్ చేసిన ఈ మార్పులను ఒక ఈ మెయిల్‌లో ప్రకటించింది. రాబోయే వారాల్లో ఈ మార్పు అందుబాటులోకి రానుందని యూజర్లకు తెలిపింది. అలాగే ఈ వెరిఫికేషన్‌లోనూ మూడు ఆప్షన్లను పొందుపరిచింది. ఆల్వేస్, ప్రతి 30 నిమిషాలకు, నెవ్వర్ అని ఉంచింది. కస్టమర్ తనకు అనుగుణంగా ఈ మూడింటిలో ఒకటి ఎంచుకోవచ్చు. యూజర్ సెక్యూరిటీని ఉద్దేశించి ఈ ఆప్షన్లను ఉంచింది. బయోమెట్రిక్ డేటా స్టోరేజ్‌లో మాత్రం యూజర్లు తమ విచక్షణను పాటించాల్సి ఉంటుంది. పిల్లలు, ఇతరుల విషయంలో ఈ జాగ్రత్త అవసరం. ఆ క్రెడెన్షియల్స్ షేరింగ్ కాకుండా జాగ్రత్త పడాలని గూగుల్ హెచ్చరించింది.

వివో వి-30ఇ స్పెసిఫికేషన్స్ లీక్!

వివో వి-30ఇ స్పెసిఫికేషన్స్ లీక్ అయ్యాయి. మందంగా డిజైన్, పవర్‌ఫుల్ కెమెరా, పొటెన్షియల్ చిప్‌సెట్ తదితరాలు రాబోయే వివో స్మార్ట్‌ఫోన్‌లో ఉన్నాయని సమాచారం. వివో ఇటీవల విడుదల చేసిన వి30, వి30 ప్రొ సరసన ఈ కొత్త మోడల్ చేరనుంది. వి30ఇ విషయానికి వస్తే, 3డి కర్వ్‌డ్ డిస్‌ప్లే, డిజైన్ మందంగా ఉండనున్నాయి బ్లూ గ్రీన్, బ్రౌన్




రెడ్ రంగుల్లో లభ్యం కానుంది. టాప్ లెఫ్ట్‌లో సర్క్యులర్ కెమెరా మాడ్యూల్ ఉండొచ్చు. క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 6జనరేషన్ 1 చిప్‌సెట్, 8జీబీ ర్యామ్‌కు తోడు ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్‌టచ్‌ఓఎస్ పై రన్ అవుతుంది.

ఆండ్రాయిడ్ 15 నుంచి వైర్‌లెస్ చార్జింగ్!





ఆండ్రాయిడ్ 15 - ఎన్‌ఎఫ్‌సీ(నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్) వైర్‌లెస్ చార్జింగ్‌ను పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. సాంప్రదాయకంగా వస్తున్న క్యూఐ స్టాండర్డ్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇది ఒక వాట్‌కు మించకుండా, చిన్నపాటి యాక్సెసరీలకు మాత్రమే అందుబాటులో ఉంది. అంటే ట్రాకర్లు, స్టయిలస్, వైర్‌లెస్ ఇయర్‌బడ్స్‌కు మరీ ముఖ్యంగా పవర్ ట్రాన్స్‌మిషన్‌లో పరిమితులను పరిగణనలోకి తీసుకుని దీన్ని తీసుకువస్తోంది. వాటిలో ఉండే లిమిటెడ్ స్పేస్‌తో లార్జర్ చార్జింగ్ కాయిల్స్‌ను పెట్టడం వీలుకాదని, అందుకోసం ఎన్‌ఎఫ్‌సీ వైర్‌లెస్ చార్జింగ్ సదుపాయాన్ని తీసుకువస్తోందని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. దీంట్లో ప్రధాన వెసులుబాటు - కాంపాక్ట్ యాంటెనాలతో పవర్ ట్రాన్స్‌మిషన్ జరుగుతుంది. ఆండ్రాయిడ్ 15 బీటా 1లో ఇటీవలి జరిగిన పరిశోధనలు ఈ విషయాన్ని బైటపెట్టాయి. ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్(ఏఓఎస్‌పీ)తో ఇంకా ఇది ఇంటిగ్రేట్ కాలేదు. అయినప్పటికి జరుగుతున్న పరిణామాలు గూగుల్ చేస్తున్న ప్రయత్నాలను తెలియజేస్తున్నాయి. అయితే, ఈ ఎన్‌ఎఫ్‌సీ వైర్‌లెస్ చార్జింగ్‌లోనూ కొన్ని పరిమితులు ఉన్నాయి. గరిష్ఠంగా ఇది కూడా ఒక వాట్ పవర్‌కు మించి ట్రాన్స్‌మిట్ చేయలేదు. దీంతో ఎక్కువ పవర్ అవసరమయ్యే డివైజ్‌ల పరిస్థితి ప్రశ్నార్థకమే అని చెప్పవచ్చు. అందుకే ఇది ఇయర్‌బడ్స్, స్మార్ట్ వాచీలు, ఫిట్‌నెస్ ట్రాకర్లు లాంటి చిన్నపాటి డివైజ్‌లకే అనుకూలమని భావించవచ్చు. అంటే పెద్ద చార్జింగ్ కాయిల్స్‌ను పెట్టడానికి వీలులేని వాటికే ఇది పనికొస్తుంది.



యాపిల్ ఐఫోన్ నోట్స్‌కు అప్‌గ్రేడెడ్ వెర్షన్స్!



యాపిల్ - ఐఓఎస్ 18తోఉన్న ఐఫోన్ నోట్స్‌యాప్‌ను బిల్ట్ ఇన్ కాలిక్యులేటర్, రికార్డర్‌తో ఇంటిగ్రేట్ చేస్తోందని వినికిడి. ఐఓఎస్ యూజర్లు ఈ నోట్ యాప్‌ని చాలా బాగా ఉపయోగిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఆ యాప్ మరింత ఉపయోగకరంగా ఉండేందుకు వీలుగా ఈ రెంటినీ జోడిస్తోంది. 'యాపిల్ఇన్‌సైడర్' ఈ రెంటినీ ప్రస్తావించింది. వివరాల్లోకి వెళితే...

బిల్ట్ ఇన్ రికార్డర్ ఫీచర్‌తో చాలా సులువుగా రికార్డ్, సేవ్, ఆడియో క్లిప్స్ ప్లే తదితరాలను నోట్స్‌యాప్ పరిధిలోనే చేసుకోవచ్చు. వాయిస్ మెమోతో టెక్స్ట్ లేదా ఇమేజ్‌లను జోడించుకోవచ్చు. క్యాలిక్యులేటర్ ఇంటిగ్రేషన్‌తో నోట్ యాప్‌లోనే మేథ్స్ నోట్స్ క్రియేట్ అవుతుంది. దీంతో యూజర్లు క్లిష్టమైన లెక్కలను సాల్వ్ చేసుకోవచ్చు. అయితే ఈ విషయం రూఢి కావాల్సి ఉంది. మైక్రోసాఫ్ట్‌కు చెందిన వన్‌నోట్ ఫీచర్లతో సమానంగా ఉండనున్నాయి. యాపిల్ కూడా మేక్‌ఓఎస్ కాలిక్యులేటర్ యాప్ డిజైన్‌ను మారుస్తున్నట్టు సమాచారం.

పవర్‌పాయింట్ కోపైలెట్ ప్రాంప్ట్స్ ఇస్తే ప్రజంటేషన్ చేస్తుంది





మైక్రోసాఫ్ట్ 'పవర్‌పాయింట్ కోపైలెట్ అద్భుతాలను సృష్టిస్తుందంటే అతిశయోక్తి కాదు. కొన్ని నిమిషాల్లోనే అవలీలగా ప్రజంటేషన్స్‌ను క్రియేట్ చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దీనికి ఉన్న ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఫీచర్స్‌తో పని చాలా సులువుగా ఉంటుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో వివిధ పనులు సాఫీగా, ఆటోమేటిక్‌గా సాగేందుకు టెక్ కంపెనీలు అందిస్తున్న ఏఐ ఆధారిత టూల్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయి.

మైక్రోసాఫ్ట్ కూడా సరిగ్గా ఆ బాటలోనే నడుస్తోంది. ఇది అందిస్తున్న ఈ టూల్ విషయానికే వస్తే, దీని ఏఐ పవర్డ్ అసిస్టెంట్ వివిధ ప్రజంటేషన్స్ రూపకల్పనలో ఇతోధికంగా తోడ్పడుతుంది. కన్‌వర్షనల్ ప్రాంప్ట్స్‌ను రాస్తే చాలు, యూజర్ అనుకుంటున్న థీమ్‌కు అనుగుణంగా ప్రజంటేషన్ అందిస్తుంది. ఇందుకోసం ఈ టూల్ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్(ఎన్‌ఎల్‌పీ), క్లౌడ్ ఆధారిత ఏఐ ఇంజన్‌ను ఉపయోగిస్తుంది. అలా యూజర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజంటేషన్‌ను సృష్టిస్తుంది. అనుకున్నదే తడవు జరిగిపోవడం అంటే ఇదే అని చెప్పవచ్చు. ప్రభావపూరితంగా దీన్ని ఉపయోగించుకోవడంలో భాగంగా...

- కోపైలెట్‌లోని పవర్ పాయింట్ - కంటెంట్‌కు అనుగుణంగా ఆటో సజెషన్స్ ఇస్తుంది. తద్వారా రైటింగ్, డిజైనింగ్‌లో రిఫైన్‌మెంట్‌కు తోడ్పడుతుంది.
- డిజైన్ సహా స్క్రాచ్ నుంచి యూజర్ పవర్ పాయింట్‌ని డెవలప్ చేసుకోవచ్చు. తదుపరి యూజర్ తన ప్రాధాన్యాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు.
- ఇనీషియల్ డ్రాఫ్ట్‌లతోనూ ప్రయోజనం పొందవచ్చు. ఆపై స్మార్ట్ సజెషన్స్‌తో దాన్ని మెరుగుపర్చుకోవచ్చు. కంటెంట్, డిజైన్‌పరంగా కావాల్సిన రీతిలో రూపొందించుకోవచ్చు. శూన్యం నుంచి అద్భుతాన్ని రూపొందించుకోవడం అంటే ఇదే.
- ఎఫెక్టివ్ కొలాబిరేషన్ ఫీచర్లు కూడా ఉన్నాయి. ఫలితంగా టీమ్ మెంబర్స్‌తో కలిసి చక్కగా పని చేసుకోవచ్చు. ఎడిటింగ్, రిఫైన్‌మెంట్ తదితర పనులను చక్కబెట్టుకోవచ్చు.

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)- 'ఎమ్మెస్సీ ఇన్ అప్లయిడ్ జియాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల


విశాఖ ఐఐపీఈలో ఎమ్మెస్సీ

చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్, సబ్ సర్ఫేస్ మోడలింగ్, ఫాసిల్ ఫ్యూయెల్, గ్రౌండ్ వాటర్ ఎక్స్‌ప్లొరేషన్, డ్రిల్లింగ్, ఎస్టిమేషన్ ఆఫ్ రిసోర్సెస్, సైట్ ఇన్వెస్టిగేషన్ అంశాలకు సంబంధించిన సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫీల్డ్ వర్క్‌లు, ల్యాబొరేటరీ ప్రయోగాలు, రీసెర్చ్ ప్రాజెక్టులు ఉంటాయి. రెండో సెమిస్టర్ చివరలో ఆరు నుంచి ఎనిమిది వారాల వ్యవధి గల సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. జామ్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: జియాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జామ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 22 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **మొదటి అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూన్ 14న
- **రెండో అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూన్ 28న
- **మూడో అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 9న
- **తరగతులు ప్రారంభం:** జూలై 22నుంచి
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 20 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com



ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని దివ్యాంగుల సాధికారత విభాగం నిర్వహిస్తున్న పలు ఇన్‌స్టిట్యూషన్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ) 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ టెస్ట్‌ను కటక్‌లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్) నిర్వహిస్తోంది.

దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(బీఓటీ), బ్యాచిలర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్(బీపీఓ), బ్యాచిలర్ ఇన్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ(బీఏఎస్ఎల్‌పీ) కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు కోర్సులో భాగంగా ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. మిగిలిన ప్రోగ్రామ్‌లకు అదనంగా ఆర్నెల్ల వ్యవధి గల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. అభ్యర్థులందరూ నిర్దేశించిన గ్రామం/జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులు/రీహాబిలిటేషన్ సంస్థల్లో పనిచేయాల్సి ఉంటుంది. పురుషులకు, మహిళలకు విడిగా వసతి సౌకర్యం ఉంది.

క్యాంపస్‌లు-సీట్లు

- **స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్), కటక్:** ఇందులో బీపీటీ 62, బీఓటీ 62, బీపీఓ 46, బీఏఎస్ఎల్‌పీ 10 సీట్లు ఉన్నాయి.
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటార్ డిజెబిలిటీస్(ఎన్ఐఎల్‌డీ), కోల్‌కతా:** ఇందులో బీపీటీ 57, బీఓటీ 56, బీపీఓ 47 సీట్లు ఉన్నాయి.
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్ (ఎన్ఐఈపీఎండీ), చెన్నై:** ఇందులో బీపీటీ 18, బీఓటీ 18, బీపీఓ 20, బీఏఎస్ఎల్‌పీ 27 సీట్లు ఉన్నాయి.
- **కంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రీహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్(సీఆర్‌సీఎస్ఆర్‌ఈ), గువహటి:** ఇందులో బీఏఎస్ఎల్‌పీ 20 సీట్లు ఉన్నాయి.
- **పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పర్సన్స్ విత్ ఫిజికల్ డిజెబిలిటీస్(పీడీయూఎన్ఐపీపీడీ), న్యూఢిల్లీ:** ఇందులో బీపీటీ 68, బీఓటీ 68, బీపీఓ 39 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(బీఓటీ) ప్రోగ్రామ్‌లకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాచిలర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్(బీపీఓ) ప్రోగ్రామ్‌నకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/ స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సీఈటీ 2024 ఫలితాలు వెలువడిన వారంలోపు మార్కుల పత్రాలు, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సికింద్రాబాద్, విజయవాడ
- **ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 23న
- **ఫలితాలు విడుదల:** జూలై 5న
- **వెబ్‌సైట్:** https://admission.svnirtar.nic.in

సీఈటీ 2024 వివరాలు

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రంలో నాలుగు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఎబిలిటీ అండ్ జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి పది ప్రశ్నలు; రెండో పార్ట్‌లో ఫిజిక్స్ నుంచి 30 ప్రశ్నలు, మూడో పార్ట్‌లో కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు, నాలుగో పార్ట్‌లో బయాలజీ(జువాలజీ, బోటనీ)/మేథమెటిక్స్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామ్

ఖాళీలు 827

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్...కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో ఉద్యోగాలను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024

కేటగిరీ-1

మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్): 163 పోస్టులు

కేటగిరీ-2

1. అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే): 450 పోస్టులు
2. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్): 14 పోస్టులు
3. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్): 200 పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయో పరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 32 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.56,100-రూ.1,77,500

దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధా రంగా

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

దరఖాస్తులో సవరణకు చివరి తేదీ: మే 7

రాత పరీక్ష తేదీ: మే 14

వెబ్‌సైట్: https://upsc.gov.in/



జాబ్ కార్నర్

మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మెస్రా, లాల్‌పూర్, నోయిడా, జైపూర్ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు మూడు క్యాంపస్‌లు ఎంచుకొని ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తు ఫారంలో సూచించాలి. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత

- అభ్యర్థులు గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ)/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్)/బీఎస్సీ ఆనర్స్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటర్

బిట్ మెస్రాలో ఎంసీఏ

ఫండమెంటల్స్ నుంచి 50 ప్రశ్నలు; మేథమెటికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 35 మార్కులు రావాలి. వీరిని మాత్రమే ఆన్‌లైన్ ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. దీనికి 100 మార్కులు నిర్దేశించారు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 మార్కులు రావాలి. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 40 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** bitmesra.ac.in



హెచ్‌ఏఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్): 3 పోస్టులు

2. అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్): 3 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు. వేతనం నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ద మేనేజర్(హెచ్ఆర్) రిక్రూట్‌మెంట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్ చిరునామాకు పంపాలి.

చివరి తేదీ: మే 8

వెబ్‌సైట్: https://www.hal-india.co.in/career



ఎన్ఐఈలో ప్రాజెక్ట్ టెక్నికల్ పోస్టులు

తూత్తుకూడి(తమిళనాడు)లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ ...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1(మెడికల్): 1 పోస్టు
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1(హెల్త్ అసిస్టెంట్): 2 పోస్టులు
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1(ఫీల్డ్ అసిస్టెంట్): 1పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయో పరిమితి: ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.67,000; ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.18,000 ఉంటుంది.

ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 23

ప్రదేశం: ఐసీఎంఆర్-ఎన్ఐఈ, తూత్తుకూడి(తమిళనాడు)

వెబ్‌సైట్:https://nie.gov.in/oppurtunities/careers

ఎన్‌పీసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ఖాళీలు 400

ముంబయిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ-న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక ప్రక్రియ: గేట్ 2022/2023/2024 స్కోరు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx



పనికి తగిన గుర్తింపు

ఉదయం.. సమయం తొమ్మిది గంటలు. రంగారావు అనే పెద్దాయన రోడ్డుమీద వెళ్తున్నాడు. అతని వయసు సుమారు అరవై ఏళ్లు. ఉన్నట్లుండి గాలి వచ్చింది. మట్టి అంతా కంట్లో పడింది. పైగా తన తలమీద పెట్టుకున్న క్యాప్ ఎగిరి దూరంగా పడింది. గాలికి ఎగురుతోంది. అదే సమయంలో బడి పిల్లల అరుపులు వినిపించాయి. ఇద్దరు స్నేహితులు బడికి వెళ్తున్నారు. 'బాబు.. క్యాప్ తీసుకొచ్చి సాయం చేయండి' అన్నాడు ఆ పెద్దాయన. మేం స్కూల్‌కి వెళ్లాలన్నారు. పైగా ఆ పెద్దాయనను చూస్తూ 'భలే భలే.. తాతా నీకు తలమీద జుట్టు ఎక్కడికి పోయింది. గాలికి పోయిందా?' అని నవ్వారు.

కాసేపయ్యాక అదే దారిలో లీల అనే విద్యార్థి వచ్చింది. 'నా క్యాప్ దూరంగా పడింది. తెచ్చివ్వండి బాబూ. పుణ్యం ఉంటుంది నాయనా' అనే పెద్దాయన మాటలు విని.. లీల పరిగెత్తింది. ఆ క్యాప్ తీసుకొని వచ్చి పెద్దాయనకు ఇచ్చింది. ఆయనెంతో సంతోషపడ్డారు. ఈ విషయాన్నంతా ఆ స్కూల్ టీచర్ గమనించింది. స్కూల్‌కి పిల్లలు వెళ్లారు. తరగతి గదిలోని పిల్లలతో టీచర్ ఇలా అంది- 'పిల్లలూ మీరంతా లేచి చప్పట్లు కొట్టండి. ఆ చప్పట్లు మన లీల కోసమే' అంది. 'ఎందుకు టీచర్' అని అడిగాడో విద్యార్థి. 'లీలకు హెల్పింగ్ నేచర్ ఉంది. ఉదయాన ఓ పెద్దాయనకు సాయం చేసింది. పెద్దలకు సాయం చేసే గుణమున్న లీలాకు కంపాస్ బహుమతిగా ఇస్తున్నా'నంది ఆ క్లాస్ టీచర్. లీలా ఆనందంగా బహుమతి తీసుకుంది. అదే సమయంలో తాతను ఆటపట్టించి.. నవ్విన ఆ పిల్లలు సిగ్గుతో తలవంచుకున్నారు.

నీతి: ఎవరినీ కించపరచకూడదు. వీలైనంత వరకూ కష్టాల్లో ఉన్న వారిని ఉన్నంతలో ఆదుకోవటం మంచి లక్షణం.


పదాలు కనుక్కోండి

FURNITURE

e	i	v	c	i	a	g	x	m	i	r	r	o	r	b	w
s	q	s	s	u	h	c	u	p	b	o	a	r	d	q	x
c	y	e	t	e	p	j	e	d	u	w	a	c	k	i	j
o	a	d	o	q	f	y	t	a	b	l	e	a	e	e	b
u	r	s	o	k	i	t	d	o	i	e	o	x	q	y	o
c	m	q	l	d	r	s	d	z	w	y	e	d	k	f	o
h	c	h	z	k	e	p	a	s	j	v	v	b	e	d	k
l	h	s	c	r	p	c	c	o	e						c
d	a	b	h	k	l	l	t	f	o						a
x	i	q	a	r	a	e	l	a	g						s
b	r	n	i	b	c	x	n	z	x						e
w	o	t	r	j	e	s	i	d	e	b	o	a	r	d	n


armchair
bed
bookcase
chair
couch
cupboard
fireplace
mirror
sideboard
sofa
stool
table

సరైన నీడ ఏది?





10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 286

						4	5	
	8		4					2
1	3		2				9	
	5				6			9
8								3
9			1				4	
	9				4		1	7
5					8		2	
	6	1						

సుడోకు - 285 సమాధానం

7	1	3	9	8	4	2	6	5
5	6	8	1	3	2	4	9	7
4	2	9	5	6	7	8	1	3
1	8	2	4	5	9	3	7	6
6	4	5	7	2	3	9	8	1
9	3	7	6	1	8	5	2	4
2	5	6	3	9	1	7	4	8
3	9	4	8	7	6	1	5	2
8	7	1	2	4	5	6	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.